ముగిసిన జిల్లాస్థాయి 'ఈనాడు-ఛాంపియన్' క్రికెట్ పోటీలు



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా ఈనాడు, నారాయణ విద్యాసంస్థలు సహకారంతో జరుగుతున్న స్ప్రైట్ ఈసీసీ 2017 కప్ క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. సీనియర్స్ విభాగంలో ఆర్జీయూకేటీ, జూనియర్స్ విభాగంలో ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల మంచిర్యాల జట్లు విజేతలుగా నిలిచాయి.

(వివరాలు 16లో)

ఈనాడు మంచిర్యాల

ఆదివారం 31 డిసెంబరు 2017 | 16 పేజీలు



సాగుతున్న అక్రమాలు.. ఆగేది ఎప్పుడో?

- అవినీతిలో కూరుకుపోయిన అధికారులు, పాలకులు
- నిజాయితీపరులకు బెదిరింపులు
- జిల్లా విభజన తర్వాత మరింత విచ్చలవిడితనం

ఈనాడు–ఆదిలాబాద్

మంచిర్యాల జిల్లా అవినీతి అక్రమాలకు అడ్డాగా మారింది. అక్రమార్కులకు నేతలు, పాలకులే అండగా ఉండటంతో అధికార యంత్రాంగం సైతం చేష్టలుడిగి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కళ్లముందే విలువైన ప్రభుత్వ భూములు మాయం చేస్తున్నా.. చెరువులను కబ్జా చేసినా.. ఖరీదైన ఖనిజ సంపదను కొల్లగొడుతున్నా ప్రశ్నించేవారే లేరు. నాసిరకంగా అభివృద్ధి పనులు సాగుతున్నా అడిగేవారేలేరిక్కడ. పోలీసుల అవినీతి పెచ్చుమీరినా అంతా ప్రేక్షకులే. కొందరు ప్రజాప్రతినిధులు ఉన్నత అధికారులను మచ్చిక చేసుకుని దిగువస్థాయి ఉద్యోగులను భయాందోళనలకు గురిచేస్తున్నారు. పాలకుల ఒత్తిళ్లతో ఆ అధికారుల మెతకవైఖరి వల్ల కిందిస్థాయి సిబ్బంది ఏమీ చేయలేక చేతులెత్తేస్తున్నారు.

పరిపాలనా సౌలభ్యంతోపాటు అవినీతి అక్రమాలను అరికట్టాలనే ఉద్దేశంతో ఏర్పాటైన జిల్లాల విభజన మంచిర్యాల జిల్లాలో అభాసుపాలైంది. విభజన కంటే పూర్వం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి విసిరేసినట్లున్న మంచిర్యాల ప్రాంతంపైన ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించలేకపోయేవాళ్లు. ఆర్నెళ్లకోసారైన జిల్లా పాలనాధికారులు, ఎస్పీలు క్షేత్రస్థాయిలో పర్యటించేవాళ్లుకాదు. విభజనతో ఎటువైపు చూసినా 50కి.మీ దూరంలోనే జిల్లా



అక్రమిత భూమిలో కూరగాయల సాగు



కోటపల్లి మండలం కొల్లూరులో ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టి తవ్వకాలు

విస్తరించి ఉంది. పరిపాలన సౌలభ్యంగా ఉన్నా.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న అవినీతి అక్రమాలపైన జిల్లా అధికారయంత్రాంగం కట్టడి చేయలేకపోతోంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో కొందరు ప్రజాప్రతినిధులు కూడా ఆదాయ వనరులపైనే కన్నేశారు. అడ్డుచెప్పే అధికారుల బలహీనతలను ఆసరాగా చేసుకుని వాళ్లను భయపెట్టో, డబ్బులిచ్చో మచ్చిక చేసుకుంటున్నారు. అదే రీతిన క్షేత్రస్థాయిలో అధికారులకు మామూళ్లిచ్చి అడ్డగోలుగా దోచుకుంటున్నారు. మాటవినని అధికారులను బదిలీలతో బెదిరింపులకు పాల్పడుతున్నారు.

మచ్చుకు కొన్ని..

★ మంచిర్యాల పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారులు పంజావిసురుతున్నారు. వందలాది ఎకరాల (మిగతా 7లో)

ఇక పక్కాగా ఎరువుల లెక్కలు

- కొంటే ఆధార్ నెంబరు చెప్పాల్సిందే
- జనవరి 1 నుంచి ఈ పాస్ ద్వారా అమ్మకాలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే

పంట పొలాలకు ఉపయోగించే రసాయన ఎరువుల అమ్మకం ఇక పక్కాగా జరగనుంది. ఈ-పాస్ యంత్రం ద్వారానే అమ్మకం చేపట్టనున్నారు. రైతు ఎరువులు కొనాలంటే తప్పనిసరిగా తన ఆధార్ నంబరును చెప్పాల్సిందే. జనవరి 1నుంచి జిల్లాలో ఈ వ్యవస్థను పక్కాగా చేపట్టే దిశగా యంత్రాంగం చర్యలు చేపట్టింది. మరోవైపు రానున్న రోజుల్లో మరింత పక్కాగా ఎరువుల అమ్మకాలు జరగనున్నాయి. సంబంధిత రైతు సాగు విస్తీర్ణానికి అనుగుణంగానే ఎరువుల్ని సరఫరా చేస్తారు. ప్రస్తుత కంపెనీలకు (మిగతా 7లో)



ఎరువుల దుకాణాయాజమానులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఎరువు రకం	(ఖరీఫ్,యాసంగి సీజన్లలో) వినియోగం (టన్నులలో)
యూరియా	35,000
డీఏపీ	17,500
కాంప్లెక్స్	15,000
పొటాష్	14,000
★ వ్యవసాయ భూమి 2.40లక్షల ఎకరాలు	
★ ఎరువుల లైసెన్స్ కలిగిన డీలర్లు 291	

సాక్షరభారత్ కొనసాగేనా?



దండేపల్లి మండలం నర్సాపూర్‌లో ఇలా వయోజనులు అందరు కలిసి చదువు నేర్చుకుంటున్నారు. పనులు ముగించుకున్న అనంతరం సాక్షరభారత్ కార్యాలయానికి వచ్చి వర్ణమాల, పదాలు రాయడం, చదవడం నేర్చుకుంటారు. దీంతో సొంతంగా పేర్లు చదవడం, సంతకాలు చేయడం వంటి వయోజనులను నేర్చుకోవాలన్నది పథకం ప్రధాన ఉద్దేశం. పథకం ముగిస్తే ఇలాంటి వారు చదువు నేర్చుకునే అవకాశం ఉండదని వయోజనులు వాపోతున్నారు.

- నేటితో ముగియనున్న గడువు

దండేపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు, కాస్త విద్యా జ్ఞానం ఉన్న వారిని పైచదువుల వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం సాక్షరభారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రతి గ్రామంలో వయోజన విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేసి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ నెల చివరి వరకు దీన్ని నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కేంద్రాలు కొనసాగుతాయా..? గడువు మళ్లీ పొడిగిస్తారా..? అనే విషయాల్లో సమన్వయకర్తలు, వయోజనుల్లో నెలకొన్న అయోమయ పరిస్థితిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

సాక్షరభారత్ 2010లో ప్రారంభమైన ఈ పథకం ఈ ఏడాది మార్చిలోనే ముగిసినా.. సెప్టెంబర్ వరకు పొడిగించి మళ్లీ డిసెంబర్ నెలాఖరు వరకు గడువును పెంచారు. తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో ముందుకు సాగలేదు. దీనికి తోడు గ్రామ, మండల సమన్వయకర్తలకు సరిగా వేతనాలు ఇవ్వకపోవడంతోనూ తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మళ్లీ గడువు పెంచి ఈ పథకాన్ని కొనసాగిస్తారా..? మొత్తంగా ముగిస్తారా..? అనే విషయాలు తెలియకపోవడంతో మండల, గ్రామ సమన్వయకర్తల్లో అయోమయం నెలకొంది. పథకం లక్ష్యం బాగానే ఉన్నా కేంద్రం నిధులు సరిగా కేటాయించకపోవడంతో ఇబ్బందులు మొదలయ్యాయి. వీటిని సరిగా నిర్వహించకపోవడం, పట్టించుకునే వారు లేకపోవడంతో చాలా వరకు మూతపడ్డాయి. ఈ పథకం నిలిచిపోతే నిరక్షరాస్యుల పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.

సరైన ప్రణాళిక లేకనే..

ఏడు సంవత్సరాల కాలంలో యంత్రాంగం విడతల వారీగా కొంత లక్ష్య నిర్దేశన చేసుకొని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేస్తామని ముందుకు వెళ్లారు. అయితే వారు సాధించిన లక్ష్యాలు..కాగితాల్లో చూపుతున్న దానికి వాస్తవ పరిస్థితులకు చాలా భిన్నంగా ఉన్నాయి. ఎక్కడా పథకం విజయవంతంగా అమలైన దాఖలాలు లేవు. పేరుకు మాత్రమే కొనసాగించారే తప్ప..ప్రజలకు పెద్దగా ప్రయోజనం చేకూరలేదని పలువురు అంటున్నారు.

వేతనాలే అసలు సమస్య..

పథకం ఆశించిన స్థాయిలో (మిగతా 7లో)

- జిల్లా జనాభా (2011) లెక్కల ప్రకారం **8,07,037**
- అక్షరాస్యులు **6,19,024**
- నిరక్షరాస్యులు **1,88,013**
- సాక్షర భారత్ కేంద్రాలు **210**
- గ్రామ సమన్వయకర్తలు **420**
- మండల సమన్వయకర్తలు **14**

రూ.7 లక్షల విలువైన ఇనుప చువ్వల పట్టివేత



బిల్లులు లేని ఇనుప చువ్వలను పట్టుకున్న పోలీసులు

మంచిర్యాలనేరవిభాగం: పట్టణంలోని లక్సెట్టిపేటరోడ్డులో గల శ్రీనివాస స్టీల్స్ దుకాణంలో బిల్లులు లేకుండా దిగుమతి అవుతున్న రూ.7 లక్షల విలువ కలిగిన ఇనుప చువ్వలను మంచిర్యాల టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి దుకాణంలో దిగుమతి అవుతున్న సామగ్రిని పరిశీలించి వాటి బిల్లులు ఆరా తీయగా అక్రమంగా సరకు సరఫరా అయినట్లు గుర్తించారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్సు ఏసీపీ విజయసారథి ఆధ్వర్యంలో స్వాధీనం చేసుకున్న వస్తు సామగ్రిని మంచిర్యాల కమర్షియల్ టాక్స్ అధికారులకు అప్పచెప్పగా వారు దుకాణ యజమాని గంప రమేశ్‌కు రూ. 2.30 లక్షల జరిమానా విధించినట్లు ఎస్సై బుద్దె స్వామి తెలిపారు.

పచ్చని సంసారంలో చిచ్చుపెట్టిన పంట నష్టం

● అప్పుల బాధతో రైతు దంపతుల ఆత్మహత్యాయత్నం ● భార్య మృతి, భర్త పరిస్థితి విషమం

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే: పంట నష్టం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. వరి పంటను ఆశించిన దోమ తెగులు పచ్చని సంసారంలో చిచ్చుపెట్టింది. కౌలు తీసుకుని సాగు చేసిన భూమిలో పంట దిగుబడి రాక చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక భార్యాభర్తల మధ్య తలెత్తిన ఘర్షణ భార్యను బలిగొనగా భర్త ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం లక్సెట్టిపేట మండలం చందారం గ్రామంలోని లంబాడి తండాకు చెందిన తేజావత్ బాబూలాల్‌కు సొంతంగా భూమి లేకపోవడంతో కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో భూమిని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఈ ఏడాది ఎప్పటి లాగే ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశారు. అనూహ్యంగా పంటకు దోమపోటు సోకి పంట నష్టపోవాల్సి వచ్చింది. పంట దిగుబడి వస్తుందన్న ఆశతో గ్రామంలో రెండు గదులతో ఈ ఏడు ఇల్లు నిర్మించుకున్నారు. ఈ క్రమంలో రూ. 5 లక్షలకు పైగా అప్పులు చేయాల్సి వచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదే క్రమంలో అటు పంట నష్టపోవడం, మరోవైపు ఇల్లు కట్టుకోవడానికి చేసిన అప్పుతో బాబూలాల్ ఆందోళనకు గురయ్యాడు. అప్పు విషయంలో శనివారం రాత్రి 7 గంటల సమయంలో భార్య యమునకు బాబూలాల్‌కు మధ్య గొడవ జరిగింది. యమున ఆవేశంలో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. ఆమె పరిస్థితి విషమంగా మారడంతో భర్త బాబూలాల్ కూడా పురుగుల మందు తాగాడు. వీరిని ఆసుపత్రికి తీసుకొస్తుండగా యమున(30) మృతి చెందింది. బాబూలాల్(35) పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. వారికి ఇద్దరు పిల్లలు అరవింద్(7), అనిల్(5) ఉన్నారు.



మృతురాలు యమున

మంచిర్యాల ఎస్సైలకు సీఐలుగా పదోన్నతులు

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: మంచిర్యాల పట్టణ ఎస్సైలుగా విధులు నిర్వర్తిస్తున్న బి. సతీష్, బుద్దె స్వామిలు సీఐలుగా పదోన్నతి పొందారు. శనివారం వరంగల్ ఐజీ విడుదల చేసిన సీఐ పదోన్నతి జాబితాలో సతీష్, స్వామిలతో పాటు బెల్లంపల్లి జీఆర్పీ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బన్సిలాల్ సీఐగా పదోన్నతి పొందారు. సతీష్ మంచిర్యాల ట్రాఫిక్ సీఐగా, బుద్దె స్వామి రామగుండం ట్రాఫిక్ సీఐగా, బన్సిలాల్ సిరిసిల్లా సీసీఎస్ సీఐగా బదిలీ అయ్యారు.

రేపు చలో భీమా కోరేగావ్ యాత్ర

శ్రీరాంపూర్, న్యూస్‌టుడే: ఆత్మగౌరం కోసం జరిగిన పోరాటంలో 1818 జనవరి 1న అసువులు బాసిన మహర్ రెజిమెంటు వీరుల త్యాగాలను స్మరించుకుంటూ 2018 జనవరి 1న మహారాష్ట్రలోని పుణె సమీపంలో జరుపతలపెట్టిన చలో భీమా కోరేగావ్ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని పలు దళిత ఉద్యోగ, ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పులి మోహన్, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ సింగరేణి అధ్యక్షుడు మాదాసు రామ్మూర్తి, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికెల సంపత్‌కుమార్, రచయిత తొటపల్లి భూమన్న, తెలంగాణ విద్యా వంతుల వేదిక మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎరుకల చంద్రశేఖర్, బీఎస్ఐ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు గోషిక మల్లేష్‌లు శనివారం విడుదల చేసిన ప్రకటనలో పలు విషయాలు పేర్కొన్నారు. ఆత్మగౌరవం కోసం ఆనాడు పోరాటం చేసి, విజయంతో తిరిగి వచ్చిన మహర్ రెజిమెంట్ సైనిక వీరులకు ఆనాడు అపూర్వ స్వాగతం లభించిందన్నారు. ఆ సైనికుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకునేందుకు జరిగే విజయోత్సవ ర్యాలీలో ప్రజలు, ప్రజాస్వామికవాదులు, అంబేడ్కర్‌వాదులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. ర్యాలీకి హాజరయ్యే వారి కోసం గోదావరిఖని, వరంగల్ డిపోల నుంచి రెండు సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. చారిత్రక ఘట్టంలో పాల్గొనాలనుకునేవారంతా 31.12.2017న ఆదివారం కలిసి రావాలని కోరారు.

మాస్టర్ ప్లాన్ రహదారిలో బోర్డు పాతిన ఎంసీసీ యాజమాన్యం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాలలోని రాముని చెరువుకు, హైటెక్ సిటీకి మధ్యలో గల మాస్టర్ ప్లాన్ రహదారిలో ఆ స్థలం ఎంసీసీ యాజమాన్యానికి చెందిందని బోర్డు ఏర్పాటు చేశారు. ఈ బోర్డుపై సర్వే నెం. 371లో విస్తీర్ణత 2-16 ఎకరాల స్థలం తమ సిమెంట్ కంపెనీకి సంబంధించిందని రాసిపెట్టారు. మాస్టర్ ప్లాన్ రహదారి స్థలం తమదని బోర్డు పెట్టడంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.



మాస్టర్ ప్లాన్ రహదారిలో బోర్డు పాతిన ఎంసీసీ యాజమాన్యం

రాష్ట్రస్థాయి వెటరన్ అథ్లెటిక్స్ పోటీలను విజయవంతం చేయాలి

రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: రామకృష్ణాపూర్ పట్టణంలోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో జనవరి 4, 5 తేదీల్లో నిర్వహించే 4వ తెలంగాణ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలను విజయవంతం చేసేందుకు అందరు సహకరించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు అన్నారు. శనివారం పోటీల జరిగే ఠాగూర్ స్టేడియాన్ని ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పోటీల వివరాలను వెల్లడించారు. జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోటీలను నిర్వహిస్తున్నామని ఇందుకు సింగరేణి యాజమాన్యం సహకరిస్తుందన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 600 మందికిపైగా క్రీడాకారులు పాల్గొంటారని, వీరికి స్థానికంగా సింగరేణి ఉన్నత పాఠశాల, కమ్యూనిటీహాల్‌లో వసతి సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఫిబ్రవరి 10 నుంచి 13 తేదీ వరకు దిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. 40 సంవత్సరాల పైబడి 90 సంవత్సరాల లోపు ఉన్న పురుష, మహిళలు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. సుమారు 15 క్రీడాంశాలపై పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పోటీల నిర్వహణలో భాగంగా తాను నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తుండగా మిగిలిన సభ్యులుగా జడ్పీటీసీ సభ్యుడు కంబగోని సుదర్శన్‌గౌడ్, క్యాతన్‌పల్లి సర్పంచి జాడి శ్రీనివాస్, తెరాస పట్టణ అధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యుడు యాకుబ్‌అలీ, తెబొగకాసం సీనియర్ నేత బోయినపల్లి నర్సింగరావు, కె.సురేందర్ రావు, బైరమల్ల మొగిలయ్య, బొంగోని శంకర్‌లు ఉంటారన్నారు. పోటీల నిర్వాహకులుగా రాజేశ్వర్ రావు, కట్టా ఈశ్వరచారి, రాజబద్రి, లక్ష్మినర్సయ్యలు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.



స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, నిర్వాహకులు

ఏర్పాట్ల పరిశీలన

సింగరేణి ఠాగూర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి మాస్టర్ వెటరన్ అథ్లెటిక్ పోటీల కోసం చేపట్టిన ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు పరిశీలించారు. పోటీల నిర్వహణ సందర్భంగా క్రీడాకారులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వసతి, భోజన సౌకర్యాలపై దృష్టి సారించాలని నిర్వాహకులకు తెలిపారు. విప్ వెంట ప్రజాప్రతినిధులు, తెరాస దాని అనుబంధ సంఘాల నాయకు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెనుకడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం చొరవ

భాజపా జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి


మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: దేశంలోని వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి, అందులో ఉమ్మడి ఆదిలాబాద్‌ను ఎంపిక చేయడం హర్షనీయమని భాజపా జిల్లా అధ్యక్షుడు ముల్కల్ల మల్లారెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీతి అయోగ్ సూచనల మేరకు వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేసే క్రమంలో ఆదిలాబాద్‌కు ప్రత్యేక నిధులు సమకూరుస్తుండటంతో ఈ ప్రాంతం ప్రజలకు మెరుగైన వసతులు సమకూరనున్నాయన్నారు. ప్రధాని మోదీ తలాక్ విషయంలో తీసుకున్న నిర్ణయం లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందటం సంతోషకరమైన విషయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ స్వార్థ ప్రయోజనాలతో కేంద్రం అమలు చేస్తున్న పలు పథకాలతో కూడిన నిధులను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. జిల్లా కేంద్రంలో రెవెన్యూ, మున్సిపల్ శాఖలలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై అధికారులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. పట్టణంలో వాడవాడలా తిరుగుతున్న ఎమ్మెల్యే దివాకర్ రావుకు తాగునీటి సమస్యలు ఎందుకు కనిపించటం లేదో తెలపాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మున్నారాజ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎనగందుల కృష్ణమూర్తి, అసెంబ్లీ కన్వీనర్ అశోక్‌వర్ధన్, కార్యదర్శి తిరుపతి, నాయకులు బొద్దున మల్లేశ్, శశి, వైద్య శ్రీధర్, విజయ్, దాస్యా, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాజపా జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి

గూడెం ఎత్తిపోతల నీరు వృథా

గుడిపేట (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: యాసంగిలో చివరి ఆయకట్టు రైతులకు తొలి ప్రాధాన్యం ఇస్తూ ఇటీవల గూడెం ఎత్తిపోతల పథకం నుంచి విడుదల చేసిన సాగునీరు 42వ డిస్ట్రిబ్యూటరీ కాలువ పరిధిలోని గుడిపేట శివారులో వృథాగా పోతోంది. మిషన్ భగీరథ పనుల్లో భాగంగా ఆ ప్రాంతంలోని సాగునీటి కాలువను నామరూపాల్లేకుండా తవ్వేశారు. దీంతో సమీపంలోని ఇటుకబట్టీలు, భూముల్లో నీరు నిలిచింది. గుడిపేట రైతులకు సాగునీరందడం కష్టంగా మారింది. సాగునీటిని పొదుపుగా విడుదల చేసి గ్రామ చెరువు నింపేలా చూడాలని రైతులు కోరుతున్నారు. సమస్యలు తెలుసుకున్న మండలపరిషత్తు ఉపాధ్యక్షుడు మందపల్లి శ్రీనివాస్ పలువురు రైతులతో కలిసి వృథాగా పోతున్న నీటిని పరిశీలించి తహసీల్దార్ మోహన్‌రెడ్డి, జిల్లా పాలనాధికారి ఆర్వీ కర్ణన్‌ల దృష్టికి తీసుకెళ్లారు.



వృథాగా రహదారిపై పారుతున్న గూడెం ఎత్తిపోతల నీరు

ఉత్కంఠభరితంగా అథ్లెటిక్స్ పోటీలు

బెల్లంపల్లి, న్యూస్‌టుడే: బెల్లంపల్లి పట్టణంలోని తిలక్‌స్టేడియంలో శనివారం రాష్ట్రస్థాయి 5వ మాస్టర్స్ వెటరన్ అథ్లెటిక్స్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. మాస్టర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాల గౌరవ అధ్యక్షుడు, నేతాజీ సుభాష్‌చంద్రబోస్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు, సీఐడీడీఎస్పీ పి.రవికుమార్ నేతృత్వంలో ఈపోటీలను నిర్వహిస్తున్నారు. రెండోరోజు ఈపోటీల్లో ఉమ్మడి పది జిల్లాల నుంచి పలువురు వెటరన్ పురుషులు, మహిళలు వచ్చి క్రీడల్లో పాల్గొన్నారు. షాట్‌పుట్, 10వేల మీటర్ల పరుగుపందెం, 400మీటర్ల పరుగుపందెం,షాట్‌పుట్‌త్రో 1500 మీటర్లపరుగుపందెం, 3వేల మీటర్లపరుగుపందెం, 10 వేల మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో తిలక్‌మైదానం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు, ప్రేక్షకులతో సందడిగా మారింది. ఈకార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు పి.రవికుమార్, జాతీయ సెవన్‌ఏసైడ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.సంజయ్, పర్సనల్ మేనేజర్ జె.కిరణ్, రాష్ట్ర అధ్యక్షుడు మొగిలయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రఘు, ప్రధాన కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, డి.సాంబయ్య మాట్లాడారు. ఈ పోటీల నిర్వహణకు చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.శ్రీనివాస్, ఎం.రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.గోపాల్, కె.రామోహన్, బి.బాబురావు, బి.రవి, ఎం.డి.చాంద్‌పాషా, రాజ్‌మహ్మద్, అనిల్‌కుమార్, బలరాం, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెటరన్ విజేతలు వీరే: 10వేల మీటర్ల పురుషుల పరుగుపందెం 55 ఏళ్ల విభాగంలో పి.నారాయణ ప్రథమ (కరీంనగర్), పి.మోహన్ ద్వితీయ (ఖమ్మం), 50 ఏళ్ల విభాగంలో వి.ఆనంద్ ప్రథమ(ఆసిఫాబాద్), కె.రవిందర్ ద్వితీయ(కరీంనగర్), మహిళల 35 ఏళ్ల విభాగంలో కె.వనజారెడ్డి ప్రథమ(మహబూబ్‌నగర్), 400 మీటర్ల పరుగుపందెం 80 ఏళ్ల విభాగంలో కెఆర్ఆర్ మోహన్‌రావు ప్రథమ(రంగారెడ్డి), 70 ఏళ్ల విభాగంలో పి.వి.సుబ్బారావు ప్రథమ (ఖమ్మం) స్థానం పొందారు. 65ఏళ్ల విభాగంలో వై.రామారావు ప్రథమ(రంగారెడ్డి), వెంకటయ్య ద్వితీయ (మహబూబ్‌నగర్), 60 ఏళ్లవిభాగంలో శంకర్‌సేన ప్రథమ (రంగారెడ్డి) గెలుపొందారు. పోటీల్లో విజేతలైన భారీ జాబితాను ఎన్ఎస్‌సీ బోస్ స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు పి.రవికుమార్, ఇతర సభ్యులు ప్రకటించారు. విజేతలకు సీబీసీఐడీ డీఎస్పీ రవికుమార్, జాతీయ సెవన్‌ఏసైడ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.సంజయ్, ఇతర ప్రముఖులు పతకాలను, బహుమతులు అందించారు.



పరుగుపందెంలో పాల్గొన్న క్రీడాకారులు

ఐదుగురు వాహనచోదకులకు రెండురోజుల జైలు శిక్ష

చెన్నూరు గ్రామీణం: మద్యంతాగి వాహనాలు నడిపిన ఐదుగురు వాహనచోదకులకు రెండురోజుల జైలుశిక్ష విధిస్తూ చెన్నూరు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి ఉదయ్‌భాస్కర్‌రావు శనివారం తీర్పునిచ్చారు. చెన్నూరు పట్టణంలో వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో ఐదుగురు చోదకులు మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడుపుతుండగా.. గుర్తించి పట్టుకున్నామని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అక్రమంగా కలప తరలిస్తున్న బండి పట్టివేత

కడెం, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపూర్ సమీపం నుంచి అక్రమంగా ఎడ్ల బండిలో కలపదుంగలను తరలిస్తుండగా బండిని, కలపను శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎఫ్ఆర్వో రమేష్ రాఠోడ్ తెలిపారు. ఎడ్లు, బండితో సహా కలపదుంగలను అటవీక్షేత్ర కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్వో తెలిపారు. కలపను తరలిస్తున్న వేల్పుల రాజన్నపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కలప విలువ రూ.25,960ఉందని తెలిపారు. బండిని పట్టుకునేందుకు తనతోపాటు ఎఫ్ఎస్ఓ కింగ్‌ఫిషర్, స్ట్రైకింగ్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.

జ్ఞాపకాలు ఘనం.. స్ఫూర్తిమంతం



- 2017లో ఘనమైన విజయాలు
- మంచిర్యాల వైభవాన్ని చాటిన యువత

శ్రీరాంపూర్ గ్రామీణం, మంచిర్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే

కాలం పరుగెడుతున్నా జ్ఞాపకాలు మదిలో శాశ్వతంగా గుర్తుండి పోతాయి. గడిచిన సమయంలో జరిగిన సంఘటనలు మనకు మరుపు రాని గుర్తులుగా నిలుస్తాయి. 2017 చూస్తుండగానే గడిచిపోయినా ఏడాదిలో జరిగిన విషయాలు రాబోవు సంవత్సరానికి స్ఫూర్తిగా నిలుస్తాయి. 2018 సంవత్సరంలోనూ గొప్ప విజయాలు రావాలని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు సాధించిన అరుదైన ఘనతలతో 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

యోగా పోటీల్లో రాజేశ్వరికి తిరుగులేదు..



శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఓరుగంటి రాజేశ్వరి గత సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు నాసిక్‌లో జరిగిన జాతీయస్థాయి యోగా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ పోటీల్లో 28 మంది పాల్గొనగా సింగరేణి ప్రాంతానికి చెందిన ఆమె ఐదో స్థానంలో నిలిచి ఏరియాకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. కోటపల్లి మండలం కొల్లూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఆమె తొలిసారిగా జాతీయస్థాయి యోగా పోటీల్లో పాల్గొన్నారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యోగా కేంద్రంలో రెండేళ్ల పాటు శిక్షణ పొందిన రాజేశ్వరి ఆసక్తితో యోగాలో మెలకువలు నేర్చుకొన్నారు. తాను పని చేసే పాఠశాలలోని విద్యార్థులకు ప్రతిరోజు యోగాసనాలు నేర్పిస్తున్నారు.

పర్యావరణ రక్షకుడికి జాతీయ గుర్తింపు..




సామాజిక అంశాలపై తన కలంతో ప్రజలను చైతన్యవంతులను చేయడంలో యోగేశ్వర్‌ది అందవేసిన చేయి. గత 15ఏళ్లుగా పర్యావరణ శిక్షకుడిగా సేవలందిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ రూపొందించిన బాలసాహిత్యంలో తన రచనలతో ఆకట్టుకున్నారు. తెలుగు భాషా సంరక్షణకు తనవంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా, పర్యావరణ సంరక్షకుడిగా చేస్తున్న సేవలకు జాతీయస్థాయి సామాజిక, సాంస్కృతిక సాహిత్య సేవాసంస్థ యోగేశ్వర్‌కు లైఫ్ టైం అచీవ్‌మెంట్ పురస్కారం పొందారు. పాఠాలు చెప్పడం వృత్తిగా చూస్తే.. పర్యావరణాన్ని కాపాడటం ఒక బాధ్యతగా భావిస్తారు. వ్యాఖ్యతగా అందరిని ఆకట్టుకుంటారు. ఓవైపు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూనే మరోవైపు సామాజిక అంశాలపై చైతన్యం కలిగిస్తున్నారు. ఇటీవల ఉపాధ్యాయుడిగా ఆయన చేస్తున్న సేవలకు కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయి పురస్కారానికి అందించి గౌరవించింది.

బాక్సింగ్ న్యాయ నిర్ణేత మహేందర్



ఇండియన్ అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 10న నిర్వహించిన రింగ్ అఫిషియల్ ఆర్‌అండ్‌జే పరీక్షలో శ్రీరాంపూర్‌కు చెందిన పాదం మహేందర్ ఉత్తీర్ణత సాధించి బాక్సింగ్ రిఫరీ, రింగ్ అఫిషియల్‌గా ఎంపికయ్యారు. ఇకపై రాష్ట్ర, జాతీయ స్థాయిలో బాక్సింగ్ పోటీలు ఎక్కడ జరిగినా వాటికి రిఫరీగా ఆయన సేవలు అందిస్తారు. దేశవ్యాప్తంగా జరిగిన ఈ పరీక్షలో సింగరేణి ప్రాంతానికి చెందిన మహేందర్ తొలిసారిగా అర్హత సాధించారు. బాక్సింగ్ క్రీడాకారుడిగా మంచి గుర్తింపు సాధించి క్రీడా కోటాలో సీఐఎస్ఎఫ్ ఉద్యోగాన్ని సాధించిన ఆయన ప్రస్తుతం ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

కండల వీరుడు.. అంతర్జాతీయ ఘనుడు



తన 10 ఏళ్ల శ్రమకు తగిన గుర్తింపు పొందుతున్నారు జిల్లావాసి గోపు శ్రీనివాస్. ఆర్థికంగా శారీరకంగా ఎంతో కష్టసాధ్యమైన కండలు పెంచుతూ అంతర్జాతీయస్థాయిలో సత్తాచాటుతున్నారు. రెండు మూడేళ్లుగా జిల్లా, రాష్ట్రం, దేశం ఎక్కడ పోటీలు జరిగినా తన ప్రతిభాచాటుతున్నారు. ఈ ఏడాది దక్షిణ కొరియాలో ఆసియా ఖండం వ్యాప్తంగా జరిగిన దేహదారుఢ్య పోటీల్లో 70 కిలోల విభాగంలో కాంస్య పతకాన్ని సాధించి జిల్లాకు గర్వకారణంగా నిలిచారు. జిల్లా అధికారుల ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొన్న ఆయన వారి నమ్మకాన్ని నిలబెట్టారు. ఇటీవల మంగోలియాలో జరిగిన అంతర్జాతీయస్థాయి పోటీల్లోనూ కాంస్య పతకాన్ని సాధించి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందారు.



శ్రీనివాస్ సాధించిన పతకాలు

రగ్బీ ఫుట్‌బాల్‌లో మేటి జిల్లా క్రీడాకారిణి



రగ్బీ ఫుట్‌బాల్.. ఈ క్రీడా గురించి తెలిసిన వారు తక్కువైతే.. తెలియని వారే ఎక్కువగా కనిపిస్తుంటారు. ఈ క్రీడను మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన క్రీడాకారిణి సోబియా మెహనాజ్ ఎంపిక చేసుకున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరుస్తూ జాతీయ, అంతర్జాతీయస్థాయి గుర్తింపు పొందుతున్నారు. సాధారణ మెకానిక్ మహ్మద్ గౌస్‌బాబా- షహనాజ్‌బాను దంపతుల కూతురైన సోబియా ఓ వైపు చదువులో రాణిస్తూనే రగ్బీపై ఇష్టాన్ని పెంచుకున్నారు. ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇటీవల జరిగిన పలు జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ ఆటపై పలువురు చర్చింకునేలా చేశారు. ఈనెల 3న జరిగిన ఇండో, భూటాన్ రగ్బీ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరఫున ఆడారు. తుదిపోరులో మూడు గోల్స్‌చేసి దేశానికి బంగారు పతకం సాధించి పెట్టారు.

శ్లోకాల పఠనం.. ప్రపంచ అద్భుతం



ఈ ఏడాది జిల్లా యువతికి అరుదైన గౌరవం లభించింది. ఆమె ప్రతిభకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చింది. భగవద్గీత శ్లోకాలను అవలీలగా చదవడంతో పాటు నిమిషాల్లో పదుల సంఖ్యలో మూడు భాషల్లో గడ గడా చదువుతూ తన ప్రత్యేకతను చాటుకుంది. రాష్ట్ర, జాతీయస్థాయి కాకుండా ఏకంగా యువతి ప్రతిభకు అంతర్జాతీయ సంస్థ గుర్తింపు వచ్చింది. 'భగవద్గీత ఫాస్టెస్ట్ మిర్రర్ రైటింగ్' బిరుదును పొందారు. జిల్లాకు చెందిన కెశెట్టి శ్రీదేవి-శ్రీనివాస్ దంపతుల కూతురు మనస్విని ప్రస్తుతం డాక్టర్ ఆఫ్ ఫార్మసి చదువుతోంది. చిన్ననాటి నుంచి భగవద్గీతలో పట్టు సాధించింది. ఏదైనా ప్రత్యేకత ఉండాలనే సంకల్పంతో మూడు భాషల్లో చదవడంతో పాటు రాయడం నేర్చుకుంది. ఎంతో కష్టసాధ్యమైన మిర్రర్ రైటింగ్‌లో రాయడం మొదలుపెట్టింది. తన ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా మూడు భాషల్లో 701 శ్లోకాలను రాసి ప్రపంచ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించి అరుదైన ఘనతను సాధించారు.

ప్రమాద రహితంగా నూతన సంవత్సర వేడుకలు జరగాలి

మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే: నూతన సంవత్సర వేడుకలు ప్రమాద రహితంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ పేర్కొన్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా జరిగే వేడుకలలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు ఇవ్వకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, త్రిపుల్ రైడింగ్‌తో ప్రమాదాలు జరుగు అవకాశం ఉందని దీనిపై ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం 7 గంటల నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు విస్తృతమైన తనిఖీలు జరుగుతాయని, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన వారిపై కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు ద్విచక్రవాహనాలను ఇవ్వకుండా, బయట రోడ్లపై తిరగకుండా తగుచర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

నేడు అన్నారం గ్రామానికి కోదండరాం రాక

కోటపల్లి, న్యూస్‌టుడే: కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి ఆదివారం రాష్ట్ర ఐకాస అధ్యక్షుడు ఆచార్య కోదండరాం రానున్నట్లు జిల్లా ఐకాస కన్వీనర్ పోడేటి సంజీవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల ఐకాస కన్వీనర్ కామబాపు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందిన నేపథ్యంలో ఐకాస ఆధ్వర్యంలో గ్రామంలో సంతాప సభ ఏర్పాటుచేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సంతాప సభలో పాల్గొనడంతో పాటు మృతుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు కోదండరాంతో పాటు నాయకులు గురిజాల రవీందర్‌రావు, న్యాయమూర్తి కె.రాజన్న, పలువురు ఉద్యమ నాయకులు వస్తున్నట్లు ఆయన వివరించారు.



విభిన్న సంస్కృతుల వేషధారణలో చిన్నారులు

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనల మేళా

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ ఉషోదయ ఉన్నత పాఠశాలలో శనివారం బ్రిలియన్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, హిందీ, గణితం, రసాయన, భౌతిక, జీవ, సాంఘీక శాస్త్రంలకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రామగుండం పోలీస్ కమిషనర్ విక్రమ్‌జిత్ దుగ్గల్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాలలో రాణించినప్పుడే పూర్తిస్థాయిలో విజేతగా నిలుస్తారని అన్నారు. అనంతరం ఆయన రోడ్డుప్రమాదాల నివారణకు తల్లిదండ్రులతో పాటు చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను తిలకించి వారి ప్రతిభను మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు, తల్లిదండ్రులకు చిన్నారులు చేసిన పాదపూజలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో డీసీపీ వేణుగోపాల్‌రావు, ఏఎంవీఐ శ్రీకాంత్, ఎంఈఓ దాసరి శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ బాలాజీ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలను తిలకిస్తున్న సీపీ విక్రమ్‌జిత్

మంత్రి పదవి నుంచి కడియంను తొలగించాలి

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు రాంమూర్తి

ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే: మాదిగల పక్షపాతిగా వ్యవహరిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరిని వెంటనే పదవి నుంచి తొలగించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసుల రాంమూర్తి డిమాండ్ చేశారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రహదారులు, భవనాల విశ్రాంత గృహంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి మంత్రిగా ఉంటూ ఒక వర్గానికి కొమ్ముకాయడం సరికాదన్నారు. దళితుల స్థితిగతులపై అధ్యయనం చేసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పొట్ట మధూకర్, పట్టణ అధ్యక్షుడు జూపాక సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల టెండర్లలో బెడిసికొట్టిన వ్యూహం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాల పురపాలక సంఘంలో శనివారం వివిధ అభివృద్ధి పనులకు నిర్వహించిన టెండర్లలో గుత్తేదారుల మధ్య సిండికేట్ బెడికొట్టింది. దీనితో గుత్తేదారులు పోటాపోటిగా లెస్ టెండర్లు దాఖలు చేసినట్లు తెలిసింది. రహదారులు, మురుగుకాలువలు, కల్వర్టులు, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులు చేయడానికి రూ.6 కోట్లతో 39 పనులకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించారు. ఈ టెండర్లలో గుత్తేదారులు సిండికేట్ అయి పనులు పంచుకోవడానికి గత వారం రోజుల నుంచి మంతనాలు సాగించారు. వీరిమధ్య సయోధ్య కుదరకపోవడంతో శనివారం గుత్తేదారులు ఒక్కొక్క పనిని ప్రభుత్వ అంచనా వ్యయం కంటే 15 శాతం నుంచి 35 శాతం వరకు తక్కువ కోట్ చేస్తూ టెండర్లు దాఖలు చేసిట్టు తెలిసింది. ఈ టెండర్లను అధికారులు ఇంకా తెరవలేదు.

మంచిర్యాల

రక్తనిధి కేంద్రంలో నిల్వలు

ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే: మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రంలో నిల్వలు శనివారం వరకు ఎ పాజిటివ్ 10, ఎ నెగటివ్ 2, బి పాజిటివ్ 47, బి నెగటివ్ 1, ఏబీ పాజిటివ్ 4, ఏబీ నెగటివ్ 1, ఒ పాజిటివ్ 33, ఒ నెగటివ్ 8 అన్ని పరీక్షలు చేసి సిద్ధంగా ఉన్నాయి. రక్తం అవసరం ఉన్నవారు కేంద్రం స్థిరవాణి సంఖ్య(08736-259259, 252259)లను, లేదా రక్తనిధి కేంద్రం నిర్వాహకుడు డా.డి.విష్ణుమూర్తి చరవాణి(9492557337)ని సంప్రదించగలరు.

ప్రజా ఆరోగ్య పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా జాడి సదానందం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రజా ఆరోగ్య పరిరక్షణ సమతి రాష్ట్ర కార్యదర్శిగా, మంచిర్యాల జిల్లా ఇన్చార్జిగా జాడి సదానందంను నియమించినట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సంపత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి నష్టం కలిగించే పదార్థాల నిర్మూలన కోసం పోరాటం చేస్తూ, ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విధంగా కృషి చేస్తామన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంబరాలు

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: నస్పూర్ మండలంలోని వివిధ పాఠశాల్లో కొత్త సంవత్సర వేడుకలను శనివారం ముందస్తుగా జరుపుకొన్నారు. విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు కేక్ కోసి పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. సీసీసీలోని రేయిన్‌బో ప్లేస్కూల్, రేడియంట్ హైస్కూల్‌లో జరిగిన వేడుకల్లో విద్యార్థులు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్లకార్డుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సీహెచ్.రవీందర్‌రావు, ప్రధానోపాధ్యాయురాలు రజని, అపర్ణశీల, మమత తదితరులు పాల్గొన్నారు.

☛ సీసీసీ విద్యానగర్‌లోని లిటిల్ రోబోస్ పాఠశాలలో శనివారం కొత్త సంవత్సర వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఊట్ల సత్యనారాయణ, కరస్పాండెంట్ రంజిత్‌కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.



నూతన సంవత్సర వేడుకల్లో రేయిన్‌బో ప్లేస్కూల్ చిన్నారులు


శ్రీరాంపూర్‌లో కేక్ తినిపించుకొంటున్న చిన్నారులు

☛ఊరుశ్రీరాంపూర్ అల్లూరి సీతారామరాజు నగర్‌లోని ఎస్ఆర్ఆర్ పాఠశాలలో కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పెట్టం మల్లేష్, కరస్పాండెంట్ రేగళ్ల ఉపేందర్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

☛సీసీసీ కార్నర్‌లోని ఆదిత్య హైస్కూల్‌లో ముందస్తు కొత్త సంవత్సర వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అప్పని తిరుపతి, కరస్పాండెంట్ గోపత్తి సత్తయ్య, ఉపాధ్యాయులు సమ్మయ్య, హీనబేగం, శంకర్, భారతి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

☛ శ్రీరాంపూర్‌లోని శారద శిశుమందిర్‌లో జరిగిన వేడుకల్లో ప్రధానోపాధ్యాయురాలు సౌమ్యరెడ్డి, కరస్పాండెంట్ వై.రాంరెడ్డి విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

☛ సీసీసీలోని శ్రీకృష్ణవేణి హైస్కూల్‌లో జరిగిన ముందస్తు కొత్త సంవత్సర వేడుకల్లో విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు కేక్ కోశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.దేవన్న, కరస్పాండెంట్ విజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలతో పాటు తలమల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. తలమల పాఠశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు రంజిత్ కుమార్ కేకు కోసి విద్యార్థులకు పంచి వేడుకలు నిర్వహించారు. కృష్ణవేణి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ క్షేత్ర అధికారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'హ్యాపీ న్యూ ఇయర్ -2018 ఆకారంలో విద్యార్థులు అలరించారు. ఆయా కార్యక్రమాల్లో చంద్రశేఖర్, రమేష్ చంద్, బైరి రామన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్కే-6 కొత్తరోడ్‌లో కేక్ కోస్తున్న విద్యార్థులు


మాట్లాడుతున్న భాజపా ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, తదితరులు

బీసీ కార్పొరేషన్‌కు అధిక నిధులు కేటాయించాలి

రాపల్లి (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: ప్రభుత్వం బీసీ కార్పొరేషన్‌కు అధిక నిధులు కేటాయించి వారి అభివృద్ధికి పాటుపడాలని భాజపా ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగన్నపేట విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. హాజీపూర్ మండలం రాపల్లిలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన బీసీలకు సరైన ప్రాధాన్యం ఉండడంలేదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఓబీసీలకు ప్రభుత్వం అందించే రెండు పడక గదుల ఇళ్ల పథకాన్ని వర్తింపచేయాలన్నారు. సంక్షేమ పథకాలను సక్రమంగా అమలుచేయడం లేదన్నారు. దీనిద్వారా అనేక మంది బీసీలు నష్టపోతున్నారన్నారు. బీసీల సంక్షేమానికి మరిన్ని నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలువురు ఓబీసీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నస్పూర్ కాలనీ(శ్రీరాంపూర్ గ్రామీణం): ప్రతిఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొన్నప్పుడే ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తవని శ్రీరాంపూర్ జీఎం సుభాని సూచించారు. శనివారం ఏరియాలోని గోదావరి కాలనీలో స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జీఎం ఏరియా అధికారులు, ఉద్యోగులతో కలిసి కాలనీలో నెలకొన్న చెత్తను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు, వారి కుటుంబసభ్యులు కాలనీలను, ఇళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కంపెనీ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. సంస్థ కార్యాలయాలు, గనులు, కాలనీల్లో అపరిశుభ్రం లేకుండా ఉద్యోగులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారంలో ఒక్కరోజు ఉద్యోగులతో కలిసి కాలనీలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన వివరించారు. అనంతరం ఆయన నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సుముదాయ్‌ను సందర్శించి అక్కడ నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం పీవీ సత్యనారాయణ, తెబొగకాసం నేత కె.సురేందర్‌రెడ్డి, డీవైజీఎం(సీ) శ్రీనివాసరావు, ఏజీఎం కేఆర్ ఫణీ, సెక్యూరిటీ అధికారి షఫీ, ఫైనాన్స్ మేనేజర్ రాజం, డీవైపీఎం తుకారాం, ఇతర అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఐక్య వేదిక అడ్‌హక్ కమిటీ ఎంపిక

ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లాలోని బీసీ కులాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక హైటెక్‌సిటీ కాలనీలోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో బీసీల హక్కుల సాధన, అభివృద్ధికి అడ్‌హక్ కమిటీని ప్రకటించారు. సభ్యులుగా బేర సత్యనారాయణ, కల్వల జగన్‌మోహన్‌రావు, కర్రె లచ్చన్న, చిట్ల సత్యనారాయణ, గరిగంటి కొమురయ్య, గాజుల ముఖేష్‌గౌడ్, నీలి శ్రీనివాస్, శ్రీపతి శ్రీనివాస్, గడ్డం సుధాకర్, పెద్దపల్లి పురుషోత్తం, అగల్‌డూటి రాజు, మంతెన గట్టయ్య, తోకల రాయమల్లు, గడ్డం సతీష్‌యాదవ్, సూరినేని సురేష్, సాగర్‌యాదవ్, సుభాష్ గౌడ్, బలికొండ రమేష్, మొగిలి లక్ష్మణ్, తూముల నరేష్, ఒడ్డె శ్రీనివాస్, ఎదునూరి రమేష్, కర్ణ శ్రీధర్, పురాణం లక్ష్మీకాంత్‌లను నియామకం చేశారు.


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

ఆలయంలో ఎమ్మెల్యే అన్నదానం

మంచిర్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీగడప ఉషాదేవి రాజన్న షిర్డి సాయి బాబా దేవస్థానంలో శనివారం ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నదానం చేశారు. ముందుగా కుటుంబసమేతంగా హాజరై ఆలయంలోని సాయినాథున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు వెయ్యిమందికి అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షఫీయోద్దిన్, కారుకూరి చంద్రమౌళి, పూదరి ప్రభాకర్, తెరాస జిల్లా, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలి

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే: చట్టాలపై సమాజంలో ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని లక్సెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి సూచించారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కారుకూరి సురేందర్, పీపీ గడికొప్పుల కిరణ్, సర్పంచి శటగోపం నింబాద్రి, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి సుధాకర్, అంకతి ఏసన్న, కాంద్రపు శంకరయ్య, న్యాయవాదులు రవిందర్, భూమారెడ్డి, శ్రీధర్, నళినీకాంత్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

యువతకు ఉపాధి కల్పించడంపై ప్రత్యేక దృష్టి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సింగరేణి ప్రాంతంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలనే ఉద్దేశంతో యాజమాన్యం ముందుకు సాగుతోందని శ్రీరాంపూర్ జీఎం సుభాని తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా సింగరేణి ప్రభావిత గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు వివిధ వృత్తి శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగానే మోటార్ డ్రైవింగ్‌లో శిక్షణ, వోల్వో వాహనాల డ్రైవింగ్ శిక్షణ, కంప్యూటర్ శిక్షణ, ప్లంబింగ్, హౌజ్ వైరింగ్, ఏసీ మెకానిక్ తదితర కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. యాజమాన్యం ఆదేశాల మేరకు నస్పూర్ కాలనీలోని కార్మిక క్వార్టర్లలో ఏసీలను మార్చిలోపు బిగిస్తామని అందుకు సుమారు రూ.6 కోట్లు ఖర్చు అవుతుందన్నారు. దీనికి సంబంధించి కాలనీల్లో విద్యుత్తు నియంత్రికల ఏర్పాటు, వైరింగ్ మార్పు వంటి పనులను ఇదివరకే ప్రారంభించినట్లు తెలిపారు. 10వ వేతన ఒప్పందం వల్ల శ్రీరాంపూర్ ఏరియాలోని కార్మికులకు 23 శాతం వేతన వృద్ధి జరిగిందని, ఒక్కోకార్మికుడికి రూ.8 వేల నుంచి రూ.16 వేల వరకు జీతాలు పెరిగాయని ఆయన పేర్కొన్నారు.

ఏరియాలో 80 శాతం బొగ్గు ఉత్పత్తి

డిసెంబర్ నెలాఖరు నాటికి శ్రీరాంపూర్ ఏరియాలో 80 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధించినట్లు జీఎం తెలిపారు. ఏరియాలోని భూగర్భ గనులు 107 శాతం బొగ్గు ఉత్పత్తిని సాధిస్తే, శ్రీరాంపూర్ ఉపరితల గనిలో 61 శాతం ఉత్పత్తి నమోదైందన్నారు. డిసెంబర్‌లో ఏరియా ఉత్పత్తి లక్ష్యం 4,91,154 టన్నులకు గాను 3,92,825 టన్నులు సాధించిందని పేర్కొన్నారు. ఏరియాలోని ఆర్కే-5, ఆర్కే-6, ఎస్సార్పీ-1, ఎస్సార్పీ-3, ఐకే-1ఏ, ఆర్కే-7 భూగర్భ గనులు వంద శాతం ఉత్పత్తి నమోదు చేశాయన్నారు. ప్రస్తుతానికి ఏరియాలో ఉత్పత్తి ఆశాజనకంగానే ఉందని, రానున్న రోజుల్లో కార్మికులు ఇదే స్ఫూర్తితో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎస్ఓటు జీఎం పీవీ సత్యనారాయణ, ఏజీఎం ఫణీ, డీవైపీఎం తుకారాం తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పోరాడి హక్కులు సాధించుకోవాలి

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే: ఆదివాసీలు శాంతియుత పోరాటాల ద్వారా హక్కులు సాధించుకోవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కుడిమెత తిరుపతి అన్నారు. స్థానిక విశ్రాంతి భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఆవేశకావేశాల వల్ల కేసుల్లో ఇరుక్కుంటే జీవితాలు అంధకారంగా మారుతాయని ఆయన అన్నారు. సమస్యలు ఉంటే సామరస్యంగా సాధించుకోవాలని, అవసరం అనుకుంటే సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. పుకార్లను నమ్మకుండా నిజానిజాలను తెలుసుకున్న తర్వాతనే స్పందించాలని ఆయన కోరారు. తోటి సేవా సంఘం జిల్లా నాయకులు గుర్రాల శ్రీనివాస్, ధర్మారావు, సోయం జంగు, అడ కాంతారావు, బద్ది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తిరుపతి

మంచిర్యాల

8న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

చెన్నూరు గ్రామీణం: మండలంలోని సుద్దాల గ్రామంలో జనవరి 8న తెరాస యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొటారి దేవేందర్, రామగిరి అంజిలు తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 7లోపు తమ జట్టు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పోటీలను ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వివరాల కోసం 96405 28146, 99121 30800 చరవాణి సంఖ్యలను సంప్రదించాలని కోరారు.



సంబరాలు జరుపుకొంటున్న గెలుపొందిన జట్టు

క్రీడాస్ఫూర్తిని చాటాలి

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే: క్రీడా కారులు గెలుపు ఓటములను ఒకే విధంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తిని చాటాలని లక్సెట్టిపేట సీఐ డి.ప్రతాప్ అన్నారు. మండలంలోని అంతక్‌పల్లి గ్రామంలో రైజింగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గెలుపొందిన కొత్తూరు జట్టుకు రూ.10 వేల నగదు బహుమతి, కప్పు, రన్నర్‌గా నిలిచిన కొమ్ముగూడెం జట్టుకు రూ. 5 వేల నగదు బహుమతి, కప్పు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి ఎరవేణి రాజాగౌడ్, ఉప సర్పంచి కలాల రమేష్, ఆసాది పురుషోత్తం, గుర్రాల శ్రీనివాస్ రెడ్డి, లింగంపల్లి వెంకటేష్, రైజింగ్ స్టార్స్ యూత్ అధ్యక్షుడు గణవేణి పోచకుమార్, ఎంబడి శ్రీకాంత్, తోట సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

లక్సెట్టిపేట, న్యూస్‌టుడే: రహదారి ప్రమాదంలో మృతి చెందిన పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు రాంచందర్ కుటుంబ సభ్యులతో పాటు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన లక్సెట్టిపేట పట్టణానికి చెందిన నారాయణ, ఊత్కూర్‌కు చెందిన మల్లేష్, సునిత, వెంకట్రావుపేటకు చెందిన వెంకటి, ఇందూర్ కుటుంబాలను మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్ రావు శనివారం పరామర్శించారు. నారాయణ, మల్లేష్, సునీత, వెంకటి, ఇందూర్ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారి కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. రాంచందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కొత్త వెంకటేశ్వర్లు, మోత్కూరి వెంకటస్వామి గౌడ్, చింత అశోక్, పెండెం రాజు, రాందేని వెంకటేష్, కలాల రమేష్, అబ్బు, దేవేందర్ రెడ్డి, నలిమెల సత్తయ్య, బండి రాజలింగు, కోనకిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్ద జీయరుస్వామి పరమపద ఉత్సవం

మంచిర్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే: ధనుర్మాస వ్రత మహోత్సవాలు, శ్రీవెంకటేశ్వర శరణాగతి దీక్షలను మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి మంగళ శాసనాలతో జెట్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో స్థానిక తితిదే కళ్యాణ మండపంలో వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం సేవాకాలం, సామూహిక శ్రీవిష్ణుసహస్ర పారాయణము, శ్రీమద్భగవద్రామానుజుల వైభవ ప్రవచన కార్యక్రమాలు నల్లాన్ చక్రవర్తుల విష్ణుప్రియ అధ్యక్షతన వైభవోపేతంగా జరిపిస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం పెద్ద జీయరుస్వామి పరమపద ఉత్సవం జరిపించారు. ఆయన చిత్రపటానికి పూలమాలువేసి జీయరుస్వామి గొప్పతనాన్ని విష్ణుప్రియ వివరించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణి ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు రాజేశ్వరరావు, సభ్యురాలు ఉమా, భక్తులు పాల్గొన్నారు.



పెద్ద జీయరుస్వామి గురించి వివరిస్తున్న నల్లాన్ చక్రవర్తుల విష్ణుప్రియ



హాజరైన వికాస తరంగిణి సభ్యులు, భక్తులు

మున్నూరుకాపు భవనానికి ముందడుగు

భూమిని విరాళంగా ప్రకటించన రాజలింగు

ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లా కేంద్రంలో మున్నూరుకాపు సంఘ భవనానికి ముందడుగు పడింది. నిర్మాణానికి కావాల్సిన భూమిని సంఘం గౌరవ అధ్యక్షుడు బొలిశెట్టి రాజలింగు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం విరాళంగా ఇచ్చారు. శనివారం పట్టణంలోని రహదారులు, భవనాల విశ్రాంత గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాతపూర్వకంగా సంఘ పెద్దలకు అందించారు. ఈ సందర్భంగా రాజలింగును ఘనంగా సన్మానించారు. నిర్మాణానికి దాతలు ముందుకురావాలని జిల్లా కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, పుర ఉపాధ్యక్షుడు నల్ల శంకర్, గౌరవ అధ్యక్షుడు గొంగళ్ల శంకర్, ప్రధాన కార్యదర్శి సల్ల నరేష్ కార్యనిర్వాహక అధ్యక్షుడు బోరిగం రాజారాం, రాష్ట్ర ఉపాధ్యక్షులు పుర కో-ఆప్షన్ సభ్యుడు తోట తిరుపతి, ఆకుల సత్తయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు పల్లె భూమేష్, కార్యదర్శి ఇప్ప రమేష్, మాజీ అధ్యక్షులు పెంట రాజన్న, పెద్దపల్లి తిరుపతి, రాధాకిషన్ రావు, పట్టణ అధ్యక్షుడు పానుగంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మంచిర్యాల సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు లింగం రాజయ్య, కౌన్సిలర్లు పూదరి ప్రభాకర్, పడాల రామన్న, నాయకులు ఎగ్గన ఆగారావు, ఎడ్ల శంకర్, సింగల్ విండో డైరెక్టర్ బొలిశెట్టి రాజలింగు, నాయకులు పూరెళ్ల పోచమల్లు, వేణుమాధవ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



మున్నూరుకాపు సంఘ భవనానికి భూమి విరాళంగా ఇచ్చిన దాత బొలిశెట్టి రాజలింగును సన్మానిస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

గడప గడపకు కాంగ్రెస్

ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే: గడప గడపకు కాంగ్రెస్ అనే నినాదంతో మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు మంచిర్యాల జిల్లా కేంద్రంలో చేపట్టిన కార్యక్రమం కొనసాగుతోంది. ఆయన సతీమణి, కాంగ్రెస్ నాయకురాలు కొక్కిరాల సురేఖ పట్టణంలో పలు వార్డులను సందర్శిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా శనివారం 25వ వార్డులో పర్యటించి మహిళలతో మాట్లాడారు. ప్రజల ఇబ్బందులు తెలుసుకుంటూ పరిష్కరించేందుకు కాంగ్రెస్ కృషి చేస్తుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో హేమలత, పడాల మాధవి, పెంట రజిత, శ్రీదేవి, పల్లవి, కళావతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకురాలు కొక్కిరాల సురేఖ తదితరులు

అణచివేతలకు గురవుతున్న నేతకాని కులస్థులు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: దశాబ్దాల తరబడి నేతకాని కులస్థులు అణిచివేతకు గురవుతున్నారని ఆ సంఘం నియోజకవర్గ ఇన్చార్జి రావుల తిరుపతి అన్నారు. గడపగడపకు నేతకాని సంఘం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని సుద్దాల గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో 65 వేల ఓటర్లు ఉన్నప్పటికీ రాజ్యాధికారానికి దూరంగా ఉన్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు నాయకులు నేతకానిలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని ఆరోపించారు. అన్నిరంగాల్లో ప్రాధాన్యం కల్పించిన పార్టీలకే అండగా నిలుస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో నాయకులు కోట బాపు, దుర్గం నగేష్, దుర్గం సంతోష్, జనగామ శాంతివిక్రమ్, కొరారి దేవేందర్, పాగె శేఖర్, జాడి శ్రావణ్, గొదారి రమేష్, కొరారి వెంకటేష్‌లు పాల్గొన్నారు.



పరిసరాలను శుభ్రం చేస్తున్న విద్యార్థినులు

ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం ప్రారంభం

మంచిర్యాలవిద్యావిభాగం, న్యూస్‌టుడే: పట్టణంలోని సాయికుంటలో శనివారం మంచిర్యాల వృత్తివిద్యాకళాశాల విద్యార్థుల ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం ప్రారంభమైంది. సాయికుంటలోని చెన్నూరురోడ్డు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని నేటి యువత సేవా దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. పదిహేను రోజుల పాటు సాయికుంటలో విద్యార్థులు పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, నోడల్ అధికారి రాజేశంగౌడ్, ప్రధానోపాధ్యాయుడు భీంరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి శ్రీదేవి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

తాళ్లపల్లి(శ్రీరాంపూర్ గ్రామీణం), న్యూస్‌టుడే: నస్పూర్ మండలం తాళ్లపల్లి గ్రామంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా జూనియర్ పశువైద్యాధికారి తిరుపతి వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఐత శంకర్, కార్యదర్శి ఎస్కే సఫ్దర్‌అలీ, ఎంపీటీసీ బండారి సుధాకర్, వార్డు సభ్యులు ముదాం చంద్రయ్య, రుకుం తిరుమల్, విశ్రాంత పశువైద్యాధికారి భద్రయ్య, సిబ్బంది పద్మ, గోపాల మిత్ర, సురేష్, ప్రేమ్, యాకూబ్, మనోజ్, సురేష్, మహేష్, కిరన్ తదితరులు పాల్గొన్నారు.

EENADU CLASSIFIEDS

AGRIBUSINESS

సిరులు కురిపించే శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలను మీ పిల్లలకు ఆస్తిగా ఇవ్వండి. అన్ని రకాల శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలు అతి తక్కువ ధరకే లభించును. ✆ 9177773683

AUTOMOTIVE

VEHICLES FOR SALE

2017 NEW **ASHOK** Leyland 51 Seaters 15,25,000/-. 2011 Leyland 210 Wheel Base 51 Seater 7,95,000/-. 2012 Swaraj Mazda 32 Seaters 6,95,000/-. Finance 75% available. ✆ 95333 31111.

Doctors Vehicle, Sincle Hand driving, good condition, 2011 Model Nissan Micra Diesel. Contact: 62815 26093.

BUSINESS SERVICES

BUSINESS OFFER

NOVOPAY - RBL BANK ఆధార్ ఆధారంగా అన్ని బ్యాంకుల నుండి మనీ విత్‌డ్రా, డిపాజిట్ & ట్రాన్స్‌ఫర్ చేయవచ్చు. జిల్లాలోని అన్ని మండలాలు & గ్రామాల వారిగా కస్టమర్ సర్వీస్ పాయింట్స్ ఇవ్వబడును. ✆: 9618725273, 9052252232.

మన జిల్లాల్లో అన్ని మండలాలలో GST సెంటర్‌లలో ఏర్పాటుకు మరియు జాబ్ కొరకు సం॥ ఇన్ఫోటెక్ కంప్యూటర్స్. 9502856188, 9603767000.

LED Lights తయారుచేస్తూ రోజూ అధిక ఆదాయం సంపాదించండి. రా మెటీరియల్ ఫ్రీ. బైబ్యాక్ అగ్రి 2yrs. No Processing Fee ✆ 7840075254/ 7210864919

రూ. 6000/- లతో టూర్ బుక్ చేసుకుని పార్ట్/ఫుల్ టైంగా 2 బుకింగ్ చేయడంద్వారా ఆదాయాన్ని, బహుమతులను, సాలరీని &ఉచిత విమాన టికెట్లను పొందండి. 99897 66040

FOR SALE

Medical Equipment for sale 1) IVF Equipment Complete, 2) 6.5 A.C. Unit, 3) 50 MA X-Ray Plant with table & all Accessories for sale. As an Where in Karimnagar. Cell: 94400 62272, 94400 77955.

EDUCATION

DISTANCE EDUCATION

Guidence for 10th, 12th, Degree, PG, MBA, MCA, B.Ed, D.Ed, B.Tech, ITI, LLB, M.Ph, PHD St. Aloysius March Exams ✆ 9160081597/ 7093266087

HEALTH CARE

NUERO

మేద న్యూరో కేర్ మంచిర్యాల నందు ప్రతి ఆదివారం న్యూరో ఫిజీషియన్ డా॥ శరవణ్ కుమార్ దేవులపల్లి MD, DM (న్యూరో USA) గారు అందుబాటులో కలరు. తీవ్రమైన తలనొప్పి, వెన్నునొప్పి, మెడనొప్పి, శరీరంలో ఒక ప్రక్కకు లాగడం నరములకు సంబందించిన అన్ని వ్యాధుల చికిత్స కొరకై సంప్ర: 73309 93507, 94946 16108.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

కాలసర్ప, కుజ, ఇతర గ్రహదోషాలు మీ జాతకంలో ఉన్నట్లైతే తెలియజేస్తూ ఉచితంగా గ్రహకుండలి పంపగలను. మీ పేరు, పుట్టిన తేది, సమయము తెలుపగలరు. 92471 31753, 91107 26586. whatsup.

PEOPLE CARE

OLD AGE HOME

మీ ఇంటివద్ద వృద్ధులను చూసుకొనుటకు ఇంటిపని, వంటపని చేయుటకు ఆడవాళ్ళని మగవాళ్ళని 24 గం॥లు సర్వీస్సు ఇవ్వగలము. హైదరాబాద్. ✆ 97043 71576, 72860 26405.

REAL ESTATE

FLAT FOR SALE

నవ్యాంధ్ర రాజధాని అమరావతి నందు గేటెడ్ కమ్యూనిటీలో 1BHK 10 లక్షలు, 2BHK 14 లక్షలు, 15 లక్షలు, 18 లక్షలు ఎమినిటీస్ + ✆ 81010 10169, 81010 10168.

HOUSE FOR SALE

శామీర్‌పేట దగ్గర HMDA గేటెడ్ కమ్యూనిటీలో 2 BHK ఇండిపెండెంట్ ఇండ్ల ధరలు 24 లక్షలు & 30 లక్షలు & ఓపెన్ ప్లాట్లు 80% బ్యాంక్ లోన్‌తో సేల్‌కు కలవు. PMAY స్కీం ద్వారా దాదాపు 2 1/2 లక్షల ఋణ మాఫీ ఆఫర్ కలదు. Hyd. అశోక్ 95159 79010.

ఇన్ఫోసిస్, రాంపల్లి, ఘట్‌కేసర్‌లలో అపార్ట్‌మెంట్ ధరకే ఇండిపెండెంట్ ఇళ్లు అమ్మబడును. పరిమిత ఇళ్లు మాత్రమే కలవు. ✆ 9966330993, 9390330993.

LAND FOR SALE

134 ఎకరాల పండ్లతోట నెల్లూరు జిల్లా ఒజిల్ మండలం ఆర్మేనుపాడు గ్రామం NH 15 కు దగ్గర్లో సూర్యవనం అమ్మకం. 94401 83778, 94917 79999.

PLOT FOR SALE

మంచిర్యాల జిల్లా వాసులకు శుభవార్త మంచిర్యాలలోని హనుమాన్ కన్సల్‌టెన్సి ద్వారా ప్లాట్లు లేదా ఇల్లు కొన్నవారికి వారి డబ్బు వాపస్ 13 నెలల్లో ఇస్తూ ప్లాట్లు విక్రయించబడును. సం॥ 99498 34946.

Siyora వారి LP/HMDA/2016 ప్లాట్స్ 90%లోన్ సౌకర్యం. వరంగల్‌హైవే బీబీనగర్, 100ft రోడ్స్ RRR ప్రక్కన రైల్వే మెడికల్ హబ్ దగ్గర. ✆ 9985929119.

హైదరాబాద్ పెద్దఅంబర్‌పేట్, హయత్‌నగర్, కొహెడ, జనచైతన్య, శ్రీమిత్ర, అ॥మెట్, బాటసింగారం, తుర్కయాంజాల్, శంషాబాద్‌లో ప్లాట్లు కొనబడును. ★ రవి 9347454990/ 9849454990

మంచిర్యాల్ పద్మశాలినగర్ Opp: SR Digital School దగ్గర 2 గుంటలు (47x47) గల open plot అమ్మబడును. నో బ్రోకర్స్. Cont: 99599 74125.

మంచిర్యాల పట్టణంలోని గోపాల్‌వాడకు అతి దగ్గరలో 200 చ॥గ॥ ప్లాట్ అమ్మబడును. (నో బ్రోకర్స్). సెల్: 93936 55316, 73866 70872.

మంచిర్యాల లక్ష్మి టాకీస్ బైపాస్ రోడ్, లక్ష్మినగర్ Road No. 4 ఓపెన్ ప్లాట్ 1016 చ॥ గజాల ప్లాట్ అమ్మబడును. Contact: 98494 82700, 94415 20543.

PROPERTY FOR SALE

మడిగెలు అమ్మబడును

నిర్మల్ పట్టణములోని కంచరోని చెరువు ఎదురుగా రిజిస్ట్రేషన్ ఆఫీస్ ప్రక్కనగల 2 షట్టర్లు (మడిగెలు మరియు సెల్లార్) అమ్మబడును.

Contact:
9848231326
9849319248

JOBS

TCS Training & Placement Program, Eligibility Any Degree/ B.Tech (2014-17) Now in Warangal for Admission Cont: TCS- Ion Centre, GMR & GS Complex, 2nd Floor, Kishanpura, HNK. Cell: 7680949545, 8297112859.

Wanted Teacher to Teach English for 1st to 5th Classes. English Fluency in must. S.G.V School, Chennur. Hostel Facility Available. Cell: 85004 94397.

Required P.R.O.'s for Admissions in D.Ed. (T.T.C) U.M. SLS College of Education, Kurnool. & Sree Sai College of Education, Nandikotkur, Kurnool (Dt.) Contact: 98486 03082.

Wanted : Sales Boys, Girls & Computer Operator for Padmavati Super Market, Dasnapur, Adilabad. Cell : 7013515957, 9848234544.

R9S సెక్యూరిటీ సర్వీసెస్‌లో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, హౌజ్ కీపింగ్, ANM, GNM, Lab Technician, CT Scan Technician కావలెను. సెల్: 80194 49991, 99083 01932.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం హైదరాబాద్‌లో ముసలివారికి సేవచేయుటకు స్త్రీ/ పు॥ 100 మంది వెంటనే కావలెను. వ: 20-50 సం. లు, మంచి జీతం+ భోజనం వసతి ఉచితం. ఏజంట్లు కూడా కావలెను. మంచి కమీషన్ కలదు. ✆ 95151 19570, 98493 26690.

ప్రముఖ సర్వేసంస్థలో 2 సంవత్సరాల వరకు సామాజిక, రాజకీయ అవగాహన ఉన్న వ్యక్తులు, సంస్థలు కావలెను. Qly: డిగ్రీ & ఎబో సం॥ప్ర॥ 7337409798/ 9640498417

Wanted for Sales Excutive for Parkal masale & Food in Adilabad area Contact: 9154138138, 9011234138.

మంచిర్యాల, కాగజ్‌నగర్ SONALIKA TRACTORS Showroomsలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటీవ్స్ కావలెను. Salary+ Incentive+ TA (15,000-20,000) వరకు వస్తుంది. సంప్ర॥ 79979 91406, 79979 91407.

హైదరాబాద్‌లోని ఒక చిన్న కుటుంబానికి ఇంటిలో ఉండి పసిబిడ్డను చూసుకోవటానికి మరియు వంట చేయటానికి ఇద్దరు మహిళలు కావలెను. వయసు 30 సం॥లు, అనుభవం 2-3 సం॥లు, జీతము: 10,000 - 12,000, 9848069663కు కాల్ చేయండి.

మంచిర్యాలలో ప్రకృతి చికిత్సల్లో 3 నెలలు ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించబడును. పదోతరగతి ఆపై చదివిన వారు అర్హులు. సంప్రదించండి: 96522 27079, 90599 87308.

ITI Freshers ఫిట్టర్స్ & ఎలక్ట్రీషియన్స్ అర్జంటుగా కావలెను. జీతం: 10,000 - 15,000/- Contact : 9949987087/ 8466999982

ఆయా, వార్డ్‌బాయ్స్, ANM & GNM లు హైదరాబాద్‌లో గల అభయ ఓల్డేజ్ హోంలో పనిచేయుటకు కావలెను. జీ॥ 8 వేల నుండి. + భోజనం+ వసతి 93917 71029/ 96035 71029

3 స్టార్, 5 స్టార్ హోటల్‌లో క్యాటరింగ్ బాయ్స్ కావలెను. రూమ్, మీల్ ఫ్రీ. జీతం: 14,500/-, వయస్సు: 18-35 సం॥. ✆ 7032144066/ 8501014020

ముసలి బామ్మలకు సేవ చేయుటకు ఆయాలు (స్త్రీలు) కావలెను. జీతం: నెలకు 10,000/- + భోజనం+ వసతి. సాయిబాబా వృద్ధాశ్రమం సికింద్రాబాద్- 09. ✆ 9505512220/ 9247593725

Hyd లో 5 స్టార్ హోటల్స్‌లో పనిచేయుటకు హెల్పర్స్ కావలెను. జీతం:12,000. రూం+మీల్స్ ఫ్రీ. డైరెక్ట్‌జాబ్. Age: 18-28. Cont: 9581678034/ 9912074715.

ప్రముఖ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీకి గ్రామాల, మండలాల వారీగా ఏజెంట్స్ కావలెను. అధిక ఆదాయం, మంచి భవిష్యత్తు. R.M.P.'s, నిరుద్యోగులు, గృహిణులు, LIC ఏజెంట్స్, ప్రైవేట్ ఉద్యోగులకు ప్రాధాన్యత. సెల్: 99089 06703.

మంచిర్యాలలోని ప్రముఖ ఫర్నిచర్ షాపులో పనిచేయుటకు సేల్స్ గర్ల్స్, హెల్పర్స్ మరియు ఫిట్టర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్ర॥ 9515612345.

హైద్రాబాద్ 5స్టార్ హోటల్స్‌లో క్యాటిరింగ్ బాయ్స్ కావలెను జీ: 8000/- 12000/- రూం+ భోజనం+ బస్‌పాస్ ఫ్రీ. Age: 18-25. No Fee. ✆ 7337004199/ 9553205592

KNR, WGL, Hyd. ఏరియాలలో గల ప్రముఖ కంపెనీల యందు పని చేయుటకు బ్రా.మె., RCP, ఆ. స్టాఫ్, S/G, S/W, ITI ట్రేడ్స్. రూం ఫ్రీ. వెంటనే సంప్ర: 95052 89868, 91218 34769.

MARKETING / SALES

సేల్స్ ఏజెంట్స్ కావలెను. ఆధునికంగా మన సంస్కృతిని కాపాడుకుందాం అన్ని శుభకార్యాలకు వేద ఆశీర్వచనాన్ని మీ సందేశంతో పాటు వీడియోద్వారా పంపించండి. FB/ వాట్సాప్‌లో షేర్‌చేసుకొండి. Ph: 9701763388

MEDICAL

Wanted M.S. Ortho Surgeon and B.Sc GNM or ANM Nurses for 50 Bed Multi Speciality Hospital Accommodation with Attractive Salary. Cont: 91820 95551.



అట్టహాసంగా టీ-20 క్రికెట్ పోటీలు ప్రారంభం

- తొలిరోజు మంచిర్యాల, ఆదిలాబాద్ జట్ల విజయం
- తలపడుతున్న నాలుగు జిల్లాలు

గుడిపేట (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా క్రికెట్ అసోసియేషన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వెంకటస్వామి మెమోరియల్ టీ-20 క్రికెట్ పోటీలు శనివారం హాజీపూర్ మండలం గుడిపేటలోని 13వ పటాలంలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలను కమాండెంట్ జీవీఎస్ మూర్తి ప్రారంభించారు. ఇందులో ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక చేసి ఉన్నత స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత కల్పించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ప్రదీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు వేణు, కోచ్ సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కమాండెంట్ జీవీఎస్ మూర్తి, తదితరులు

ఆసిఫాబాద్‌పై మంచిర్యాల విజయం

తొలిరోజు మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జట్లు పోటీపడ్డాయి. ఇందులో మొదట బ్యాటింగ్ చేసిన ఆసిఫాబాద్ జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 116 పరుగులు చేసింది. ఈ జట్టులో లడ్డు అత్యధికంగా 29 పరుగులు చేశారు. మంచిర్యాల జట్టు బౌలింగ్ చేయగా అరుణ్ రెండు వికెట్లు, అరవిందరెడ్డి, రాజేష్, సదన్‌లు చెరో ఒక వికెట్ తీశారు. అనంతరం మంచిర్యాల జట్టు 117 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగింది. ఇందులో అరవిందరెడ్డి 71 పరుగులు, శ్రావణ్ 37 పరుగులు చేయగా మంచిర్యాల జట్టు 9 వికెట్ల తేడాతో ఆసిఫాబాద్‌జట్టుపై విజయం సాధించింది. ఈ జట్టులో అత్యధికంగా 71 పరుగులు, ఒక వికెట్ తీసిన అరవిందరెడ్డి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.



మ్యాన్‌ఆఫ్‌దమ్యాచ్ అందజేస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్, తదితరులు

నిర్మల్‌పై ఆదిలాబాద్ జట్టు గెలుపు

మరో పోటీలో ఆదిలాబాద్, నిర్మల్ జట్లు బరిలో తలపడ్డాయి. ఇందులో తొలిగా ఆదిలాబాద్ జట్టు బ్యాటింగ్ చేసి ఆరు వికెట్లు కోల్పోయి 226 పరుగులు చేసింది.

ఈ పోటీలో హిమతేజ 84, అన్వేష్ 30, గణేష్ 35, ఇర్ఫాన్ అహ్మద్ 33 పరుగులు చేశారు. నిర్మల్ జిల్లా క్రీడాకారులు బౌలింగ్ చేసి అభితేజ రెండు, సతీష్, తరుణ్, త్రివేద్ గౌతమ్‌లు తలా ఒక వికెట్ తీశారు. అనంతరం 227 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ ప్రారంభించిన నిర్మల్‌జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 112 పరుగులు చేసి పరాజయంపాలైంది. ఆదిలాబాద్ జట్టు బౌలింగ్‌లో అన్వేష్ రెండు, ప్రేమ్, అర్షద్, గణేష్, లుక్మాన్, కలీమ్‌లు తలా ఒక వికెట్ తీశారు. ఈ పోటీలో ఆదిలాబాద్ జట్టు 114 పరుగుల తేడాతో భారీ విజయాన్ని సాధించింది. హిమతేజ 85 పరుగులు సాధించి మ్యాన్‌ఆఫ్‌దమ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

గొల్లపల్లి (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే: ఈ నెల 29 నుంచి ప్రారంభించిన గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. ఎల్లన్న పేర్కొన్నారు. హాజీపూర్ మండలం గొల్లపల్లిలో శనివారం ఆయన పశువైద్యశిబిరం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆయన పశువులకు గాలికుంటువ్యాధి నిరోధక టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలికుంటు నివారణ టీకాలను ప్రతి ఆరునెలలకోసారి వేస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల వయస్సు నిండి ప్రతి పశువుకు టీకాలు వేస్తారని ఆయన పేర్కొన్నారు. రైతులు పశువులకు ఎలాంటి రోగాలు రాకుండా చూసుకోవడం వల్ల పాడిపరిశ్రమను వృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. గొల్లపల్లి గ్రామంలో 34 గొర్రెలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం రాయితీపై అందజేసిన గొర్రెలను అమ్మితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 3,16,000 పశువులు ఉన్నట్లు తెలిపారు. వీటన్నింటికి టీకాలు వేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. గాలికుంటు వ్యాధిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దుర్గం లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు బేతు రమాదేవి, పశువైద్యాధికారిణి డా. సరిత, వైద్యసిబ్బంది అగ్నివేష్, సాబిర్, రవి, మోను, రైతులు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న ఎల్లన్న, తదితరులు

పైప్‌లైన్ల నిర్మాణానికి రూ.13 కోట్లతో ఆమోదం

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మంచిర్యాల పురపాలక సంఘంలో మంచినీటి పైప్‌లైన్ల నిర్మాణం కోసం దాదాపు రూ. 13 కోట్లతో పనులు చేయడానికి కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. పురపాలక కార్యాలయంలో శనివారం అధ్యక్షురాలు మామిడిశెట్టి వసుంధర అధ్యక్షత కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముల్కల్ల పంప్ హౌజ్ నుంచి మంచిర్యాల పట్టణానికి సరఫరా చేసే మంచినీటి పైప్‌లైన్ లీకేజ్ అవుతున్నందున దాని స్థానంలో మరో పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ. 8.7 కోట్లు, హమాలివాడ వైపు వంద అడుగల మాస్టర్ ప్లాన్ రహదారి గుండా మిషన్ భగీరథ పైప్‌లైన్ నిర్మాణం కోసం రూ. 4.30 కోట్లతో పనులు చేయడానికి సభ్యులు ఆమోదం తెలిపారు. పారిశుద్ధ్య విభాగంలో మరో రూ. ఒక కోటితో 13 ట్రాక్టర్ల కొనుగోలు కోసం టెండర్లు నిర్వహించడానికి ఆమోదించారు. వీటితోపాటు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి సభ్యులు అంగీకరిస్తూ ఎజెండా అంశాలను ఆమోదించినట్లు తెలిసింది.

సాగుతున్న అక్రమాలు.. ఆగేది ఎప్పుడో?

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ భూములనే కబ్జా చేశారు. ఆక్రమణలను గుర్తించిన అధికారులు వాటిని తొలగించి చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే భూ కబ్జాలకు పాల్పడుతున్నా వీటిపైన ప్రశ్నించేవారేలేరు. ఆక్రమిత ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. మున్సిపాలిటీ అధికారులు ఏమీ చూడకుండానే అనుమతులు ఇచ్చేస్తున్నారు. వాటిని ఆధారం చేసుకుని అడ్డగోలుగా నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఎమ్మెల్యే తండ్రి పేరు మీద 50ఎకరాలకు పైగా రికార్డుల్లో నమోదు చేసి.. పొరపాటు జరిగిందని చెప్పడం అధికారుల పనితీరుకు నిదర్శనంగా చెప్పవచ్చు.

★ రూ.కోట్ల విలువచేసే భూదాన భూములు కబ్జాకు గురయ్యాయి. వాటిని రక్షించేదెవరో దేవుడికే ఎరుక. కబ్జాల గోలలో పడితే.. అభివృద్ధి గురించి పట్టించుకోలేకపోతున్నామని పాలనాధికారి కర్ణన్ చెప్పారంటే ఇక్కడి ఆక్రమణలు ఏ స్థాయికి చేరాయో తెలుసుకోవచ్చు.

★ పట్టణంలోనే 11చెరువులుండగా.. సగానికి సగం ఆక్రమణకు గురయ్యాయి. చెరువుల్లో మట్టిపోయడం.. వాటిల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. నీరు నిల్వ ఉండకుండా అలుగులను ధ్వంసం చేస్తున్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతమంతా చెరువు భూమి అని చెబుతున్నా.. కొన్ని బహుళఅంతస్తుల భవనాలు ఏకంగా చెరువులోనే వెలిశాయి. హైటెక్కు హంగులతో ఓ కాలనీయే చెరువులో వెలిసింది. ఇవన్నీ కళ్లముందే కనిపిస్తున్న అక్రమాలు. వీటిని కాపాడాల్సిన పాలకులు, అధికారులు తమకెందుకులే అంటూ దాటవేస్తున్నారు. పరోక్షంగా వీటి ద్వారా వీళ్లకు లబ్ధి చేకూరుతుండటమే అందుకు కారణంగా చెప్పవచ్చు.

★ పట్టణానికి కూతవేటు దూరంలో నుంచే గోదారి నుంచి అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారు. ప్రతి రోజూ వందలాది ట్రాక్టర్లు ఇసుక తరలిస్తున్నారు. రూ.కోట్ల విలువైన ఖనిజ సంపదను కొల్లగొడుతున్నారు. ఇవన్నీ ప్రతిరోజు అందరికీ కనిపించేవే అయినా వీటిని ఎవరూ ప్రశ్నించరు. గతంలో వీటిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన తహసీల్దార్‌కు అక్కడి ప్రజాప్రతినిధుల బెదిరింపులు తప్పలేదు. ఆఖరికి ఆయనపై బదిలీవేటు వేశారు. పాలనాధికారి కూడా కొన్నాళ్లపాటు ఇసుక తవ్వకాలను ఆపేశారు. ఆ తర్వాత మళ్లీ షరామామూలైంది.

★ కోటపల్లి మండలం కొల్లూరు శివారులో స.నెం.244లో 140 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేశారు. ఆ భూమి ఇప్పటికీ సాగునకు నోచుకోలేదు. భూ అభివృద్ధికి పలు పథకాలు ప్రవేశపెట్టినా.. ఆ భూముల గురించి పట్టించుకున్న వారే లేకపోయారు. అందులో మట్టి తవ్వకాలు సాగించి గుత్తేదారులకు ఆదాయ వనరులుగా మారాయి. ఇసుక గుత్తేదారులు ఆ భూమిని తవ్వి.. వాహనాల రాకపోకలకు రహదారులు ఏర్పాటు చేసుకున్నారు. సింగరేణి గుత్తేదారులు సైతం ఇదే రీతిన అవలంబించారు. ప్రస్తుతం నిజామాబాద్ నుంచి జగ్దల్‌పూర్ వరకు జాతీయరహదారి-63 విస్తరణ పనులకు భారీగా మొరం అవసరం ఉండటంతో ఆ గుత్తేదారుల కన్ను ఈ భూములపైనే పడింది. ఆ రహదారి నిర్మాణం పేరుతో ప్రతి రోజూ 300 లారీల వరకు మట్టి తరలిస్తున్నారు. అభివృద్ధి చేస్తే సాగుకు పనికొచ్చే ఆ భూమిలో 10మీటర్లకు పైగా లోతుల్లోకి వెళ్లి తవ్వకాలు జరుపుతున్నారు. అంటే భవిష్యత్తులో ఈ భూములు ఎందుకూ పనికిరావని చెప్పవచ్చు. గ్రామ సమీపంలోనే తవ్వకాల వల్ల ఏర్పడిన గొయ్యిలు ప్రమాదకరంగా మారాయి. గతంలో పశువులు పడి చనిపోయాయి. ఇటీవల కొందరు రైతులు అడ్డుకున్నా. .వాళ్ల ఆర్తనాదాలు ఎవరికీ వినిపించలేదు.

ఈ అక్రమాలను 'ఈనాడు' వెలుగులోకి తేవడంతో నెలరోజుల పాటు మొరం తవ్వకాలను ఆపేశారు. మళ్లీ తాజాగా మూడు రోజుల నుంచి తవ్వకాలు మొదలయ్యాయి. మట్టి తరలించే వాహనాలను ఆపడానికి ప్రయత్నించిన స్థానిక తహసీల్దార్‌కు ఓ ప్రజాప్రతినిధి నుంచి బెదిరింపులు తప్పలేదు. ఉన్నతాధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో తహసీల్దార్ కూడా చేతులెత్తేశారు. దీంతో ఇప్పుడు అడ్డగోలుగా మొరం తరలింపు జరుగుతోంది. పేదలకు పంపిణీ చేసిన భూములను కొల్లగొడుతున్నా.. చీమకుట్టినట్లైనా లేదు.

★ కోటపల్లి మండలం కొల్లూరు, రావులపల్లి శివారులో అసైన్డ్ భూముల్లో అక్రమంగా ఇసుక నిల్వలున్నాయి. అక్కడి నుంచి క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. రావులపల్లి, బోరంపల్లి, ఎర్రాయిపేటల సమీపాల్లో గోదారిలో అడ్డంగా రహదారులు ఏర్పాటు చేసుకుని అడ్డగోలుగా ఇసుక తరలిస్తున్నారు. హద్దులు దాటి తవ్వకాలు జరుపుతున్నారు. వీటిపైన 'ఈనాడు' వరుస కథనాలు ప్రచురితం కావడంతో పనులు నిలిపివేయాలని స్థానిక అధికారులను పాలనాధికారి ఆదేశించారు. వారం తిరగకముందే ఆ పనులకు అడ్డుతగలొద్దని కింది స్థాయి ఉద్యోగులకు ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల జారీచేయడం అధికారుల తీరుపైన పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ కూడా ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల వల్లే అక్రమాలను అడ్డుకోవడంలో విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి.

★ జాతీయరహదారి-63 పనులు చేసుకుంటూ పోతుంటే. . వెనుక నాసిరకం పనులతో పగుళ్లు ఏర్పడుతూనే ఉన్నాయి. గడిచిన పదేళ్లుగా నిధులు వస్తూనే ఉన్నాయి.. పనులు చేస్తూనే ఉన్నారు. అధికారులు, పాలకులు ఈ నాసిరకం పనులపైన గుత్తేదారులను నిలదీసిన పాపానపోలేదు. ప్రస్తుతం రహదారి విస్తరణలోనూ నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదనే విమర్శలున్నాయి. భీమారం, చెన్నూరు మధ్యలో రహదారి విస్తరణలో భారీ వృక్షాలను సైతం నరికేస్తున్నారు.

★ జిల్లాలో రహదారుల భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంలేదు. నిర్మాణ దశలోనే నాసిరకం పనుల ఆనవాళ్లు బహిర్గతం అవుతున్నాయి.

★ బియ్యం మిల్లుకు ప్రత్యేకత చాటుకున్న మంచిర్యాలలో మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారు. రేషను బియ్యాన్నే రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి అంటగడుతున్నారు. పాఠశాలలకు సరఫరా అయ్యే సన్నబియ్యాన్ని కూడా వదల్లేదు. రెండేళ్ల రూ.11కోట్ల విలువైన నాసిరకమైన బియ్యాన్ని పౌరసరఫరాలశాఖకు విక్రయించారు. పట్టణ నడిబొడ్డున బహిరంగంగా రేషను బియ్యం కొనుగోలు చేసే దుకాణాలు వెలిశాయంటే ఇక్కడి అధికారుల తనిఖీలు ఏపాటివో తెలుసుకోవచ్చు. పగలురాత్రి అనే తేడా లేకుండా రేషను బియ్యం వాహనాలు, రైళ్ల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నా పట్టింపులేకుండాపోయింది.



కోటపల్లి మండలంలో ఆగని ఇసుక దందా

★ చెన్నూరు మండల కేంద్రలోని కుమ్మరికుంటను ఆక్రమించి స్థిరాస్తి వ్యాపారాన్ని సాగిస్తున్నారు. వాటిల్లో అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారు. దళారులు భారీగా పత్తి కొనుగోళ్లు చేస్తున్నారు. అధిక వడ్డీతో కొందరు వ్యాపారులు దోచుకుంటున్నారు. కొత్తగా ఏర్పడ్డ బీమారం మండల కేంద్రంలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జా చేసినా పట్టింపులేదు.

పోలీసుశాఖది అదే దారి..

మంచిర్యాల జిల్లాలో పోలీసుల తీరు ఏమాత్రం బాగోలేదు. ఇప్పటికే ముగ్గురు ఏసీపీ, సీఐలు అవినీతి ఆరోపణలతో వేటుపడింది. కొత్తగా డీసీపీ వచ్చినా ఆ శాఖలో ఏమాత్రం మార్పురాలేదు. ఈ జిల్లాకు వచ్చే వాళ్లంతా డబ్బులిచ్చి పోస్టింగ్ తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. ఆదాయ వనరుగా మారడంతో అక్రమ వ్యాపారాలు, జీరో దందాలను అరికట్టలేకపోతున్నారు. ఇసుక, బొగ్గు, పాత ఇనుము, భూ తగాదాలు, బంగారు దుకాణాలు ఆ శాఖ అధికారులకు భారీగా మామూళ్లు తెచ్చిపెడుతున్నాయి. రెవెన్యూ, పోలీసు శాఖలపైన కొందరు ప్రజాప్రతినిధుల బెదిరింపులు ఎక్కువయ్యాయి. వాళ్లు చెప్పినట్లే నడుచుకోవాల్సి రావడం వల్ల పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇదే క్రమంలో నిజాయితీగా వ్యవహరించే కొందరు అధికారుల సామర్థ్యాన్ని సరైన రీతిలో వినియోగించుకోలేకపోతున్నారు.

సాక్షరభారత్ కొనసాగేనా?

(మొదటిపేజీ తరువాయి)

విజయవంతం కాకపోవడానికి ప్రధాన కారణం సమన్వయకర్తలకు చెల్లించే అరకొర వేతనాలు. నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాలు నేర్పించడం సమన్వయకర్తల పని. మండలానికి ఒక సమన్వయకర్త, గ్రామ పంచాయతీకి ఇద్దరి చొప్పున నియమించారు. మండల సమన్వయకర్తలకు రూ.6 వేలు, గ్రామ సమన్వయకర్తలకు నెలకు రూ.2 వేల చొప్పున వేతనాలు చెల్లించారు. ఇవి సగటు దినసరి కూలీలో సగం కూడా కాదు. ఈ మొత్తం నెలనెలా రాకపోవడంతో సమన్వయకర్తలు తీవ్ర అసంతృప్తి లోనయ్యేవారు. వీటి కోసం పడిగాపులు కాసేవారు. వేతనాలు సరిగా విడుదల కాకపోవడంతో ఉన్నతాధికారులు వారిని అజమాయించలేని పరిస్థితి. దీంతో పథకం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది.

గడువు విషయంపై ఆదేశాలు రాలేదు

- దుర్గాభవాని, సాక్షరభారత్ సంచాలకులు

సాక్షరభారత్ గడువు పొడిగించే దానిపై మాకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీన్ని ఇంకా కొన్ని నెలల పాటు పొడిగించే అవకాశం ఉంది. త్వరలోనే మండల, గ్రామ సమన్వయకర్తలకు వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

డయల్ యువర్ డీఎంకు స్పందన

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే: మంచిర్యాల ఆర్టీసీ డిపో పరిధిలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డిపో మేనేజర్ కృష్ణ పేర్కొన్నారు. శనివారం ఆయన ఏర్పాటు చేసిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు మంచిర్యాల బస్టాండ్ నుంచి హైదరాబాద్ మియాపూర్‌కు బస్సు నడపాలని, తాండూరులో రాత్రివేళ బస్సు నిలిపేలా చొరవ చూపాలని ప్రయాణికులు కోరారు. బస్సులలో మహిళలు, వికలాంగులకు కేటాయించిన సీట్లపై రాతలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు తెలిపిన సూచనలు, సమస్యలను పరిస్కారం చేసేందుకు చొరవ తీసుకుంటామని డీఎం తెలిపారు.

ఇక పక్కాగా ఎరువుల లెక్కలు

(మొదటిపేజీ తరువాయి)

చెల్లిస్తున్న రాయితీ సొమ్మును రానున్న రోజుల్లో రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేసే అవకాశాలు సైతం ఉన్నాయి. మంచిర్యాల జిల్లాలోని 18మండలాల్లో ఇప్పటికే ఈ పాస్ యంత్రాలను సరఫరా చేశారు. వీటిపై ఎరువుల దుకాణాల డీలర్లకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికి 256 యంత్రాలను అందజేశారు.



పీఓఎస్ యంత్రం

★ పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం పెరిగింది. అవసరానికి మించి ఎరువుల వాడకం జరుగుతుండడంతో ఆర్థిక భారంతో పాటు...పలు దుష్పరిణామాలకు దారితీస్తోంది. రైతులకు ఇటు కేంద్ర ప్రభుత్వం భారాన్ని తగ్గించుకునే క్రమంగా రసాయన ఎరువుల అమ్మకాన్ని పకడ్బందీగా చేపట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పలు సంస్కరణలు చేపడుతున్నారు. రైతులు తాము వినియోగించే దానికంటే అధిక మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ సీజన్‌లో ఎరువులు లభిస్తాయో లేదా అనే ఉద్దేశ్యంతో కొందరు ముందస్తుగా కొనుగోలు చేసుకుని నిల్వ చేస్తున్నారు. కొన్నిసార్లు మార్కెట్‌లో కూడ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. సమస్యలను అధిగమించడంతో పాటు వినియోగం, అమ్మకాల్లో మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలో ప్రయోగాత్మకంగా ఈ పాస్ యంత్రాలతో పరిశీలన చేశారు. ఆ తర్వాత క్రమంగా ఈ నెలలో పూర్తి స్థాయిలో ఈ పాస్ విధానం ద్వారా ఎరువుల సరఫరా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకనుగుణంగా జిల్లాలో కూడ డీలర్లకు, ప్రాథమిక సహకార సంఘాలకు ఈ పాస్ యంత్రాలను సరఫరా చేశారు. ఈ పాస్ యంత్రాల (ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సెల్) శిక్షణ కూడ ఇచ్చారు. డిసెంబర్ 31 వరకు డీలర్లు ఈ పాస్ యంత్రం ద్వారానే ఎరువులను విక్రయించాలన్న ఆదేశాలను జారీ చేశారు.

పక్కదారి పట్టే అవకాశం ఉండదు

రసాయన ఎరువులపై కేంద్ర ప్రభుత్వం రాయితీ కల్పిస్తోంది. ప్రస్తుతం ఈ రాయితీ డబ్బులు కంపెనీలకు వెళ్తున్నాయి. వారు ఉత్పత్తి చేసి మార్కెట్లో అమ్మకాలు చేపట్టినట్లుగా చూపించే రికార్డుల ఆధారంగా రాయితీ సొమ్మును కంపెనీలకు చెల్లిస్తున్నారు. రాయితీ పోను మిగతా డబ్బులు రైతులకు మార్కెట్లో డీలర్లు నేరుగా విక్రయిస్తున్నారు. ఇప్పటికే రసాయన ఎరువులు పక్కదారి పడుతున్నాయి. పెద్దమొత్తంలో వ్యవసాయానికి కాకుండా ఇతరత్రా వినియోగాలకు తరలుతున్నట్లు చెబుతున్నారు. దీంతో రాయితీ సొమ్ము పక్కదారి పడుతోంది. రైతులు కూడ కొన్నిసార్లు తమ అవసరాల కంటే అధిక మొత్తంలో కొనగోలు చేస్తున్నారు. రైతులకే నేరుగా రాయితీ సొమ్ము చెల్లించే ఆలోచన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మొదట్లో ఆధార్ అనుసంధానం ద్వారా ఈ-పాస్ యంత్రంతో అమ్మకాలు చేపడతారు. ఈ విధానంపై వ్యాపారులు, రైతులకు అవగాహన ఏర్పడిన తర్వాత మరిన్ని మార్పులు చేసే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో రసాయన ఎరువులు కొనుగోలు చేసిన సమయంలో పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించాలి.

అవసరానికి అనుగుణంగా..

భూసార పరీక్షలకు అనుగుణంగా ఆ నేలలో ఎంత ఎరువులు వాడాలో అంతే వేయాలి. ప్రస్తుతం రైతు ఎంత మేరకు ఉపయోగించాలో తెలియక ఇష్టారీతిన కొనుగోలు చేస్తున్నారు. రైతుల భూదస్త్రాల్ని కూడ త్వరలో ఆన్ లైన్ చేస్తారు. ఎరువుల కోసం వెళ్లిన వెంటనే సదరు రైతు ఆధార్ నంబరు కొడితే అతడి భూమి వివరాలు వస్తాయి. ఆ ప్రకారం సంబంధిత డీలర్ లేదా ప్రాథమిక సహకార సంఘం నుంచి ఎరువుల్ని ఇస్తారు. భూవిస్తీర్ణం కంటే ఎక్కువ ఇచ్చే అవకాశం ఉండదు. ప్రస్తుతం వ్యవసాయ విస్తరణ అధికారులకు మినీ భూసార కిట్లను సైతం సరఫరా చేశారు.



రైతులంతా సహకరించాలి - వీరయ్య, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

రైతులంతా ఆధార్ నంబరు చూపి ఎరువులు కొనుగోలు చేసి సహకరించాలి. రసాయన ఎరువుల విచ్చలవిడి వాడకం ఇక నుంచి ఉండదు. రైతులకు కూడ ఎంతో మేలు జరుగుతుంది. ఎకరానికి ఎంత రసాయన ఎరువులు అవసరమో అంతే కొంటారు. ఎరువుల దుకాణాల్లో ప్రతి బస్తాకు ఇక నుంచి లెక్క ఉంటుంది. ఆధార్ అనుసంధానంతో ఎరువుల విక్రయాల్లో అవకతవకలు ఉండవు. అమ్మకముందే అమ్మినట్లుగా లెక్క చూపించడం కుదరదు. నల్లబజార్‌లో విక్రయాలను నియంత్రించవచ్చు. ఎరువుల లెక్క జనవరి 1నుంచి పక్కాగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. ఆధార్ నంబరు చూపిస్తే రైతులకు ఎలాంటి నష్టం ఉండదు. వారికే ఎంత మోతాదులో ఎరువులు వాడాలో కూడ తెలుస్తుంది.



రసాయనాలు వద్దు.. సేంద్రీయం ముద్దు..

● అధిక దిగుబడులతో ఆదర్శంగా యువ రైతు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే

వ్యవసాయం అంటే రసాయన ఎరువులతో, కీటక నాశన మందులతో కూడిన సాగు అనే అభిప్రాయం ఉన్న వేళ ఎలాంటి రసాయనాలు వాడకుండా సేంద్రీయ ఎరువులతోనే పంట సాగు చేసి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆరైతుపై స్ఫూర్తిదాయక కథనం...

ఇంద్రవెల్లికి చెందిన డొంగ్రె మారుతి అనే యువరైతు తన 22 ఎకరాల పొలంలో సేంద్రియ సాగు చేస్తు వివిధ రకాల పంటలను పండిస్తున్నారు. రసాయన ఎరువులు వాడిన రైతులను మించి దిగుబడి సాధిస్తున్నారు. యాసంగిలో 10 ఎకరాల్లో శనగ, మరో 12 ఎకరాల్లో యాసంగి పంటలతో పాటు పసుపు, కుసుమ, ధనియాల పంట సాగు చేయడంతో పంట పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఖరీఫ్‌లో ఇదే పొలంలో పూర్తి సేంద్రీయ ఎరువులు వాడి 20 ఎకరాల్లో 200 క్వింటాళ్ల సోయా చిక్కుడు పంటను పండించి ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారు. యాసంగిలోనూ (రబీ) పద్ధతిని అవలంభిస్తూ రసాయన ఎరువులకు దూరంగా ఉంటున్నారు. ఖరీఫ్‌లో సోయా పంటలో అంతర పంటగా కంది పంట సాగు చేశారు. కంది పంట సైతం మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని, పంట కోత పూర్తి అయిందని ఆయన తెలిపారు. ఈ రైతు సాగు విధానం చూసి ఆకర్షితులైన అధికారులు ఇతర మండలాల్లోని గ్రామాల రైతులను తెచ్చి సేంద్రీయ సాగుపై ఇక్కడ అవగాహన కల్పిస్తున్నారు.



శనగ పంటలో రైతు మారుతి

చేనులోనే 'సేంద్రీయ' తయారీ

తన పొలంలో సాగుచేసే పంటలకు అవసరమైన సేంద్రియ ఎరువులను స్వతహాగా తయారు చేస్తున్నారు. తనకు ఉన్న పశువుల పేడ, సోయా పంట పొట్టు, మొక్కజొన్న కంకులను సేంద్రీయ ఎరువుల తయారీలో వాడుతున్నారు. చేనులో వర్మీ కంపోస్టు ఎరువుల తయారీని ఏర్పాటు వాటిని పంటలకు ఉపయోగిస్తున్నారు. మండల వ్యవసాయ అధికారి జాదవ్ కైలాస్ సేంద్రియ సాగు పంటలపై ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇస్తున్నారని రైతు మారుతి డొంగ్రె వివరించారు.



సేంద్రీయ ఎరువు తయారీ

రసాయనాలతో భావితరాలకు ముప్పు..

- యువ రైతు మారుతి డొంగ్రె..

విషతుల్యమైన పంటలతో ఇప్పటికే మనలో చాలామంది వివిధ రకాల వ్యాధుల బారినపడుతున్నారు. చిన్న పిల్లలకు సైతం సేంద్రీయ సాగుతో పండించిన ఆహారం కరవైంది. దీన్ని గమనించి, పత్రికలో చదవి అధికారుల సూచనల మేరకు రసాయన ఎరువులతో పంటలు సాగు చేయనని నిర్ణయించుకున్నాను. గత రెండేళ్లుగా ఇదే పద్ధతిలో సాగు చేస్తున్నాను. మిగతా రైతులతో పోల్చితే దిగుబడిలో మార్పులేదు. సేంద్రీయ ఎరువులతో సాగు చేసిన పంటల పై సస్యరక్షణ కోసం వేప నూనె, ఇతర ప్రకృతి విధానాలతో పంటను రక్షించుకుంటు, జీవ ఎరువులు వాడుతు మంచి దిగుబడి సాధిస్తున్నాను.

గంగాజలంతో వస్తున్న మెస్రం వంశీయులు



సంప్రదాయ సామరస్యం భక్తి పారవశ్యం!

● గిరి'జన' జాతరలదీ ప్రత్యేకత ● గ్రామాల్లో మొదలైన సందడి

ఉట్నూరు, న్యూస్‌టుడే

అడవిబిడ్డల్లో భక్తి భావం పెంపొందిస్తూ.. తరతరాలుగా వస్తున్న వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి జాతరలు. దేశంలోనే అతి పెద్ద గిరిజన జాతరైన మేడారం తరువాతి స్థానాన్ని ఆక్రమించిన 'నాగోబా'కు జిల్లా పుట్టినిల్లు. రాష్ట్ర పండగగా గుర్తించిన ఈ జాతరతోపాటు మన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక జాతరలను గిరిపుత్రులు ఏటా ఎంతో వైభవోపేతంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. భీందేవుని పండగతో ఆదివాసీ గ్రామాల్లో అప్పుడే సందడి మొదలైంది. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటల దిగుబడి ఇంటికి చేరాక తమ ఆరాధ్యదైవాన్ని పూజించుకుంటూ వనవాసీలు సామూహికంగా నిర్వహించే జాతరలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

ఖాందేవ్ జాతర..

నార్నూరు మండల కేంద్రంలోని తొడసం గిరిజనులు తమ ఇలవెల్పు ఖాందేవ్‌ను ఎంతో భక్తిశ్రద్ధలతో కొలుస్తూ ప్రత్యేక పూజలతో ఖాందేవ్ జాతరను ప్రారంభిస్తారు. ఆదివాసీలు, లంబాడీ గిరిజనులు, ఉద్యోగులు, విద్యార్థులు భారీ సంఖ్యలో ఈ జాతరను చూడడానికి వస్తుంటారు. వారం రోజుల పాటు ఇక్కడ జాతర కొనసాగుతోంది. ఈ జాతరలో ప్రత్యేకంగా క్రికెట్ పోటీలు నిర్వహిస్తారు.





నాగోబా జాతరలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మహదేవ్ జాతర..

ఉట్నూరు మండలంలోని సాలేవాడ(కె)లోని శివాలయం వద్ద ఏటా ఎంతో ఉత్సాహంగా మహదేవ్ జాతర జరుగుతోంది. ఈ జాతరను మధుర కులస్థులు, స్థానిక ఆదివాసీలు ఎంతో ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ జాతర సందర్భంగా నిర్వహించే కుస్తీ పోటీలలో జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా పైహిల్వాన్లు కుస్తీపోటీలల్లో పాల్గొంటారు. ఈ కుస్తీ పోటీలు ఎంతో ఆకర్షనీయంగా నిలుస్తాయి.



ఆదివాసీల ఆరాధ్యదైవం నాగోబా

● రాష్ట్ర పండగగా గుర్తింపు

● రెండో అతిపెద్ద గిరిజన జాతర..

ఆదివాసీల్లోని మెస్రం వంశస్థుల ఇలవెల్పు నాగోబా దేవత. ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్ గ్రామంలో ఏటా పుష్యమాసం అమావాస్య రోజు రాత్రి మెస్రం వంశస్థులు తమ సంప్రదాయాల ప్రకారం పూజలు చేసి ఎంతో ఘనంగా నాగోబా జాతరను ప్రారంభిస్తారు. జాతర ఏర్పాటుకు వారం రోజుల ముందు మెస్రం వంశస్థులు జన్నారం మండలంలోని కలమడుగు సమీపంలో గల గోదావరి నదికి కాలినడకన వెళ్లి పవిత్రమైన గంగాజలంను వెంట తీసుకొచ్చి నాగదేవతను జలాలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జాతర ప్రారంభిస్తారు. 1946లో ఈ ప్రాంతానికి వచ్చి గిరిజనుల సమస్యలపై అధ్యయనం చేసిన ఆచార్య హేమన్ డార్ఫ్ జాతర ప్రత్యేకతను ఆనాడే గుర్తించారు. ఈ సందర్భంగా జాతరలో గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం దర్బార్‌ను ఏర్పాటు చేశారు. అనాటి నుంచి ఏటా జాతర సందర్భంగా నాగోబా జాతరలో దర్బార్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. జాతరకు మన రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌కు చెందిన గిరిజనులు భారీ సంఖ్యలో తరలివస్తుంటారు. ఈ జాతరను ప్రభుత్వం గతంలో రాష్ట్ర పండగగా గుర్తించింది. ఏటా ప్రభుత్వం అధికారికంగా జాతర ఏర్పాట్లు చేస్తోంది. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా పాలనాధికారి, ఐటీడీఏ పీఓతోపాటు ఆదివాసీ గిరిజన పెద్దలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు అధిక సంఖ్యలో ఈ జాతరను సందర్శిస్తుంటారు. ఇది రాష్ట్రంలో జరిగే మేడారం తరువాత అతిపెద్ద రెండో గిరిజన జాతర. లక్షల సంఖ్యలో గిరిజనులు జాతరకు వచ్చి నాగోబాను పూజిస్తుంటారు. జాతర సందర్భంగా భారీ సంఖ్యలో దుకాణాలు, తినుబండరాలు, ప్రభుత్వ స్టాళ్లు, ఆదివాసీలకు సంబంధించిన సాంస్కృతిక కార్యక్రమాలు జతరలో నిర్వహించడం విశేషం.



శ్యాంపూర్ బుడుందేవ్ జాతర..

నాగోబా జాతర తరువాత నిర్వహించేది బుడుందేవ్ జాతర. ఉట్నూరు మండలం శ్యాంపూర్ గ్రామంలో కొలువైన బుడుందేవ్(నందీశ్వర్)ఆలయం ప్రాంగణంలో ఏటా బుడుందేవ్ జాతరను మెస్రం వంశస్థులు నిర్వహిస్తారు. ఈ జాతరలో మిఠాయిలు దుకాణాలతోపాటు చిన్నపిల్లల ఆటవస్తువుల దుకాణాలు ఎక్కువ సంఖ్యలో వెలుస్తాయి. టూరింగ్ టాకీసులు, వినోదాన్ని పంచే రంగుల రట్నాలు, ఉయ్యాలలు ఎంతో ఆకట్టుకుంటాయి. ఇక్కడ విక్రయించే జిలేబీ ప్రత్యేక ఆకర్షనీయంగా నిలుస్తోంది.



ఆత్రం వంశీయుల కొంగుబంగారం..

సిర్పూరు(యు)మండల కేంద్రంలో ఆదివాసీల్లోని ఆత్రం వంశీయులు మహదేవ్‌ను ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహదేవ్ జాతరను ప్రారంభిస్తారు. గోండురాజులైన ఆత్రం వంశీయులు మహదేవ్ ఆలయాన్ని నిర్మించడంతో వారి పాలనకాలం నుంచే ఇక్కడ జాతర ఉత్సవాలు జరుగుతున్నాయని ఆత్రం వంశీలు చెబుతుంటారు. ఇక్కడ పది రోజులపాటు జాతర కొనసాగుతోంది.

ఆనందడోలికల్లో.. ఇంటిల్లిపాది..

ఏజెన్సీలో ఏటా జరిగే జాతరలు ఈ ప్రాంతంలో నివసించే ఆదివాసీ గిరిజనులతోపాటు గిరిజనేతరులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. జాతరలో ప్రదర్శించే గృహవసర వస్తువులు, పిల్లల ఆటబొమ్మలు, తినడానికి రుచికరమైన ఘుమఘుమలాడే జిలేబీ తీపి తినుబండారాలు, చిన్నాపెద్దా తేడా లేకుండా ఊగే ఉయ్యాలలు, రంగుల రాట్నాలు, వినోదాన్ని పంచే టూరింగ్ టాకీసులు, కొత్త, పాత సినిమాల కలయికతో ప్రదర్శించే చిత్రాలు అలరిస్తాయి. విన్యాసాలు, ధైర్యసాహసాలతో కూడిన సర్కస్, రికార్డింగ్ డ్యాన్సులు, క్రీడాపోటీలు యువతను ఆకట్టుకుంటాయి. మరోవైపు జాతరకు రాగానే తొలుత తమ ఇష్టదేవతలను కొలుస్తూ భక్తిపారవశ్యంలో ఉంటారు. అనంతరం వినోదాన్ని పంచే కార్యక్రమంలో పాల్గొంటారు.



జొన్న రొట్టెలు తయారు చేస్తున్న మహిళలు, చంద్రశేఖర్

జొన్నరొట్టెలతో స్వయంఉపాధి

● మధుమేహ రోగులకు చక్కటి ఆహారం

● మరో ముగ్గురికి ఉపాధి కల్పిస్తున్న పట్టభద్రుడు

జన్నారం, న్యూస్‌టుడే: ఆహారపు అలవాట్లలో మార్పులు, ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యం గురించి సరిగా పట్టించుకోకపోవడంతో వయసుతో నిమిత్తం లేకుండా మధుమేహం బారిన పడుతున్నవారు పెరుగుతున్నారు. మధుమేహులు జొన్న రొట్టె తీసుకోవడం వల్ల చక్కని ఫలితాలుంటాయని వైద్యులు అంటున్నారు. జన్నారంలో వెలసిన జొన్నరొట్టెల పాయింట్ నుంచి ప్రతి రోజు వందల సంఖ్యలో రొట్టెలు తయారవుతున్నాయి. దీని నిర్వాహకుడు ఎం.ఏ.చదివిన జి.చంద్రశేఖర్. ఎంతో కష్టపడి ఎన్నో పరీక్షలు రాసిన ప్రభుత్వోద్యోగం రాలేదు. కోచింగ్ తీసుకునే స్తోమతులేదు. ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడేందుకు తన కాళ్లమీద తాను నిలబడాలని ఆలోచించి జొన్న రొట్టెల పాయింట్‌ని నెలకొల్పాడు. జన్నారం పట్టణంలో రెండు నెలల క్రితం ప్రారంభించిన దీనికి మంచి ప్రోత్సాహం లభిస్తోంది. ఇక్కడి వారు జొన్నరొట్టెలను ఆహారంలో భాగంగా చేసుకున్నారు. ప్రస్తుతం చంద్రశేఖర్ జొన్న రొట్టెలను కేవలం నామమాత్రపు ధరకు అందిస్తుండడంతో అందరూ ఇష్టపడుతున్నారు.

సంతృప్తిగా ఉంది:- జి.చంద్రశేఖర్, పొనకల్

సమాజంలో సన్మార్గంలో జీవించడానికి ఇంత కన్నా మంచి మార్గం కనిపించలేదు. అందుకే జొన్న రొట్టెల పాయింట్‌ను ఎంచుకున్నాను. ఎలాంటి కల్తీ లేకుండా నాణ్యతతో అందిస్తుండడంతో గిరాకీ పెరిగింది. ఇద్దరు రొట్టెలు తయారు చేస్తుండగా మరో వ్యక్తి సర్వర్‌గా పనిచేస్తున్నారు. నేను బతుకుతూ మరో ముగ్గురికి ఉపాధి కల్పించడం ఎంతో సంతృప్తినిస్తుంది. ఏ ఉద్యోగం రాలేదని ప్రభుత్వాన్ని నిందించడం కంటె ఏదో ఒక పనిని ఎంచుకొని అంకితభావంతో కష్టపడితే తప్పకుండా మంచి మార్గంలోనే జీవించవచ్చును.

విరాళాలు సేకరించి... వారధి నిర్మాణం



కడెం వాగుపై వంతెన నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం

● సొంత సొమ్ములతో దారి కోసం భూమి కొనుగోలు

● ఆదర్శంగా హరిచంద్‌తండా, తులసిపేట్ గ్రామస్థులు

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే

అవి మారుమూల పల్లెలు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచుకోలేదు. ఏళ్ల తరబడి తాము అనుభవించిన కష్టాలు తమ భవిష్యత్తు తరాలకు రాకూడదనే ఉద్దేశంతో సమస్యను పరిష్కరించుకొనేందుకు ముందుకొచ్చారు. వానాకాలం వస్తే చాలు ఆ గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. కడెం వాగు పొంగి పొర్లితే నెలల తరబడి ఊరు నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో కడెం వాగుపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వంతెన నిర్మాణం చేపట్టిన చోట నుంచి వంతెనకు సమీప గ్రామాల మధ్య రైతుల పంటపొలాలున్నాయి. భూములివ్వకపోతే వంతెన నిర్మాణానికి మంజూరైన నిధులు వెనక్కిపోయే ప్రమాదముంది. దీంతో రూ.16 లక్షలు రెండు గ్రామాల నుంచి 60 కుటుంబాలు ఇంటికి రూ.20 నుంచి రూ.30 వేలు చొప్పున విరాళాలు వేసుకుని రహదారికి అవసరమైన భూములను కొనుగోలు చేశారు. వంతెన నిర్మాణం పనులు జరిగేలా సహకరించారు. రహదారి సమస్యను నెరవేర్చుకొంటున్న హరిచంద్‌తండా, తులసిపేట్ గ్రామస్థులపై కథనం...



గ్రామస్థులు కొనుగోలు చేసిన భూమిలో నుంచి వేసిన రహదారి



వానకాలం కడెం వాగు ఉద్ధృతి

నిర్మల్ జిల్లా పెంబి మండలం పస్పుల గ్రామపంచాయతీలోని హరిచంద్‌తండా, తులసిపేట్, నాయకపుగూడ, కొలాంగూడ, దెయ్యాలమద్ది, పాతతులసిపేట్ గ్రామాలు కడెం వాగు అవతలివైపున ఉంటాయి. ఈ గ్రామాలకు వానాకాలం వచ్చిందంటే చాలు బయటి ప్రపంచంతో సంబంధాలుండవు. కడెం జలాశయంలోకి నీటి ప్రవాహం వెళ్లే వాగు కావడంతో ఉప్పొంగి ప్రవహిస్తుంది. ఇక్కడ చరవాణిలు కూడా పనిచేయకపోవడంతో మంచిచెడులకు కూడా సమాచారం ఉండక దశాబ్దాల నుంచి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ నాలుగు గ్రామాలలో రెండు వేల జనాభా ఉంటుంది. వాగు పొంగితే ఈ గ్రామాల ప్రజలు పడే కష్టాలు వర్ణణాతీతం. వాగులోనుంచి దాటుకొంటూ ఆత్మీయులను కోల్పోయిన సందర్భాలు అనేకం. ఈ నేపథ్యంలో ఇక్కడి ప్రజలు దశాబ్దాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులకు వంతెన నిర్మాణం కోసం విన్నవిస్తూనే ఉన్నారు. వారి కలలను నిజం చేసేలా 2016-17లో కడెం వాగుపై పంచాయతీరాజ్ నిధులు రూ.రెండు కోట్లతో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వంతెన నిర్మాణానికి గ్రామాలకు, ఇవతలి వైపు గ్రామాలకు రహదారి అనుసంధానానికి మధ్యలో రైతుల పట్టాభూములు ఉండటంతో సమస్య వచ్చిపడింది. రహదారికి భూములిస్తే తప్ప వంతెన నిర్మాణం చేపట్టని దుస్థితి. అసలే అటవీశాఖ అనుమతులు వచ్చి, నిధులు మంజూరైనప్పటికి భూ సేకరణ సమస్యగా మారింది. జాప్యం చేస్తే నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదముందని, మంజూరైన వంతెన నిర్మాణం కావాల్సిందేనని గ్రామీణులు పట్టుబట్టారు. గ్రామస్థులందరూ ఇంటికి రూ.20 నుంచి రూ.30 వేలు చొప్పున విరాళాలు సేకరించారు. ఇలా 60 కుటుంబాలు రూ.16 లక్షలు సేకరించారు. వంతెన రహదారికి మధ్యలో ఉన్న రైతులను ఒప్పించి వారికి భూముల ధర నిర్ణయించి దారి కోసం ఇచ్చిన భూములకు పరిహారం సైతం చెల్లించారు. గ్రామస్థులు సేకరించిన భూముల్లోనుంచి ప్రస్తుతం ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన కింద మూడు కి.మీ.మట్టి రహదారి సైతం వేశారు. వంతెనకు ఆరు ఫిల్లర్లు పనులు జోరందుకొన్నాయి. వంతెన నిర్మాణం పూర్తయితే రవాణా సౌకర్యం, దశాబ్దాల తర్వాత ఆర్టీసీ బస్సు సేవలు ప్రారంభమవుతాయని, గ్రామాభివృద్ధి మెరుగుపడనుందని, కష్టాలకు విముక్తి లభించనుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిరకాల కోరిక నెరవేరుతోంది

- బుక్య గోవింద్, పస్పుల మాజీ సర్పంచి

కడెం వాగుతో మాతో పాటు ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. వంతెన లేకపోవడంతో రవాణ మార్గం లేక ఎటూ వెళ్లిన నడచుకొంటూ వెళ్లాల్సిరావడంతో మా పూర్వీకులతో పాటు మేము అనేక కష్టాలు పడ్డాం. రాబోయే తరాలకు కష్టాలు ఉండొద్దని ఐకమత్యంగా ఉండి విరాళాలు సేకరించాం. మా గ్రామస్థుల చిరకాల కోరిక నెరవేరనుండటంతో ఆనందంగా ఉంది.



ఇబ్బందులు తొలగిపోతాయి

- భీంసింగ్, హరిచంద్‌తండా గ్రామస్థుడు

కడెం వాగు పొంగితే బయటకు రాలేని పరిస్థితులలో ఎలాంటి అభివృద్ధి జరుగలేదు. ఇక్కడ పండించిన పంటలు విక్రయించాలన్నా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఎండాకాలం వాగులో నుంచి ఎడ్లబండిపై వెళ్లి అవతలిఒడ్డుకు చేరుకొన్నాం. మా ఊరికి దూరభారంతో శుభకార్యాలకు బంధువులు కూడా వచ్చేవారు కాదు.



బస్సు ఎక్కే భాగ్యం రానుంది

- గుగ్లావత్ జేమా

పస్పుల నుంచి పెంబికి, ఖానాపూర్‌కు వెళ్లాలన్నా పుల్గంపాండ్రి వరకు నాలుగైదు కిలోమీటర్లు నడుచుకొంటూ వెళ్లి ఆటోలో ఎక్కేవాళ్లం. సకాలంలో వంతెన పూర్తయితే నేరుగా పస్పులతో పాటు ఆరు గ్రామాలకు బస్సు ఎక్కే భాగ్యం కలగనుంది. వంతెన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి.





ఆలయ గోపురంతో దేవాలయంలా కనిపిస్తున్న పాఠశాల

విద్య - ఆలయాల మేలి కలయిక..!

పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే పాఠశాలను విద్యాలయంగా మనం పిలుస్తుంటాం. గురువులను దైవ సమానంగా కొలుస్తుంటాం. ఈ రెండూ పక్కపక్కనే ఉండడంతో చూపరులను క్షణకాలం ఈ రెండూ ఒకటే అన్నట్లు భ్రమింపజేస్తోంది. ఇవే ఖానాపూర్‌లోని విద్యానగర్‌లో కన్యకాపరమేశ్వరి, ధ్రువ పాఠశాలలను పక్క నుంచి చూస్తే విద్యాలయమా.. దేవాలయమా అని పోల్చుకోలేకుండా కన్పిస్తోంది.

- న్యూస్‌టుడే, ఖానాపూర్



పక్కనే ఉన్న ఆలయం, పాఠశాల భవనం



మ్యాచింగ్ గ్రాంట్ చెక్కు అందజేత

శ్రీరాంపూర్ గ్రామీణం: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ-3 గనిలో కోల్‌ఫిల్లర్‌గా పనిచేస్తూ ప్రమాద వశాత్తు జరిగిన గని ప్రమాదంలో మృతి చెందిన రత్న రాజయ్య కుటుంబానికి మ్యాచింగ్ గ్రాంట్, ఎస్ఎస్ఎఫ్ చెక్కులను గ్రూపు ఏజెంట్ విజయభాస్కర్‌రెడ్డి శనివారం అందజేశారు. కార్మికుడి మృతికి మ్యాచింగ్ గ్రాంట్, ఎస్ఎస్ఎఫ్ రూపంలో రూ. 20,42,910 మొత్తం కంపెనీ నుంచి వచ్చింది. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును రాజయ్య భార్య రత్న రాజేశ్వరికి ఏజెంట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్పీ-3 గని మేనేజర్ ఎన్. రమేష్, గుర్తింపు సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలి

గనులపై ఘనంగా ఉద్యోగ విరమణ కార్యక్రమాలు

మందమర్రి/రామకృష్ణాపూర్: నిర్ధేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు కార్మికులు, అధికారులు సమష్టిగా రక్షణతో కూడిన విధులు నిర్వహించాలని సింగరేణి మేనేజర్ బత్తుల శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం మందమర్రి ఏరియాలోని బొగ్గు గనులు, విభాగాలపై ఉద్యోగ విరమణ పొందిన కార్మికదంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కె.కె-5 గని ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ విరమణ పొందిన కోల్‌కట్టర్లు గోపతి పోచయ్య, మాదసి శంకరయ్య, సపోర్టుమెన్ దండు రాయమల్లు, జనరల్‌మజ్దూరు తీగల లక్ష్మి, ఎర్రబోయిన లక్ష్మయ్యలను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ ఎ. రవికుమార్, రక్షణాధికారి కుష్వహ, సీనియర్ పీవో గట్టుస్వామి తదితరులు పాల్గొన్నారు.

కె.కె-1 గనిపై...

మందమర్రి ఏరియాలోని కె.కె-1 గని ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ విరమణ పొందిన టింబర్‌మెన్ బుచ్చయ్య, కోల్‌కట్టర్ చిన్న బుచ్చయ్య, సపోర్టుమెన్ యాదబోయిన అయిలయ్య, జనరల్‌మజ్దూరు గాదె రామయ్య దంపతులను గని మేనేజర్ రవిందర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గని రక్షణాధికారి స్వామిరాజు, డిప్యూటీ మేనేజర్ అల్లావుద్దీన్, అండర్‌మేనేజర్లు నర్సింగరావు, మధుసూధన్, పిట్ ఇంజనీర్ పవన్, వాసు, సంక్షేమాధికారి ఆసిఫ్, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఎస్సార్పీ-1 గని వద్ద కార్మికుడిని సన్మానిస్తున్న డీవైజీఎం వెంకటరమణ

ఆర్కే-1ఏ గని ఆవరణలో...

మందమర్రి ఏరియాలోని ఆర్కే-1ఏ గనిపై శనివారం ఉద్యోగ విరమణ పొందిన కార్మిక దంపతులను ఘనంగా సన్మానించారు. ట్రామర్ కార్మికుడు పున్నం వీరస్వామి, కోల్‌ఫిల్లర్ బోయ కనుకయ్య, జనరల్‌మజ్దూర్లు కైతల సోమయ్య, గజనాల రాజనర్సు దంపతులను గని రక్షణాధికారి రాంబరోస్ మహాతా, సీనియర్ అండర్‌మేనేజర్ బి. జయంత్‌కుమార్‌లు సన్మానించారు. కార్యక్రమంలో ఇంజనీర్ సంతోష్, సంక్షేమాధికారి డి. శ్రావణ్‌కుమార్, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్కేపీ సీహెచ్‌పీలో...

రామకృష్ణాపూర్‌లోని సింగరేణి సీహెచ్‌పీలో ఎలక్ట్రిషియన్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కట్టా రామమూర్తి దంపతులను శనివారం సీహెచ్‌పీ ఎస్ఈ సురేష్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు ఎండీ. అక్బర్ అలీ, ఇప్పకాయల లింగయ్య, ఎ. సంజీవ్, కొరబోయిన లక్ష్మన్, జె. శ్రీనివాస్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ గ్రామీణం: శ్రీరాంపూర్ ఏరియాలోని వివిధ గనుల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను ఆయా గనులపై అధికారులు శనివారం ఘనంగా సన్మానించారు. ఏరియాలోని ఎస్సార్పీ-1 గనిలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన కోల్‌కట్టర్ పెద్ది నర్సయ్య, ట్రామర్ కంచి కుమారస్వామి, కోల్‌ఫిల్లర్ కారుకూరి లక్ష్మయ్యలను గని డీవైజీఎం జె. వెంకటరమణ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు మహేంద్రనాథ్, జి. మోహన్‌రెడ్డి, వీరభద్రరావు, బాబు, రాజేందర్, ప్రభాకర్, పి. రాజు, తెబొగకాసం నాయకులు కె. సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

☛ ఆర్కే-న్యూటెక్ గనిలో ఉద్యోగ విరమణ పొందిన ఫిట్టర్ జి. ఐలయ్య, టింబర్‌మెన్లు జి. వెంకటయ్య, ఇ. శంకరయ్య, సపోర్టుమెన్లు కె. జనార్దన్, ఎస్. లింగయ్య, లైన్‌మెన్ ఎ. లింగయ్య, ఎంజేడబ్ల్యూ జి. కనకయ్య, కోల్‌ఫిల్లర్ డి. శంకరి, జనరల్ మజ్దూర్లు పి. కిష్టయ్య, కె. గట్టయ్య, వి. శంకరిలను గని మేనేజర్ జె. వెంగళరావు శనివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు వి. భిక్షమయ్య, లింగయ్య, ఎం. శ్రీనివాసరావు, బి. మాదవ్, ప్రవీణ్‌సింగ్, తెబొగకాసం నేత డి. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆర్కే-1ఏ గనిపై ఉద్యోగ విరమణ పొందిన కార్మిక దంపతులతో గని అధికారులు, కార్మిక సంఘాల నాయకులు

☛ ఆర్కే-5 గని వద్ద ఉద్యోగ విరమణ పొందిన కోల్‌కట్టర్లు గుల్ల సారయ్య, కొండ ఎల్లయ్య, కీసరి మోహన్‌రెడ్డి, జనరల్ మజ్దూర్లు అలిశాల లక్ష్మయ్య, బోరకుంట రాజేశం, సపోర్టుమెన్ రావుల దుర్గయ్యలను గని మేనేజర్ కె. రాజేందర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు ఎస్‌కే ఓఝా, ఎస్‌కే సిన్హా, వి. రాధకృష్ణ, శ్యాంకుమార్, ఎం. రాజేష్, తెబొగకాసం నేతలు మల్లారెడ్డి, నర్సింగరావు, నెల్కి మల్లేష్, పి. భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

☛ ఎస్సార్పీ-3 గనిలో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను గని మేనేజర్ ఎన్. రమేష్ తోటి కార్మికుల సమక్షంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గని అధికారులు, కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

☛ సీహెచ్‌పీలో ఫిట్టర్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన దుబాసి దేవదాస్‌ను డీజీఎం రామలింగం సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఈ బసవరాజు, ఈఈ మోహన్, తెబొగకాసం నేతలు అమృతరావు, సమ్మిరెడ్డి, అరికాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కె.కె-5 గనిపై ఉద్యోగ విరమణ కార్మికులకు సన్మానం


ఆర్కేపీ సీహెచ్‌పీపై సన్మాన కార్యక్రమం


ఎస్సార్పీ-3 గని వద్ద సన్మానం పొందిన ఉద్యోగ విరమణ కార్మికులు

గని కార్మికులకు పెరిగిన కరవు భత్యం

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికులకు మారెడు కరవ భత్యం (వీడీఏ) డిసెంబరు 1 నుంచి 6.40 శాతానికి పెరిగినట్లు యాజమాన్యం శుక్రవారం భ్రమణిక (సర్క్యులర్) విడుదల చేసింది. ప్రస్తుతం ఈ డీఏ 3.9 శాతం లభిస్తోంది. ఇప్పుడు ధరల పెరుగుదలకు అనుగుణంగా 2.5 శాతం డీఏ పెరిగింది. పెరిగిన వీడీఏ 2017 డిసెంబరు 1 నుంచి ఫిబ్రవరి 28 వరకు వర్తిస్తుంది. వేతన ఒప్పందం ప్రకారం జాతీయ వినిమయ ధరల సూచీ (ఏఐసీపీఐ) ప్రకారం పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి మూడు నెలకు ఒకసారి చొప్పున వీడీఏను సవరిస్తారు. ఏఐసీపీఐ 6,505.38 నుంచి 6,117కు చేరుకోవడంతో 388.38 పాయింట్లు పెరిగింది. సింగరేణిలో పనిచేస్తున్న 54 వేల మంది కార్మికులకు కనిష్ఠంగా రూ. 700 నుంచి గరిష్ఠంగా రూ. 1800 వరకు వేతనాల్లో పెరుగుదల ఉంటుందని అంచనా.

కాల సూచీల పంపిణీ

శ్రీరాంపూర్, న్యూస్‌టుడే: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సింగరేణి యాజమాన్యం ఏటా సంస్థ ముద్రించిన 2018 సంవత్సర కాలసూచీలను ప్రతీ కార్మికుడికీ పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. డిసెంబరు 31 ఆదివారం సెలవు దినం కావడంతో శనివారం కార్మికులందరికీ గనులపై అధికారులు కాలసూచీలను పంపిణీ చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-5, 6, 7, 8, ఆర్కే-న్యూటెక్, ఎస్సార్పీ-1, 3, ఐకే-1ఏ, శ్రీరాంపూర్ ఉపరితల గని, ఏరియా స్టోర్స్, ఏరియా వర్క్‌షాపు, ఆటో గ్యారేజి, సివిల్ విభాగంతోపాటు జీఎం కార్యాలయంలో నూతన సంవత్సరం కాలసూచీలను పంపిణీ చేశారు. ఈ ఏడాది కాలసూచీలను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. జీఎం కార్యాలయంలో జీఎం సుభాని ఉదయం కాలసూచీలను ఆవిష్కరించగా, మొదటి షిఫ్టు, రెండో షిఫ్టుల్లో గనుల పైకి వచ్చిన కార్మికులందరికీ వీటిని అందజేశారు. శుక్రవారం రాత్రి బదిలీ ముగించుకుని శనివారం ఉదయం అవుట్ మస్టర్ పడిన కార్మికులకు కూడా శనివారం ఉదయమే కాలసూచీలను ఆచ్చారు.

శ్రీరాంపూర్ ఉపరితల గనిలో జనరల్ మజ్దూర్‌గా 32 ఏళ్ల పాటు పని చేసి, ఉద్యోగ విరమణ పొందిన బాల కృష్ణయ్యను శనివారం గని ఆవరణలో యాజమాన్యం తరఫున అధికారులు ఘనంగా సన్మానించారు. గని మేనేజర్ ఎడీ జకీర్ హుస్సేన్, రక్షణాధికారి కె. వెంకటేశ్వర్‌రెడ్డి, గుర్తింపు సంఘం నేతలు మహిపాల్‌రెడ్డి, పెంట శ్రీనివాస్ కలిసి ఉద్యోగ విరమణ పొందిన కార్మికున్ని, ఆయన సతీమణిని పూలమాలలు, శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా గని అధికారులు సింగరేణి యాజమాన్యం ప్రచురించిన 2018 కాల సూచీలను కార్మికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంజినీర్లు శ్యాంసుందర్, రాజా రవిచరణ్, సారంగపాణి, సీనియర్ పర్సనల్ అధికారి ఎస్వీ రాజేశ్వర్‌రావు, ఆఫీస్ సూపరింటెండెంట్ రమణారావు, సంక్షేమ విభాగం క్లర్కు వి. కెనెడి, విభాగాల వారీగా కార్మికులు, ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు కలిసి వేర్వేరుగా ఉద్యోగ విరమణ పొందిన కార్మికున్ని శాలువా, పూలమాలలతో సన్మానించారు.



శ్రీరాంపూర్ ఉపరితల గనిలో 2018 కాలసూచీలను ఆవిష్కరిస్తున్న గని అధికారులు

అధికారి ఆత్మీయ సన్మానం

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ ఏరియా పర్యావరణ అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పల్లెర్ల వైకుంఠంను ఏరియా జీఎం సుభాని ఘనంగా సన్మానించారు. శనివారం సాయంత్రం జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వైకుంఠంతోపాటు ఉద్యోగ విరమణ పొందిన వర్క్ అసిస్టెంట్ టి. రాజిరెడ్డి, జీఎం కార్యాలయ స్వీపర్ నాగమ్మను ఆయన సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెబొగకాసం నేత కె. సురందర్‌రెడ్డి, అధికారులు సత్యనారాయణ, ఫణీ, శ్రీనివాసరావు, రాజం, తుకారం తదితరులు పాల్గొన్నారు.

నిల్వ చేసుకునే సెలవుల సంఖ్య పెంపు

శ్రీరాంపూర్, న్యూస్‌టుడే: పదో వేతన ఒప్పందం ప్రకారం సెలవుల నిల్వ, జాతీయ, పండగ సెలవులపై సింగరేణి యాజమాన్యం అమలు ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 29న జారీ చేసిన భ్రమణిక శనివారం అన్ని ఏరియాలకు అందింది. వార్షిక సెలవులను 1952 నాటి గనుల చట్టం ప్రకారం కొనసాగుతాయని పేర్కొంది. 150 ఆర్జిత సెలవులు నిల్వ చేసుకోవచ్చు. ఏటా ఉద్యోగులు 15 ఆర్జిత సెలవుల్ని నగదుగా మార్చుకునే అవకాశం ఉంటుంది. ఉద్యోగ విరమణ పొందేవారికి, మరణించిన, స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన వారికి 150కి మించకుండా ఉన్న ఆర్జిత సెలవుల్ని నగదుగా చెల్లిస్తారు. ఏడాదికి 15 చొప్పున పూర్తిస్థాయి వేతనం ఇచ్చే సిక్ లీవులు ఇస్తారు. వీటిని గరిష్ఠంగా 120 రోజుల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. ఏడాదికి 11 చొప్పున క్యాజువల్ లీవులు (సీఎల్) ఇస్తారు. ప్రస్తుత విధానం ప్రకారం ఒకసారికి వరుసగా నాలుగు రోజుల వరకు సీఎల్ మంజూరు చేస్తారు. అలవాటు ప్రకారం గైర్హాజరు కానివారికి మాత్రం ప్రత్యేక పరిస్థితుల్లో గరిష్ఠంగా ఏడు రోజులు సీఎల్ వాడుకోవచ్చు. ప్రస్తుతం ఉన్న 8 జాతీయ/పండగ సెలవులు కొనసాగుతాయి. వీటితోపాటు అదనంగా అంబేడ్కర్ జయంతి జయంతి సందర్భంగా ఏప్రిల్ 14న వేతనంతో కూడిన సెలవు, మరొక వేతనంతో కూడిన ఐచ్ఛిక సెలవు సంక్రాంతి/రంజాన్/క్రిస్మస్‌లకు లభిస్తుంది. యాజమాన్యం జారీ చేసిన ఉత్తర్వులతో 2018 జనవరి నుంచి కొత్తగా లభించే ఆర్జిత, సిక్‌లీవుల నిల్వ సామర్థ్యం ప్రకారం కార్మికులు అదనంగా మరో పది చొప్పున దాచుకునే అవకాశం ఉంటుంది.

గ్రాట్యుటీ లెక్కింపు విధానాన్ని మార్చాలి

తెబొగకాసం మాజీ ప్రధాన కార్యదర్శి కోటిలింగం

శ్రీరాంపూర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన గ్రాట్యుటీ సవరణ బిల్లు ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ దక్కేలా మరిన్ని మార్పులు చేర్పులు చేయాలని తెబొగకాసం మాజీ ప్రధాన కార్యదర్శి పెద్దపెల్లి కోటిలింగం డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ పదో వేతన ఒప్పందం ప్రకారం కార్మికుల వేతనాలు పెరిగినప్పటికీ, పెరగనున్న 20 లక్షల గ్రాట్యుటీ కొందరికే అందుతుందని వాపోయారు. ఉదాహరణకు 35 ఏళ్ల పాటు సర్వీసు పూర్తి చేసి, రూ. 70వేల వేతనం పొందే ఏ గ్రేడు ఉద్యోగికి ఇప్పుడున్న డీఏ ప్రకారం రూ. 15 లక్షలు గ్రాట్యుటీ లభిస్తుందన్నారు. గ్రాట్యుటీ లెక్కింపు విధానంలో మార్పులు చేయాలని ఆయన కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం ఎప్పుడు అనుకుంటే అప్పుడే చట్ట సవరణతో సంబంధం లేకుండా, గ్రాట్యుటీలో మార్పులు చేర్పులు చేయడానికి ఈ సవరణ బిల్లు వీలు కల్పిస్తోందని వివరించారు.

క్రీడల అభివృద్ధికి యాజమాన్యం ప్రత్యేక చొరవ

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: సంస్థలో క్రీడల అభివృద్ధికి యాజమాన్యం ప్రత్యేక చొరవ తీసుకొంటుందని శ్రీరాంపూర్ జీఎం సుభాని తెలిపారు. ఈ నెల 8 నుంచి 10వ తేది వరకు కొత్తగూడెంలో జరిగిన ఇంటర్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ క్రికెట్ టోర్నమెంట్‌లో శ్రీరాంపూర్ అధికారుల జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా శనివారం జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏరియా క్రికెట్ జట్టు క్రీడాకారులను ఆయన అభినందించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణిస్తున్నారన్నారు. క్రికెట్ పోటీల్లో ఏరియా జట్టు విజేతగా నిలువడంతో ముఖ్య భూమిక పోషించిన అధికారులు జి. శ్రీధర్, గుండు రాజు, ఎస్. సురేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం పీవీ సత్యనారాయణ, ఏజెంట్ విజయభాస్కర్‌రెడ్డి, డీవైజీఎం(ఐటీ) ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు కప్‌ను అందజేస్తు అభినందిస్తున్న జీఎం సుభాని

ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం పీవీ సత్యనారాయణ, ఏజీఎం ఫణీ, డీవైపీఎం తుకారాం తదితరులు పాల్గొన్నారు.

కాలసూచీ ఆవిష్కరణ

సింగరేణి యాజమాన్యం రూపొందించిన 2018 కాలసూచీని శనివారం జీఎం సుభాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్మికుడికి కాలసూచీలను అందజేస్తామన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి తోడ్పడినప్పుడే సంస్థ ప్రగతి పథంలో నడుస్తుందని ఆయన తెలిపారు.

ఆర్కే-న్యూటెక్ గనిలో..

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-న్యూటెక్ గనిలో 2018 కాలసూచీని గని మేనేజర్ జె. వెంగళరావు శనివారం ఆవిష్కరించి ఉద్యోగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే-న్యూటెక్ గని అధికారులు వి. భిక్షమయ్య, ఆర్. లింగయ్య, ఎం. శ్రీనివాసరావు, జి. బి. మాధవ్, ప్రవీణ్, తెబొగకాసం నేత డి. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి చక్రాలు.. 2017 2018 'వెలుగు'ల ఆశలు

● సంతృప్తిని మిగిల్చిన 2017 ● సింగరేణిలో పలు మార్పులు



శ్రీరాంపూర్, న్యూస్‌టుడే

తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తూ, రాష్ట్రానికి వెలుగులు నింపుతున్న సింగరేణి కొత్త సంవత్సరంలో కొంగొత్త ఆశలతో కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి సంసిద్ధమైంది. ఈ ఆదివారంతో 2017కి వీడ్కోలు పలుకుతూ, నూతన వత్సరం లోకి అడుగిడుతున్న సింగరేణిపై ఇటు ప్రభుత్వం, అటు కార్మికులు, నిరుద్యోగులకు ఆశలు పెరిగాయి. ఈ ఏడాది సింగరేణి ప్రస్థానం, సాధించిన ప్రగతి, వచ్చే ఏడాది ఎదురయ్యే సవాళ్లు, అవకాశాలపై 'న్యూస్‌టుడే' కథనం.

దక్షిణాదిలో బొగ్గు ఉత్పత్తి చేస్తున్న ఏకైక బొగ్గు పరిశ్రమ సింగరేణి 128 ఏళ్ల నుంచి జాతీయ సంపదను అందిస్తూ వస్తోంది. బొగ్గు ఆధారిత విద్యుత్తు పరిశ్రమలు, సిమెంటు, ఎరువులు, రసాయనాలు, తదితర అనేక పరిశ్రమలకు అవసరమైన బొగ్గును ఉత్పత్తి చేసి రెండు తెలుగు రాష్ట్రాలకే కాకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలకు బొగ్గు రవాణా చేస్తోంది. 29 భూగర్భ, 118 ఉపరితల గనుల ద్వారా రోజుకు దాదాపు రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసి రవాణా చేస్తోంది. 53 వేల మంది పైచిలుకు శాశ్వత ఉద్యోగులు పనిచేస్తుండగా, దాదాపు 20 వేల మంది ఒప్పంద ఉద్యోగులతోపాటు మరో లక్ష మంది పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు. 2017లో సింగరేణి సంస్థ ఆశించిన పనితీరును కనబర్చింది. గతంలో ఎన్నడూలేని విధంగా 1200 మెగావాట్ల సింగరేణి విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం ద్వారా రాష్ట్రానికి నిర్విరామంగా పూర్తిస్థాయిలో విద్యుత్తును అందించడం ఈ ఏడాది ప్రత్యేకత.

కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు

సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలకు ఆరో దఫా ఎన్నికల్ని విజయవంతంగా నిర్వహించింది. గతంలో ఎన్నడూలేని విధంగా కార్మిక సంఘాల మధ్య పోటీ నెలకొంది. తెబొగకాసంను ఓడించడానికి ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీఎన్టీయూసీలు పొత్తు కుదుర్చుకోవడం సింగరేణిలో ఇదే తొలిసారి. అక్టోబరు 5న జరిగిన ఎన్నికల్లో కార్మికవర్గం తెబొగకాసంకు 9 ఏరియాల్లో పట్టం కట్టడంతో సింగరేణి స్థాయిలో గుర్తింపు సంఘంగా మరోసారి ఎన్నికైంది. తెబొగకాసంపై కార్మికవర్గంలో వ్యతిరేకత ఉన్నప్పటికీ, తెరాస, కేసీఆర్‌లు తమ సమస్యలు పరిష్కరిస్తారని కార్మికులు అధికార పార్టీ అనుబంధ సంఘాన్ని గెలిపించారు.

ఉత్పత్తి, రవాణా మధ్య సమతూకం

ఈ ఏడాది ఉత్పత్తి, రవాణా మధ్య అంతరం ఎక్కువ ఉండకుండా యాజమాన్యం చర్యలు తీసుకుంది. ఉత్పత్తి చేసిన బొగ్గును పెద్ద ఎత్తున నిల్వ చేయడం వల్ల నాణ్యత పడిపోవడం, బొగ్గు ఆక్సీకరణ చెంది దానికదే అంటుకుని మండటం (స్పాంటేనియస్ హీట్) వల్ల కార్మికులు చెమటోడ్చి కష్టపడి సాధించిన ఉత్పత్తి బుగ్గిపాలు కాకుండా ఉండేందుకు రవాణాపై ఈ ఏడాది దృష్టి సారించింది. ఫలితంగా బొగ్గు రవాణా పెరిగింది. తదనుగుణంగానే ఉత్పత్తిని నిర్దేశించుకుని ఉత్పత్తి, రవాణాల మధ్య సమతూకం పాటిస్తూ వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరం డిసెంబరు నాటికి 9 నెలల కాలంలో మొత్తం 416.08 లక్షల టన్నుల ఉత్పత్తి సాధించగా, 462.87 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం విశేషం. బొగ్గు ఉత్పత్తి కన్నా అదనంగా 46.79 లక్షల టన్నుల బొగ్గును రవాణా చేసి రికార్డు నెలకొల్పింది. గతంలో ఉత్పత్తి కన్నా తక్కువ మొత్తం బొగ్గు రవాణా జరిగేది. ఉత్పత్తి చేసిన బొగ్గును వినియోగదారుల చెంతకు చేర్చకపోవడం వల్ల కలిగే నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం బొగ్గు రవాణాపై దృష్టి సారించింది.



కుదిరిన పదో వేతన ఒప్పందం

బొగ్గు గని కార్మికులకు పదో వేతన ఒప్పందం 2017 అక్టోబరు 10న జరిగింది. 20 శాతం కనీస పెరుగుదలతో పాటు, నాలుగు శాతం ప్రత్యేక కోల్ ఫీల్డ్ అలవెన్సు 4 శాతం ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ ఒప్పందం ద్వారా ఉద్యోగ విరమణ పొందిన కార్మికులు, వారి భార్యలకు కార్పొరేటు వైద్య సదుపాయం అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ వేతన ఒప్పందం ద్వారా గని కార్మికులందరికీ కార్పొరేటు వైద్యం పొందడానికి మరింత మెరుగైన ఒప్పందం చేసుకోవడం కార్మికవర్గానికి మేలు చేయనుంది. ఎల్‌టీసీని సెలవులతో సంబంధం లేకుండా వినియోగించుకునే వెసులుబాటు కొత్త వేతన ఒప్పందం ద్వారా కుదిరింది. గ్రాట్యుటీని రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచడానికి అంగీకరించి, పార్లమెంటు చట్టంలో సవరణ జరిగిన అనంతరం బొగ్గు పరిశ్రమకు వర్తించేలా ఒప్పందం చేసుకున్నారు.



పదో వేతన ఒప్పందం సందర్భంగా చర్చల్లో పాల్గొన్న కార్మిక నేతలు

ముఖ్యమంత్రి హామీల సునామీ

గుర్తింపు ఎన్నికల్లో తెబొగకాసంను అధిక మెజారిటీతో గెలిపించడంతో, ముఖ్యమంత్రి కేసీఆర్ 8న సమావేశం నిర్వహించి అనేక హామీలతో కార్మికవర్గాన్ని సంతృప్తి పరిచారు.

- కార్మిక సంఘాల చందాలను ఒక్క రూపాయి మాత్రమే వసూలు చేయాలి.
- వారసులకు కారుణ్య నియామకాలు
- గృహ నిర్మాణానికి వడ్డీ లేకుండా రూ.10 లక్షలు రుణం
- గనులపై సదుపాయాలు మెరుగు
- కార్మికుల క్వార్టర్లకు ఏసీలు పెట్టుకోవడానికి ఉచిత విద్యుత్తు
- కొత్తగా ఆరు బొగ్గు గనులను ఏర్పాటు



- మారుపేర్లతో పనిచేస్తున్న అలియాస్ కార్మికుల పేర్లు సవరణ
- కార్మికుల తల్లిదండ్రులకు కార్పొరేటు వైద్యం
- ఐఐటీ, ఐఐఎంలలో సీటు సాధించిన కార్మికుల పిల్లలకు ఫీజుల చెల్లింపు
- మహిళా ఉద్యోగులకు శిశు సంరక్షణ సెలవులు
- అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 14న వేతనంతో కూడిన సెలవు

ఈ హామీల్లో అనేకం ఆచరణరూపం దాల్చాయి. ఒక్క కారుణ్య నియామకాలు, రూ.పది లక్షల గృహ రుణం హామీలు కొత్త సంవత్సరంలోనైనా అమలుకు నోచుకుంటాయని కార్మికవర్గం ఎదురు చూస్తోంది.



ప్రగతి భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన కార్మికులు

రెండుసార్లు వందశాతం విద్యుత్తు ఉత్పత్తి

జైపూర్: రాష్ట్రంలో విద్యుత్తు సమస్య తొలగించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్టీపీపీపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. ఈ క్రమంలో పనులు వేగవంతగా పూర్తి చేసి గతేడాది విద్యుత్తు ఉత్పత్తి చేయడం ప్రారంభించారు. జాతీయస్థాయిలో ఇతర విద్యుత్తు ఉత్పత్తి సంస్థలతో పోటీ పడుతూ ఈ సంవత్సరం ఇది దేశంలో 7వ స్థానంలో నిలబడింది. యూనిట్-2 ఇప్పటికి మూడు సార్లు నూరు శాతం పూర్తి స్థాయి ఉత్పత్తి సాధించింది. నవంబరు వరకు ఎస్టీపీపీ 10,504 మిలియన్ యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసి 9,817 మిలియన్ యూనిట్లను గ్రిడ్‌కు అనుసంధానం చేశారు.



సింగరేణి సిగలో కళ్యాణిఖని




మందమర్రి పట్టణం: మందమర్రి ఏరియాలో మూసివేసిన కేకే2, ఎస్ఎంజీ 1,2,3 గనులో మిగిలిన బొగ్గు నిక్షేపాలను వెలికితీసేందుకు కళ్యాణిఖని పేరుతో ఉపరితల గనిని ఏర్పాటు చేసింది. మందమర్రి ఏరియాలో రెండో ఓసీ కాగా సింగరేణిలో 18వ ఉపరిగల గనిగా ఇది నిలిచిపోయింది. ఏటా పది లక్షల టన్నుల బొగ్గును వెలికతీయడం లక్ష్యం. సెప్టెంబర్‌లో దీన్ని ప్రారంభించారు. కేకే ఓసీ ఏర్పాటును నిరసిస్తూ మందమర్రి పట్టణంలోని ఎర్రగుంటపల్లి గ్రామం, కాసిపేట మండలంలోని గ్రామస్థులు అనేక రోజుల పాటు ఉద్యమాలు చేశారు. రాష్ట్రంలో ఉపరితల గనుల చర్చకు కళ్యాణిఖని ఉపరితలగని కేంద్ర బిందువైంది.

గడిచిన ఐదేళ్లలో సింగరేణి సాధించిన ఉత్పత్తి వివరాలు..

సీఎండీ శ్రీధర్



2017-18 ఉత్పత్తి ..డిసెంబరు నాటికి మాత్రమే. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో మూడు నెలలు మిగిలి ఉంది.



ఇవీ విశేషాలు... ● ఈసారి పురస్కారాల పంట ● కొత్త డైరెక్టర్లు ముగ్గురు..

సింగరేణి సంస్థ 2017లో అనేక పురస్కారాలు సాధించడమే కాకుండా, కొత్త కొత్త నిర్ణయాలు తీసుకుంది. సంస్థలో అపార అనుభవం ఉన్న కీలకమైన ముగ్గురు ఉద్యోగ విరమణ చేయగా, వారి స్థానంలో కొత్త డైరెక్టర్లు నియామకయ్యారు. 2017లో చోటు చేసుకున్న ప్రధాన ఘట్టాల వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

- **జనవరి:** సింగరేణిలో నెలకొన్న సమస్యలపై రాష్ట్ర శాసనసభలో 5న ప్రత్యేక చర్చ జరిగింది.
- **ఫిబ్రవరి:** సింగరేణి ఎస్టీపీపీ నిర్మాణంలో కీలక భూమిక పోషించిన డైరెక్టర్ (ఈ అండ్ ఎం) రమేష్‌బాబు ఉద్యోగ విరమణ చేయగా, ఆయన స్థానంలో శంకర్ నియామకమయ్యారు.
- 49వ రక్షణ వారోత్సవాల బహుమతుల ప్రదానం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో నిర్వహించారు.
- **మార్చి:** సంస్థలో అపార అనుభవం గడించిన సింగరేణి ప్రాజెక్టు ప్లానింగ్ విభాగం డైరెక్టర్ ఎ. మనోహర్‌రావు ఉద్యోగ విరమణ చేశారు.
- **ఏప్రిల్:** సింగరేణిలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన డైరెక్టర్ (ఆపరేషన్స్) బిక్కి రమేష్‌కుమార్ ఉద్యోగ విరమణ చేశారు.
- **మే:** మేడే సందర్భంగా సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ యాజమాన్య పురస్కారాన్ని సీఎండీ శ్రీధర్‌కు అందించింది.
- సింగరేణికి కొత్త డైరెక్టర్లుగా చంద్రశేఖర్ (ఆపరేషన్స్), బి.భాస్కర్‌రావు (ప్రాజెక్టు, ప్లానింగ్)లను బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఎంపిక చేశారు.
- **మే** 25న సింగరేణి బోర్డు డైరెక్టర్ల సమావేశంలో జైపూర్‌లో ప్రస్తుతం ఉన్న 2×600 మెగావాట్ల యూనిట్‌కు అదనంగా 800 మెగావాట్ల మూడో యూనిట్ నిర్మాణానికి ఆమోదం లభించింది.
- **జూన్** 15 నుంచి సింగరేణిలో జాతీయ కార్మిక సంఘాలు నిరవధిక సమ్మె తలపెట్టాయి. ఇది పది రోజుల పాటు కొనసాగింది.
- **జులై** 18న సింగరేణికి జాతీయ స్థాయిలో ఎక్స్‌లెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్‌మెంట్ అవార్డు లభించింది.
- **జులై** 31న వేజ్‌బోర్డు స్థాయిలో 665 ఉద్యోగాలకు, 107 అధికారుల ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ అయింది.
- **ఆగస్టు** 6న సింగరేణి ప్రజా సంబంధాల విభాగానికి వివిధ విభాగాల్లో ఏకంగా ఐదు ఉత్తమ జాతీయ అవార్డులు అందాయి.
- సింగరేణి కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు నిర్వహించడానికి డిప్యూటీ సీఎల్‌సీ సెప్టెంబరు 21న నోటిఫికేషన్ జారీ చేశారు.
- **సెప్టెంబరులో** సంస్థ 2016-17 ఆర్థిక సంవత్సరానికి రూ. 395.38 కోట్లు లాభం గడించినట్లు ప్రకటించింది.
- సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా 23 నుంచి 25 శాతానికి పెంచుతున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు.
- **అక్టోబరు** 5న సింగరేణి కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు జరిగాయి. 11 ఏరియాల్లో రెండింటిని ఏఐటీయూసీ, మిగతా 9 ఏరియాలను తెరాస అనుబంధ తెబొగకాసం గెలుచుకుంది.
- **అక్టోబరు** 9న 2,718 మంది బదిలీ వర్కర్లను శాశ్వతం చేస్తూ యాజమాన్యం భ్రమణిక జారీ చేసింది.
- సింగరేణి కార్మికుల ఆరోగ్యం గురించి తొలిసారిగా ఆరోగ్య సిరి పుస్తకాన్ని అక్టోబరు 10 ఆవిష్కరించి కార్మికుందరికీ పంపిణీ చేశారు.
- బొగుగని కార్మికులకు అక్టోబరు 10న వేతన ఒప్పందం కుదిరింది.
- రామగుండంలో 50 మెగావాట్లు, మందమర్రిలో మరో 50 మె.వా. సౌర విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణం కోసం ఆగస్టు 31న యాజమాన్యం తీసుకున్న నిర్ణయంపై 13న అధికారులతో ఆచరణ కోసం సమీక్ష సమావేశం జరిగింది.
- **నవంబరు** 6న సింగరేణి విద్యుత్తు ఉత్పత్తి కేంద్రం 100 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) సాధించిన సంస్థల్లో జాతీయ స్థాయిలోనే ఆరో స్థానం సాధించింది.
- **నవంబరు** 6 నుంచి 8 వరకు సింగరేణి చరిత్రలో తొలిసారిగా డైరెక్టర్ (పా) పవిత్రన్ కుమార్ ఆధ్వర్యంలో అధికారుల బృందం సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో కార్మికుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి ప్రజా ఫిర్యాదుల విభాగం నిర్వహించింది.
- నవంబరు నెలాఖరు నాటికి సింగరేణి 363 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా, 407 లక్షల టన్నులు రవాణా చేసింది. 2420 లక్షల ఘ.మీ. ఓబీ (మట్టి)ని వెలికతీసింది. ఈ ఏడాదిలో బొగ్గు రవాణాలో అత్యధికంగా 11 శాతం వృద్ధిని నమోదు చేసింది. గతేడాదితో పోల్చుకుంటే ఓబీ వెలికితీతలో 29 శాతం అధికంగా తీసింది.
- **డిసెంబరు** నెలలో సింగరేణి వ్యాప్తంగా పండగ వాతావరణంలో వార్షిక రక్షణ వారోత్సవాలు, సింగరేణి ఆవిర్భావ దినోత్సవం జరిగింది.

ప్రతిభ

2017 క్రీడలు

పాలీ ఉమ్రిగర్ అవార్డు విజేత...?

15 జులై



వింబుల్డన్ మహిళల సింగిల్స్ విజేతగా గార్బైన్ ముగురుజ (స్పెయిన్) నిలిచింది. రన్నరప్ వీనస్ విలియమ్స్ (అమెరికా).

29 అక్టోబరు



ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ సిరీస్ బ్యాడ్మింటన్ టైటిల్‌ను ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్ నెగ్గాడు. తద్వారా ఒక ఏడాదిలో 4 సూపర్ సిరీస్ టైటిళ్లు సాధించిన ఏకైక భారత షట్లర్‌గా శ్రీకాంత్ రికార్డు సృష్టించాడు.

జనవరి

8: చెన్నై ఓపెన్ టెన్నిస్ టోర్నీ సింగిల్స్ టైటిల్‌ను రాబర్టో బౌటిస్టా అగట్ (స్పెయిన్) గెలుచుకున్నాడు.

22: భారత స్టార్ షట్లర్ సైనా నెహ్వాల్ మలేసియా మాస్టర్స్ గ్రాండ్ ప్రి గోల్డ్ టైటిల్ నెగ్గింది. ఫైనల్లో చోచువాంగ్ (థాయ్‌లాండ్)ను ఓడించింది.

28: ఆస్ట్రేలియన్ ఓపెన్ - 2017 మహిళల సింగిల్స్ విజేతగా సెరెనా విలియమ్స్ (అమెరికా) నిలిచింది. ఫైనల్లో అక్క వీనస్ విలియమ్స్‌పై నెగ్గింది.

✪ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) నెగ్గాడు. ఫైనల్లో రఫెల్ నాదల్ (స్పెయిన్)ను ఓడించాడు.

ఫిబ్రవరి

7: జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను సౌరభ్‌వర్మ నెగ్గాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను రితూపర్ణ దాస్ చేజిక్కించుకుంది.

12: భారత అంధుల క్రికెట్ జట్టు టీ20 ప్రపంచకప్ విజేతగా నిలిచింది. బెంగళూరులో జరిగిన ఫైనల్‌లో పాకిస్థాన్‌పై నెగ్గింది.

మార్చి

7: మొబైల్ తయారీ సంస్థ ఒప్పో అయిదేళ్ల కాలానికి రూ. 1079 కోట్లు చెల్లించి టీమిండియా స్పాన్సర్‌షిప్ సొంతం చేసుకుంది.

ఏప్రిల్

2: ఇండియా ఓపెన్ సూపర్ బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల సింగిల్స్ విజేతగా పీవీ సింధు నిలిచింది. రన్నరప్ కరోలినా మరిన్ (స్పెయిన్).

23: మాంటెకార్లో మాస్టర్స్ సిరీస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రఫెల్ నాదల్ (స్పెయిన్) నెగ్గాడు. ఈ టోర్నీ విజేతగా నిలవడం నాదల్‌కు ఇది పదోసారి కావడం విశేషం. దీంతో క్లే కోర్టులపై అత్యధికంగా 50 సింగిల్స్ టైటిల్స్ నెగ్గిన క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు.

30: భారత స్క్వాష్ క్రీడాకారిణి జోష్న చిన్నప్ప ఆసియా స్క్వాష్ టైటిల్ గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా నిలిచింది. చెన్నైలో జరిగిన ఫైనల్లో భారత్‌కే చెందిన దీపిక పల్లికల్‌పై నెగ్గింది.

మే

6: అజ్లాన్‌షా హాకీ టోర్నీ విజేతగా బ్రిటన్ నిలిచింది. మలేసియాలోని ఇఫోలో జరిగిన టోర్నీలో ఆస్ట్రేలియా రన్నరప్‌గా, భారత్ మూడో స్థానంలో నిలిచాయి.

21: ఐపీఎల్ -2017 (సీజన్ 10) విజేతగా ముంబయి ఇండియన్స్ నిలిచింది. హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్లో రైజింగ్ పుణె సూపర్ జైంట్స్‌పై విజయం సాధించింది. మూడు ఐపీఎల్ టైటిళ్లు గెలిచిన తొలి జట్టుగా ముంబయి నిలిచింది.

28: దక్షిణ కొరియా జట్టు సుదిర్మన్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా నిలిచింది. ఫైనల్లో చైనాపై నెగ్గింది.

జూన్

4: తెలుగు తేజం భమిడిపాటి సాయి ప్రణీత్ థాయ్‌లాండ్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ బ్యాడ్మింటన్ టైటిల్ నెగ్గాడు. సాయి కెరియర్‌లో ఇదే తొలి ప్రి గోల్డ్ టైటిల్.

10: ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ విజేతగా జెలెనా వోస్టాపెంకో (లాత్వియా) నిలిచింది. రన్నరప్ సిమోనా హలెప్ (రొమేనియా).

✪ పురుషుల సింగిల్స్ విజేతగా రఫెల్ నాదల్(స్పెయిన్) నిలిచాడు. రన్నరప్‌గా వావ్రింకా (స్విట్జర్లాండ్) నిలిచాడు.

18: ఇండోనేషియా ఓపెన్ సూపర్‌సిరీస్ ప్రీమియర్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్ నిలిచాడు. రన్నరప్ కజుమస సకాయ్ (జపాన్).

10 ఫిబ్రవరి



హైదరాబాద్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ద్విశతకం (204) నమోదు చేశాడు. తద్వారా వరుసగా 4 టెస్ట్ సిరీస్‌ల్లో డబుల్ సెంచరీలు సాధించిన ఏకైక బ్యాట్స్‌మన్‌గా రికార్డు సృష్టించాడు.

1 మార్చి

2015-16 సీజన్‌కు బీసీసీఐ వార్షిక అవార్డులను ప్రకటించింది. పాలీ ఉమ్రిగర్ అవార్డును విరాట్ కోహ్లీకి ప్రకటించారు. 2011-12, 2014-15 లో కూడా ఈ అవార్డు గెలుచుకున్న కోహ్లీ, మూడుసార్లు దీనికి ఎంపికైన తొలి భారత క్రికెటర్‌గా నిలిచాడు.

జులై

9: భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ 29 (12 + 5 + 12) పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది.

15: వింబుల్డన్ పురుషుల సింగిల్స్ విజేతగా రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) నిలిచాడు. లండన్‌లో జరిగిన ఫైనల్లో మారిన్ సిలిచ్ (క్రొయేషియా)పై నెగ్గాడు.

23: మహిళల క్రికెట్ ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ నిలిచింది. లండన్‌లోని లార్డ్స్‌లో జరిగిన ఫైనల్లో 9 పరుగుల తేడాతో భారత్‌పై నెగ్గింది. భారత్ జట్టు కెప్టెన్‌గా మిథాలీ రాజ్ వ్యవహరించారు.

24: యూఎస్ ఓపెన్ గ్రాండ్ ప్రి గోల్డ్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్ విజేతగా భారత్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్ నిలిచాడు. రన్నరప్ - భారత క్రీడాకారుడు పారుపల్లి కశ్యప్.

ఆగస్టు

6: లండన్‌లో జరిగిన ప్రపంచ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగులో అమెరికా అథ్లెట్ జస్టిన్ గాట్లిన్ స్వర్ణం నెగ్గాడు. ఉసేన్ బోల్ట్ (జమైకా) తన చివరి రేసులో కాంస్యానికే పరిమితమయ్యాడు.

17: బల్గేరియా ఓపెన్ టెన్నిస్ టోర్నీ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను భారత్‌కు చెందిన లక్ష్యసేన్ నెగ్గాడు.

27: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను ఒకుహర (జపాన్) నెగ్గింది. రన్నరప్‌గా పీవీ సింధు నిలిచింది. పురుషుల సింగిల్స్ టైటిల్‌ను విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్) నెగ్గాడు.

సెప్టెంబరు

5: వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో పాల్గొన్న తొలి భారతీయురాలిగా హరియాణాకు చెందిన కవితాదేవి చరిత్ర సృష్టించింది.

7: కామన్వెల్త్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో రాగాల వెంకట రాహుల్, రాగాల వరుణ్ స్వర్ణాలు నెగ్గారు.

10: యూఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను స్లోన్‌స్టీవెన్స్ (అమెరికా) గెలిచింది. ఫైనల్లో మాడిసన్ కీస్‌పై నెగ్గింది.

✪ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను రఫెల్ నాదల్ (స్పెయిన్) నెగ్గాడు. రన్నరప్ - కెవిన్ ఆండర్సన్ (దక్షిణాఫ్రికా).

17: కొరియా ఓపెన్ సూపర్ సిరీస్ విజేతగా పీవీ సింధు నిలిచింది. సియోల్‌లో జరిగిన ఫైనల్లో ఒకుహర (జపాన్)పై నెగ్గింది.

అక్టోబరు

22: ఆసియాకప్ హాకీ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది. ఢాకాలో జరిగిన ఫైనల్లో 2-1 తో మలేసియాపై నెగ్గింది.

✪ డెన్మార్క్ ఓపెన్ సూపర్ సిరీస్ విజేతగా కిదాంబి శ్రీకాంత్ నిలిచాడు. రన్నరప్ లీ హ్యున్ (దక్షిణ కొరియా).

28: భారత్ తొలిసారిగా ఆతిథ్యమిచ్చిన ఫిఫా అండర్ -17 ప్రపంచకప్ విజేతగా ఇంగ్లండ్ నిలిచింది. కోల్‌కతాలో జరిగిన ఫైనల్లో 5-2 గోల్స్‌తో స్పెయిన్‌ను ఓడించింది.

30: బ్రిటన్ రేసర్ లూయిస్ హామిల్టన్ ఫార్ములావన్ ప్రపంచ ఛాంపియన్ షిప్ టైటిల్ విజేతగా నిలిచాడు.

నవంబరు

5: మహిళల ఆసియాకప్ హాకీ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది. జపాన్‌లోని కకామిగహరలో జరిగిన ఫైనల్లో చైనాపై నెగ్గింది.

8: జాతీయ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషులు, మహిళల విభాగాల్లో హెచ్‌ఎస్ ప్రణయ్, సైనా నెహ్వాల్ విజేతలుగా నిలిచారు.

27: భారత స్టార్ పంకజ్ అడ్వాణీ ఐబీఎస్‌ఎఫ్ ప్రపంచ స్నూకర్ టైటిల్ విజేతగా నిలిచాడు. పంకజ్ కెరియర్‌లో ఇది 18 వ ప్రపంచ టైటిల్.

డిసెంబరు

8: ప్రతిష్ఠాత్మక గోల్డెన్ బాల్ అవార్డును పోర్చుగల్ ఫుట్‌బాల్ దిగ్గజం క్రిస్టియానో రొనాల్డోకు పారిస్‌లో ప్రదానం చేశారు. రొనాల్డో ఈ అవార్డు గెలుచుకోవడం ఇది అయిదోసారి.

27: దక్షిణాఫ్రికాలోని పోర్ట్ ఎలిజబెత్‌లో ఐసీసీ ప్రయోగాత్మకంగా నిర్వహించిన మొట్టమొదటి నాలుగు రోజుల టెస్టు మ్యాచ్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ 120 పరుగుల తేడాతో జింబాబ్వేను ఓడించింది.

28: సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను విశ్వనాథన్ ఆనంద్ గెలుచుకున్నాడు.

2017 పర్యటనలు

జనవరి

7: ఏడు రోజుల పర్యటన నిమిత్తం పోర్చుగల్ ప్రధానమంత్రి ఆంటోనియో కోస్టా దిల్లీ చేరుకున్నారు. ప్రధాని మోదీతో సమావేశమయ్యారు.

11: భారత పర్యటనలో భాగంగా కెన్యా అధ్యక్షుడు ఉహూరు కెన్యాట్టా రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, ప్రధాని మోదీలతో దిల్లీలో సమావేశమయ్యారు.

ఫిబ్రవరి

21: అమెరికా నుంచి వచ్చిన 26 మంది శాసనకర్తల బృందం ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమైంది. అమెరికాలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ బృందం రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

✪ భారత పర్యటనలో భాగంగా మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

మార్చి

6: ఉపరాష్ట్రపతి మహ్మద్ హమీద్ అన్సారీ రెండు రోజుల పాటు జకార్తాలో పర్యటించారు. మొట్టమొదటి ఐఓఆర్ఏ (ఇండియన్ ఓషన్ రిమ్ అసోసియేషన్) నాయకత్వ సదస్సులో పాల్గొన్నారు.

7: ఉగాండా ప్రధానమంత్రి రుహాకనా రుగుండా అయిదు రోజులపాటు భారత్‌లో పర్యటించారు.

ఏప్రిల్

8: బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

10: భారత్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా ప్రధాని మాల్కమ్ టర్న్‌బుల్ మోదీతో సమావేశమయ్యారు.

28: సైప్రస్ అధ్యక్షుడు నికోస్ అనస్తాషియెస్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

మే

11: ప్రధాని మోదీ రెండు రోజులపాటు శ్రీలంకలో పర్యటించారు. కొలంబోలో నిర్వహించిన అంతర్జాతీయ వేసక్ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

31: ప్రధాని మోదీ స్పెయిన్ పర్యటనలో భాగంగా అధ్యక్షుడు మారియానో రజోయ్‌తో సమావేశమయ్యారు. ఏడు ఒప్పందాలపై సంతకాలు చేశారు.

జూన్

1: మోదీ రష్యా పర్యటనలో భాగంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో సమావేశమయ్యారు. నాగ్‌పుర్-సికింద్రాబాద్ మధ్య అత్యంత వేగవంతమైన రైలు సర్వీసు ఏర్పాటుకు ఈ సందర్భంగా ఒప్పందం కుదిరింది.

3: ఫ్రాన్స్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో పారిస్‌లోని అధ్యక్ష భవనం ఎలీస్ ప్యాలెస్‌లో సమావేశమయ్యారు.

9: కజకిస్థాన్ రాజధాని ఆస్తానాలో జరిగిన షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యారు.

24: ప్రధాని మోదీ పోర్చుగల్ పర్యటనలో భాగంగా పోర్చుగల్ ప్రధాని ఆంటోనియా కోస్తాతో సమావేశమయ్యారు.

27: మూడు రోజుల అమెరికా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ వాషింగ్టన్‌లోని శ్వేతసౌధంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. సీమాంతర ఉగ్రవాదంపై ఇరువురు నేతలు ప్రధానంగా చర్చించారు.

✪ అమెరికా పర్యటన తర్వాత మోదీ నెదర్లాండ్స్ చేరుకుని, ప్రధాని మార్క్ రూత్‌తో సమావేశమయ్యారు.

జులై

5: ప్రధాని మోదీ మూడురోజుల ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో జెరూసలేంలో చర్చలు జరిపారు. అధ్యక్షుడు రూవెన్ రివ్లిన్‌తోనూ సమావేశమయ్యారు. ఇజ్రాయెల్ సందర్శించిన తొలి భారత ప్రధానిగా మోదీ చరిత్ర సృష్టించారు.

7: జర్మనీలోని హాంబర్గ్‌లో జరిగిన జీ-20 శిఖరాగ్ర సదస్సులో మోదీ పాల్గొని ప్రసంగించారు.

ఆగస్టు

24: నేపాల్ ప్రధాని షేర్ బహదూర్ దేవుబా భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు. ఎనిమిది ఒప్పందాలు కుదిరాయి.

31: స్విట్జర్లాండ్ అధ్యక్షురాలు డోరిస్ లూథర్డ్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

సెప్టెంబరు

4: చైనాలోని షామన్‌లో జరిగిన బ్రిక్స్ కూటమి శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ పాల్గొన్నారు.

12: బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకషెంకో భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో సమావేశమయ్యారు.

14: రెండు రోజుల భారత పర్యటనలో భాగంగా జపాన్ ప్రధాని షింజో అబే ప్రధాని మోదీతో గాంధీనగర్‌లో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

అక్టోబరు

4: రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నాలుగు రోజుల తొలి విదేశీ పర్యటనలో భాగంగా అధ్యక్షుడు ఒమర్‌గులేహ్‌తో జిబూతీలో సమావేశమయ్యారు.

24: అఫ్గనిస్థాన్ అధ్యక్షుడు అష్రాఫ్ ఘనీ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ, రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌లతో విడివిడిగా సమావేశమయ్యారు.

30: ఇటలీ ప్రధానమంత్రి పవోలో జెంటిలోని భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

నవంబరు

1: భారత పర్యటనలో భాగంగా భూటాన్ రాజు జిగ్మేఖేసర్ నాంగ్యల్ వాంగ్‌చుక్ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో దిల్లీలో సమావేశమయ్యారు.

13: మనీలాలో 'ఆసియాన్' వాణిజ్యవేదిక సమావేశాన్ని ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు.

14: మనీలాలో నిర్వహించిన 15 వ ఆసియాన్-భారత్ సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు.

డిసెంబరు

13: కామన్‌వెల్త్ సెక్రటరీ జనరల్ పెట్రీషియా స్కాట్‌ల్యాండ్ నాలుగు రోజులపాటు భారత్‌లో పర్యటించారు.

23: రష్యా ఉపప్రధాని దిమిత్రీ రొగోజిన్ భారత పర్యటనలో భాగంగా ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

రచయిత – సీహెచ్ కృష్ణప్రసాద్

1 ఏప్రిల్




భారత్‌లో ఆరు రోజుల పర్యటనకు వచ్చిన మలేసియా ప్రధానమంత్రి నజీబ్ అబ్దుల్ రజాక్ ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.

30 మే



ప్రధాని మోదీ నాలుగు దేశాల పర్యటనలో భాగంగా జర్మనీ ఛాన్సలర్ ఏంజెలా మెర్కెల్‌తో బెర్లిన్‌లో సమావేశమయ్యారు. 12 ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేశారు.

6 సెప్టెంబరు



ప్రధాని నరేంద్ర మోదీ ద్వైపాక్షిక పర్యటన నిమిత్తం మొదటిసారిగా మయన్మార్ చేరుకున్నారు. ప్రభుత్వ సలహాదారు ఆంగ్‌సాన్ సూచీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

5 అక్టోబరు



రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఇథియోపియా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు మాలాతు తెషోమేతో రాజధాని అడీస్ అబాబాలో చర్చలు జరిపారు.

Beesula Rajaiah, Mahadevpur

Q: Respected sir, please explain the meanings of the following words in Telugu with examples.

1. Perception 2. Perpetuate 3. Crave for
4. Take leave of 5. Supervision 6. Astonishment
7. Case of

A: 1) దేన్నైనా మనం అర్థం చేసుకునే తీరు. Eg: My perception of his nature is different from the others' perception of his nature.

2. Do something bad. Eg: He perpetuated the murder.

3. పరితపించి పోవడం. Eg: Having lost his mother in his early age, he is craving for a mother's love.

4. వీడ్కోలు పలకడం. Eg: He took leave of his father before going to America.

5. పర్యవేక్షణ. Eg: Under his supervision the work was done well.

6. విపరీతమైన ఆశ్చర్యం. Eg: I was filled with astonishment when I heard that I won a lakh rupees in the lottery.

7. The correct expression is 'in case of' = ఆ పరిస్థితిలో


Eg: In case of serious illness go to a doctor.

ప్రతిభ

స్పోకెన్ ఇంగ్లిష్ పాత సంచికల కోసం చూడండి.. www.eenadupratibha.net

Wish strongly for something...

VOCABULARY



1. Expedite = Speed up. (వేగవంతం చేయడం)

Eg: The manager wanted the setting up of another branch of the company expedited.

✪ Expedite X Slow down (తాత్సారం చేయడం).

Eg: The progress of the work on the bridge has slowed down.

2. Interrupt = To cause a break (అంతరాయం కలిగించడం).

Eg: To announce something, he interrupted the programme.

✪ Interrupt X Continue (కొనసాగించడం).

Eg: They continued the programme without any interruption.

3. Sedentary = Not moving / seated at a place / stationary (ఒకేచోట కూర్చుని చేసే పని)

Eg: A clerk's job is a sedentary job (because they are seated most of the time and do not move).

✪ Sedentary X mobile (moving) (కదిలే).

Eg: A police constable's job is mobile.

4. Transparent = a) Allowing light to pass through so that objects on the other side can be seen (పారదర్శకమైన).

Eg: Glass is transparent X opaque (కాంతిని అడ్డుకునే)

b) Easy to understand (సులభంగా అర్థం చేసుకునే).

Eg: His ideas are very transparent

✪ Transparent X dark / difficult to understand (అర్థం కాని).

5. Adequate = Enough (చాలినంత)

Eg: He has adequate money to buy a house.

✪ Adequate X Inadequate / meagre (తక్కువైన).

Eg: His earnings are so meagre that he cannot buy a house.



Writer

- M. Suresan

మీ ప్రశ్నలు పంపాల్సిన చిరునామా...

స్పోకెన్ ఇంగ్లిష్, ప్రతిభ విభాగం,
ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిల్మ్ సిటీ,
అనాజ్ పూర్, రంగారెడ్డి జిల్లా.

Email your questions to:
pratibhadesk@eenadu.net

Chinna Gowd

Q: Sir, please define the following words in Telugu with some examples.

1. Conjugation of tenses
2. Voice (active& passive)
3. Transcoding information
4. Vowel 5.Consonant 6. Dipthongs
7. Semi-vowels 8. Spotting errors
9. Paranyms 10. Aspect.

A: 1) Conjugation of tenses means forming the present tense, the past tense and the future tense of a verb, along with the subdivisions - the simple, continuous, the perfect and the perfect continuous tenses of a verb. (ఒక verb కు Tenses ఏర్పరచడాన్ని conjugation అంటారు. ప్రస్తుతం, ఎప్పుడూ, అలవాటు ప్రకారం చేసేది present tense. గతంలో ఉండటం, జరిగిన వాటిని past tense అంటాం. భవిష్యత్‌లో జరిగేదాన్ని future tense అంటాం.

2. In the active voice, we say, somebody does something, and in the passive voice, we say something is done by somebody (Active voice అంటే ఒకరు ఒక పని చేశారు అని చెప్పడం. Passive voice అంటే ఒకరి చేత ఒక పని చేయబడింది అని చెప్పడం).

Eg: Active Voice: Ramana says something. Passive voice: Something is said by Ramana.

Only verbs with objects have passive voice, except in the case of imperative sentences like, orders, requests, etc. (ఆజ్ఞలు, విన్నపాలు లాంటి వాక్యాలకు తప్ప, object లేని verbs కు passive voice ఉండదు.)

3. Transcoding information is adapting information to the digital version. This is technical, and however much it may be explained here, it is difficult to understand. (డిజిటల్ పద్ధతిలో సమాచారాన్ని మార్చడాన్ని Transcoding అంటారు. ఇది పూర్తిగా సాంకేతికం.)

4. Vowel sounds are sounds which we utter

SPOKEN ENGLISH
ఆంగ్లభాషణ 972

with our mouths open, vowel sounds అంటే తెలుగులో అచ్చులు. and the tongue or the lips not touching the other parts of the mouth. Vowels are not letters but the sounds of speech made by the organs of the mouth. (అచ్చులు అంటే అక్షరాలు కావు. నోటితో ఉచ్చరించే శబ్దాలు. In English the sounds represented by a, e, i, o, and u are vowel sounds. ఆంగ్లంలో a, e, i, o, u లు తెలిపే శబ్దాలను vowels అంటారు).

5. Consonant sounds are those which are made by the contact of one organ of the mouth with another organ of the mouth. Except the sounds represented by a, e, i, o and u are consonants. Consonants అంటే హల్లులు. ఆంగ్లంలో a, e, i, o, u లతో లేని శబ్దాలను consonants అంటాం.


6. Diphthongs are sounds formed by a combination of two vowels in a single syllable, in which the sound begins as one vowel, and moves towards another. Eg: Coin, loud, side. In coin, the sound begins with o and moves towards i. So here, the combination of the sounds of 'o' and 'i' is a diphthong.

7. A semivowel is a sound that is between a vowel and a consonant. Eg: H and Y.

8. Spotting errors means finding out the mistakes in a sentence.

9. Paranyms are euphemisms, that is, expressing an unpleasant matter in a pleasant manner. Eg: He is not such a fool as to be cheated by anybody.

10. Aspect is the positioning of something - it has other meanings too.



Kaja Syamala

Q: Please let me know the following in English

ఈ రోజుల్లో వచ్చే సినిమా హీరో, హీరోయిన్స్‌ను చూడలేకపోతున్నాం. చూడటానికి ఎవరూ బాగుండటం లేదు - ఈ వాక్యాన్ని ఇంగ్లిష్‌లో ఏమనాలి?

A: We find it difficult to see / we cannot see the heroes and heroines of today, as none of them is good looking.

Raju Surla

Q: Dear sir, please explain the following words in Telugu with examples.

1. Convulsed with 2. Convicted of
3. Convinced of 4. Distinguish from
5. Die for

A: 1. బాగా వణికిపోవడం, మన అదుపు లేకుండా

Eg: Because of a high fever, he was convulsing.

2. Punished (శిక్షపడటం). **Eg:** The judge convicted him to six months in jail.

3. This is the same as No 2.

4. Make a difference (వ్యత్యాసం చూపడం).

Eg: The teacher distinguished him from the others in the class because he was very clever.

5. Wish strongly for something.

Eg: Having lost his parents he is dying for parental love.

Grammar & Usage



In the last lesson we have seen the uses of was/were, the past doing word (Eg: saw, went, took, loved, linked, etc.) Now we are going to see the past perfect forms and the past perfect continuous forms.

Examples of the past perfect continuous tense: a) Had been, b) had + PP (past participle / V3).

'Had been' talks of an earlier of two past states of being (గతంలో రెండు ఉండటాలు ఉన్నప్పుడు, ముందర ఉన్నదానికి had been వాడతాం.)

He <u>had been</u> an MLA, before he <u>was</u> a minister. (అతడు మంత్రిగా ఉండే ముందు MLA గా ఉన్నాడు. అంటే ఇప్పుడు మంత్రిగా కూడా లేడు).

He had been in Vijayawada and then he was in Mumbai (మొదట విజయవాడలో ఉన్నాడు. తర్వాత ముంబయిలో ఉన్నాడు - ఇప్పుడు ముంబయిలో కూడా లేడు)

'Had been' అనేది 'be' form కదా, అంటే అది ఉండటాన్ని తెలుపుతుంది. ఇప్పుడు had + PP (V3) గురించి తెలుసుకుందాం. ఉదా: had seen, had gone, had done, etc. This verb talks about an action earlier than another past action. అంటే గతంలో రెండు చర్యల్లో ముందు జరిగిన చర్యకు had + PP (V3) వాడతాం.

Eg: a) He <u>told</u> me yesterday that he <u>had seen</u> the movie. (నిన్న నాతో చెప్పాడు తాను ఆ సినిమా (అంతకు ముందే) చూశానని - గమనించండి: ఇక్కడ గతంలో జరిగిన రెండు చర్యల్లో ముందు జరిగిన చర్యకు had + PP (V3) వాడతాం.

b) The train <u>had left</u> before I <u>entered</u> the station (నేను స్టేషన్లోకి ప్రవేశించకముందే రైలు వెళ్లిపోయింది) - ఇక్కడ కూడా, రెండు గతంలో జరిగిన పనులు ఉన్నాయి. ముందు జరిగింది రైలు వెళ్లిపోవడం, తర్వాత నేను ప్రవేశించడం. ఇదీ had + PP (V3) ఉపయోగం. తర్వాతి verb, had been + ing: ఇది గతంలో ముందు ప్రారంభమై, రెండో పని జరిగేవరకు కొనసాగిన పనిని తెలుపుతుంది.

Eg: She <u>had been working</u> here until she <u>got</u> transferred (ఆమె బదిలీ అయ్యేవరకు ఇక్కడే పని చేస్తూ ఉండేది). ఇక్కడ ఆమె పని చేయడం, ఆమె బదిలీ అయ్యేవరకు కొనసాగింది. అందుకని ఒక పని ముందర ప్రారంభమై, రెండో పని జరిగే వరకు కొనసాగిన పనిని had been + ing form లో తెలుపుతాం. ఇవన్నీ కూడా past tense forms. మరి కొన్ని వివరాలు వచ్చేవారం.

హాయ్ బుజ్జీ!!

హాయ్... నేస్తాలూ... బాగున్నారా... ప్చ్... 2017 ఇట్టే గడిచిపోయింది. హాయిగా ఆడుతూ పాడుతూ ఆనందంగా గడిపేశాం. సంవత్సరమంతా బోలెడు సంఘటనలు జరిగాయి. అందులో కొన్ని మనల్ని సంతోషపెడితే.. కొన్ని ఏడిపించేశాయి... మరికొన్ని మన ముఖాల్లో నవ్వులు పూయించి అలరించాయి. ఆశ్చర్యపరిచి... ఆటాడించి, మాయ చేసి... ఊరించి ఊరడించాయి ఇంకొన్ని. సరదాగా వీటికి అవార్డులు ప్రకటించేద్దామా... కొత్త ఏడాదిలో అడుగుపెట్టే ముందు... ఒక్కసారి మరొక్కసారి... ఆ ముచ్చట్లు గుర్తుకు చేసుకుందామా!

ఎన్నెన్నో గుర్తులు!



హాలీవుడ్ హీరో...

మెరిశాడు!

ఆడుతూ పాడుతూ ఆడుకునే వయసులోనే మన నేస్తం హాలీవుడ్‌లో హీరో అయిపోయాడు. ఈ ఏడాది మెరిసిన చిన్నారిగా నిలిచాడు. ఎందుకంటే తను ఇంగ్లిష్ సినిమాలో పెద్ద పాత్రనే దక్కించుకున్నాడు. అవునూ! ఈ అబ్బాయి పేరు రోనీ ఆకురాతి. వీళ్ల సొంతూరు పశ్చిమ గోదావరి జిల్లాలోని తాడేపల్లిగూడెం. అయితే వీళ్ల అమ్మా నాన్నాలతో కలిసి అమెరికాలోని ఇల్లినాయిస్‌లో ఉంటాడు. నటన మీద తనకున్న ఆసక్తిని గ్రహించిన వాళ్ల అమ్మ రోనీని యాక్టింగ్ స్కూల్లో చేర్చారు. అక్కడే తను నటన పాఠాలు నేర్చుకున్నాడు. చివరికి 'గ్రోయింగ్ అప్ స్మిత్' సినిమాలో హీరోగా నటించే అవకాశాన్ని దక్కించుకున్నాడు. అదీ అంత తేలికగా ఏం రాలేదు. ఆ పాత్ర కోసం వెయ్యి మందికి పైగా పిల్లలు పోటీపడ్డారు. అందరికంటే రోనీ హావభావాలు దర్శకుడికి బాగా నచ్చడంతో చిత్రంలో నటించే అవకాశం వచ్చింది.

జీవి కొంచెం... ఆయువు ఘనం!



ఆశ్చర్యపరిచింది!

శాస్త్రవేత్తలు ఎప్పుడూ పరిశోధనలు చేసి కొత్త కొత్త సంగతులు బయటపెడుతుంటారుగా. అలా ఈ ఏడాది ఓ ఆసక్తికరమైన విషయం తెలుసుకున్నారు. అదేంటంటే... సముద్రపు లోతుల్లో ఉండే ట్యూబ్ వార్మ్ అనే జీవుల్లో ఒకటైన 'ఎస్కర్పియా లామినటా' గురించి. దేహమంతా గొట్టాల్లా ఉండే ఈ జీవి ఏకంగా 300 ఏళ్ల కన్నా ఎక్కువే జీవిస్తుందట. అందుకే ఇప్పుడున్న జీవరాశులన్నింటిలో అత్యధికంగా బతికే ప్రాణి ఇదే కావచ్చని అనుకుంటున్నారు పరిశోధకులు. ఎక్కువగా గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రం లోపల ఉండే ఈ జీవి ఆకారం చిన్నది, దానికి తోడు లోతుల్లో ఉండటం వల్ల ఇప్పటి వరకు దీని గురించి తెలియలేదట. ఏది ఏమైనా భలే జీవి కదూ!



కొత్త కొత్త చాక్లెట్!



ఊరించింది!

చాక్లెట్... ఈ పేరు వింటేనే నోరూరిపోతుంది. అయితే ఇప్పటి వరకు వీటిల్లో డార్క్, మిల్క్, వైట్ చాక్లెట్లే మనకు తెలుసు. కానీ ఈ ఏడాదిలో కొత్త రంగు కొత్త రుచితో ఓ చాక్లెట్ వచ్చి వాటి పక్కన చేరిపోయింది. పేరు రూబీ చాక్లెట్. ఎరుపు గులాబీ రంగులు కల గలిపి ఉంటుంది. ఇప్పటికే తినే ఉంటారుగా. 'అదేంటీ? చిన్న చిన్న చాక్లెట్ బిళ్లలు చాలా రంగుల్లోనే ఉంటాయే మరి దీని ప్రత్యేకత ఏంటో' అనే సందేహం వచ్చిందా? అసలు విషయం ఏమంటే.. వాటన్నింటిలో కృత్రిమ రంగులు కలుపుతారు. కానీ డార్క్, మిల్క్, వైట్, రూబీ చాక్లెట్ రంగులు మాత్రం సహజసిద్ధమైనవి. ఎలాంటి రంగులు కలపకుండా తయారుచేసినవన్నమాట. రూబీ కోకో బీన్స్‌తో తయారు చేశారీ రూబీ చాక్లెట్‌ని. తెలుపు రంగు చాక్లెట్ బార్ మార్కెట్లోకి వచ్చాక అంటే దాదాపు 80 సంవత్సరాల తర్వాత మొదటిసారిగా చాక్లెట్లలో కొత్తరంగు వచ్చింది ఈ ఏడాదిలోనే.

గిరగిరా తిప్పేసింది!



ఆటాడించింది!

ఈ ఏడాదిలో పిల్లల దగ్గర్నించి పెద్దల వరకు ఎవరి చేతిలో చూసినా ఆ వస్తువే ఎక్కువగా కనిపించింది. అందరితో తెగ ఆడేసుకుంది.. ఆటాడించింది. అదేనండి... ఫిడ్జెట్ స్పిన్నర్. మీరూ కొనే ఉంటారుగా! 2017 మార్కెట్లోకి వచ్చిన బొమ్మలన్నింటిలో మొదటిస్థానం దీనిదే. ఆన్‌లైన్ వెబ్‌సైట్లలోనూ ఎక్కువగా కొనుగోలైందీ ఇదే. ఈ బొమ్మతో ఎలా ఆడాలో చూపిస్తూ చేసిన వీడియోలను కోట్ల మంది వీక్షించారు. చేతిలో పట్టేంత పరిమాణంలో మూడు రెక్కలతో ఉండే ఈ చిన్న బొమ్మ పరికరం బేరింగుల సాయంతో బొంగరంలా తిరిగేస్తుంది. ఆట విడుపుకే కాకుండా ఈ బొమ్మ ఒత్తిడిని దూరం చేస్తుందని పేరు తెచ్చుకుంది. ఈ ఏడాదిలో ఆకట్టుకున్న ఈ స్పిన్నర్‌ని ఎప్పుడో 1993లోనే కనిపెట్టారు.

ఆకు కాదిది జీవి..

మాయ చేసింది!

ఈ ఏడాది శాస్త్రవేత్తలు గుర్తించిన ఓ రకం కీటకం అందరినీ మాయ చేసింది. ఎందుకంటే అదిఅచ్చం ఆకులాగే ఉంటుంది. ఈ జీవి కాట్యాడిడ్ పురుగుల జాతిలో కొత్తది. దాని శరీరం, కాళ్లు.. శరీరభాగాలన్నీ చిగురుటాకుల్లాగే ఉంటాయి. కనుమాయ చేసేలా ఉన్న ఇది శాస్త్రవేత్తల కళ్ల నుంచీ ఇప్పటి వరకూ తప్పించుకుంది. చివరికి ఈ ఏడాదిలో మాత్రం దొరికిపోయింది. మలేసియాలో బోర్నియోలో ఈ వింత పురుగును గుర్తించారు. ఆకులు అలముల మధ్యలో ఉన్న దీన్ని పరిశీలనగా చూస్తే తప్ప ఇది జీవన్న విషయం ఎవ్వరికీ తెలియదు. వీటిల్లో ఆడకీటకాలు ఇలా గులాబిరంగులో నిగనిగలాడుతూ ఉంటాయి. మగవి ఆకుపచ్చ రంగులో ఆకులాగే ఉంటాయి.



పే...ద్ద ఫెర్రిస్ వీల్!



కిక్కిచ్చింది!

మనకు రైడ్లంటే భలే సరదా. వాటిల్లో ఎక్కాలన్నా... వాటి కబుర్లు వినాలన్నా మనకెంతో ఇష్టం మరి. అందుకే ప్రపంచంలో వింతైన భారీ రైడ్లు ఏర్పాటు చేస్తే ఆ సంగతులు వెంటనే చెప్పేసుకుంటాం. అలా ఈ ఏడాదిలో కొత్తగా వచ్చింది ఓ ఫెర్రిస్ వీల్. చైనాలోని వీఫాంగ్ నగరంలో ఏర్పాటు చేశారు దీన్ని. పెద్ద చక్రంలా ఉండి గుండ్రంగా రయ్యి రయ్యిమని తిప్పేసే ఫెర్రిస్ వీల్ తెలుసుగా. వాటిల్లోనే భిన్నమైందిది. ఆ ప్రత్యేకత ఏమిటంటే... చక్రం మధ్యలో చువ్వలు లేని ఏకైక ఫెర్రిస్ వీల్. పైగా ప్రపంచంలోని ఎత్తయిన వీల్స్‌లో ఒకటైన 'లండన్ ఐ' కన్నా ఇదే పెద్దది. 1,771 అడుగుల ఎత్తులో ఉన్న బైలాంగ్ రివర్ బ్రిడ్జ్‌పై కట్టిన ఈ జెయింట్ వీల్ ఎత్తు ఏకంగా 476 అడుగులు. మొత్తం 36 గదులతో భారీ ఉంగరంలా అందర్నీ ఆకర్షించింది. గిరగిరా తిరిగేస్తూ ఎక్కిన వారికి గుండె జారిపోయినట్టు గమ్మత్తయిన అనుభూతినిస్తోంది. తెగ ఆకట్టుకుంది.



అలరించింది!

ఎమోజీల సందడి..

ఈ ఏడాది వచ్చిన, పిల్లలకు ఎక్కువగా నచ్చిన.. యానిమేషన్ సినిమా 'ది ఎమోజీ'. ఫోను, మేసేజింగ్ యాప్‌ల్లో మనం ఎక్కువగా ఎమోజీల్ని వాడేస్తుంటాం. వాటికే నోరుంటే అవి మాట్లేడేస్తే ఎలాగుంటుంది? అదే ఈ సినిమాలో చూడొచ్చు. దీనిలో హీరో ఎమోజీ జీన్. తోటి ఎమోజీలన్నీ ఒక్కొక్క హావభావాన్నే పలికిస్తే తాను మాత్రం చాలా రకాల హావ భావాల్ని పలికిస్తుంది. అయితే అదే తన గొప్పదనం అని గుర్తించకుండా పక్కవాటిలా మారాలనుకుంటుంది. అందుకు కోడ్ కనిపెట్టడం, చివరికి తనలా ఉండటమే ప్రత్యేకత అని తెలుసుకోవడం కథ. అయితే ఎమోజీ బొమ్మలు మాట్లాడుకోవడం, వాటి హావభావాలు, వేషధారణ... చూస్తుంటే అన్నీ భలే గమ్మత్తుగా అనిపిస్తాయి. అందుకే ప్రపంచ దేశాలన్నీ ఈ సినిమాని ఆసక్తిగా చూశాయి. సోనీ పిక్చర్స్ తీసిన ఈ సినిమాలో వేషధారణలు తమాషాగా ఉన్నాయి. అలాంటివి ధరించి కొంత మంది వీధుల్లో ఒక్కచోట చేరారు. గిన్నిస్ రికార్డు కొట్టారు.

ఎంత పనిచేసింది!



భయపెట్టింది!

ఈ ఏడాది కంప్యూటర్లు, ఫోన్లలో పిల్లల్ని భయభ్రాంతులకు గురిచేసిన గేమ్ బ్లూవేల్. బ్లూవేల్ ఛాలెంజ్ పేరుతో ఇది ఆటగాళ్లను ఆత్మహత్య చేసుకునేటట్లు ప్రేరేపించి వారి జీవితాల్ని బలితీసుకుంటుంది. నిజానికి ఈ బ్లూవేల్ డౌన్‌లోడ్ చేసుకుని ఆడే ఆట కాదు. సాఫ్ట్‌వేర్ కూడా కానే కాదు. ఇంటర్నెట్‌కు ఆకర్షితులైన పిల్లలకు ప్రత్యేక స్నేహితులుగా పరిచయం చేసుకుని రహస్యంగా ఆన్‌లైన్ ఛాలెంజ్‌లు ఇస్తుంది. బ్లేడుతో చేతిపై చిత్రాలు గీసుకోవడం లాంటి హింసతో కూడిన టాస్క్‌లతో ప్రాణాలు తీసేస్తుంది. ఈ ఏడాదే వచ్చిన ఈ ఆట కొంత మంది ప్రాణం తీసి వారి ఇంట్లో వారికి తీరని వేదనను మిగిల్చింది. తల్లిదండ్రుల్ని ఎక్కువ కలవర పెట్టిన ఈ గేమ్ ఈ ఏడాది మనల్ని చాలానే భయపెట్టేసింది. ఈ ఆటను నిషేధించే స్థాయికి తీసుకెళ్లింది.

రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (టీఎస్) నిర్వహించే రెండు తెలుగు రాష్ట్రాల శిక్షణ తరగతులను మాదిగ సభ్యులు విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాశి సతీష్‌కుమార్ కోరారు. ఇందుకు సంబంధించిన ప్రచార గోడ ప్రతులను శనివారం మంచిర్యాలలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డప్పు, చెప్పు వృత్తిదారులకు ప్రభుత్వ పింఛన్, ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరారు. మాదిగ సభ్యులను సంఘటిత పర్చడానికి జనవరి 6, 7 తేదీల్లో నల్గొండ జిల్లా నాగార్జున సాగర్‌లో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని మాదిగ సభ్యులు అందరూ అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు బెక్కం రాజరాం, వడ్లూరి రవి, దాసరి విజయసాగర్, తుంగపడి శంకర్, బిదునూరి శంకర్, శ్రీపెల్లి సందీప్, ఎల్కపల్లి పవన్, న్యాతరి నర్సయ్య, కుష్నపల్లి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ శిక్షణ తరగతుల ప్రచార గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ (టీఎస్) నాయకులు

'ట్రిపుల్ తలాక్ మతపరమైన అంశం కాదు'

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: ట్రిపుల్ తలాక్ మతపరమైన అంశంకాదని, మహిళల లింగవివక్షతను చాటే విషయమని కృష్ణ, గోదావరి జలాల కమిటీ రాష్ట్ర కన్వీనర్ రావుల రాంనాథ్ ప్రకటనలో అన్నారు. ట్రిపుల్ తలాక్‌ను నియంత్రించడానికి కేంద్రం చట్టం తీసుకురావటం అభినందనీయమన్నారు. దీనివల్ల ముస్లిం మహిళలకు న్యాయం జరుగుతుందన్నారు. ట్రిపుల్ తలాక్ పేరిట కొంతమంది చిన్నచిన్న కారణాలతోనే ముస్లిం మహిళలను ఇబ్బందులకు గురిచేశారని గుర్తుచేశారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45 ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: 2018 సంవత్సరం జయప్రదం కావాలంటే..., లక్ష్మీదేవి అనుగ్రహం కోసం సంప్రదాయరీత్యా 2018ని ఎలా స్వాగతించాలి?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: పాడుతా తీయగా (రిపీట్), 10-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్యకావ్యం) 11-00: జబర్దస్త్ (కామెడీ షో రిపీట్).

మధ్యాహ్నం

12-00: జబర్దస్త్ జల్సా టైం (రిపీట్) 12-30: ఢీ-10 (సుప్రీం డాన్స్ షో) (రిపీట్), 2-00: సండే సూపర్‌హిట్ సినిమా: సామాన్యుడు (జగపతిబాబు).

సాయంత్రం

04-30: పుష్పకవిమానం (ప్రఖ్యాత దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు సినీ ప్రయాణం...) కమల్‌హాసన్, రేవతి, ఊర్వశి నటించిన 'ఆడవాళ్ళకు మాత్రమే' - చిత్ర విశేషాలు, 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 6-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సా టైం (రిపీట్), 07-00: స్వరాభిషేకం: సుమధుర స్వరకర్తలు అందించిన అపురూప గీతాలతో...

రాత్రి

09-00: ఈటీవీ న్యూస్, 9-30: ఇట్స్ టైమ్ టు పార్టీ 2018 (గ్రాండ్ ఈవెంట్) న్యూఇయర్ స్పెషల్ నవ్వుల నజరానా...

ఈటీవీ ప్లస్

మధ్యాహ్నం

11:00 పోవే..పోరా రిపీట్

12:00 ఎక్స్‌ప్రెస్ రాజా బ్యాండ్ బాజా

01:00 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్ రిపీట్

02:00 పటాస్ పంచెస్ రిపీట్

03:00 క్రాక్ కిడ్స్ రిపీట్

సాయంత్రం

04:00 పటాస్ రిపీట్

05:00 సండే కామెడీ మూవీ.. 'శ్రీ కనక మహాలక్ష్మి రికార్డింగ్ డాన్స్ ట్రూప్'

రాత్రి

07:30 పటాస్ పంచెస్ రిపీట్

08:30 ఎక్స్‌ట్రా జబర్దస్త్ రిమిక్స్

09:30 నా షో నా ఇష్టం రిపీట్

10:30 సినిమా చూపిస్త మావ రిపీట్

11:30 పటాస్ రిపీట్

ఈటీవీ లైఫ్

★ సద్గురు సన్నిధిలో (ఉ. 6:00)

★ మానస (ఉ. 6:30, 7:00, 10:00, 10:30, 11:00)

★ సైజ్ జీరో (ఉ. 7:30)

★ అమృతం (ఉ. 8:00, మ. 12:00, 1:00, సా. 6:00, రా. 8:00)

★ హెల్దీ & టేస్టీ (ఉ. 8:30, మ. 12:30, 1:30, సా. 6:30, రా. 08:30)

★ ఆరోగ్యమస్తు (ఉ. 9:00, మ. 2:00, రా. 7:00, 9:00, 10:00)

★ డా. ఈటీవీ (ఉ. 9:30, మ. 2:30, 3:30, రా. 7:30, 9:30, 10:30)

★ అందరికి ఆరోగ్యం (మ. 3:00)

★ అమృతం చిరుధాన్యాలు స్పెషల్ (రా. 11:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మధురానగరిలో (శ్రీకాంత్, నిరోషా) 10-00: మార్నింగ్ షో: బ్రహ్మచారి (ఏఎన్నార్) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: మగ మహారాజు (చిరంజీవి) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: రాజ్‌కుమార్ (శోభన్‌బాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: నర్తనశాల (ఎన్టీఆర్, సావిత్రి) 10-00: సూపర్‌మస్తీ: వండర్‌ఫుల్ ఈవెంట్.

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఆకుకూర చిరుధాన్యాల పూరీ & బుల్గుర గోధుమ బెర్రీ క్రేప్స్, ఉ.8:30 వావ్ ఏమి రుచి - బొహెమియన్ సాస్ & ఆనియన్ రింగ్స్, ఉ.9.30: గోరు ముద్దలు - సూజీ & బ్రెడ్ పిజ్జా, ఉ.9.45: మమ్మీస్ కిచెన్ - కోకోనట్ కాజు మైసూర్ పాక్, ఉ.11.00: బాబాయ్ హోటల్ - తెలగపిండి ఎండు రొయ్యలు కూర & రొయ్యల కారం, ఉ.11.30: షాహీ దక్కని - తుటక్ & తల్వా మూర్గ్, మ.12.00, రా.8.30: సూపర్ భీమ్ - గేమ్ షో, మ.1.00, సా.5.30: అతిథి - మీ ఇంటింటి నేస్తం (న్యూ ఇయర్ స్పెషల్స్), మ.1.30, రా.10.30: ఆహారవీధిలో - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.2.00: చోటా షెఫ్ - పొటాటో వీల్స్, మ.2.15: పిండివంటలు, ప్రసాదాలు - పుట్నాలపిండి పాపిడి & స్వీట్ ఊతప్పం, మ.2.45: పదండి విందుకు - ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.3.15: టేస్ట్ ఆఫ్ ఇండియా (పంజాబీ క్యూసైన్) - మఖనీ ఔర్ పన్నీర్ మఖ్‌మలీ, సా.3.30: కారాలు, పొడులు - మెంతి గసాల కారం పొడి & మెంతి రోటి పొడి, సా.4.30: షాహీ దక్కని - తుటక్ & తల్వా మూర్గ్, రా.7.30: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - ఖీమ సమోసా, రా.7.45: డైట్ మెనూ - మష్రూమ్ ఆమ్లెట్, రా.8.00: బ్రేక్ ఫాస్ట్ షో - కోడిగుడ్డు శెనగల చాట్ & గోధుమగడ్డి బాదం పాన్‌కేక్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 °, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: కొత్త ఏడాది సరికొత్తగా..., 01-00 ఈటీవీ 360 °, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: వైద్యరంగం@2017, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30: తీర్థయాత్ర: శ్రీ మహాగణపతి దేవస్థానం, కల్పతి అగ్రహారం, పాలక్కడ్, కేరళ, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360°, 09-00: మార్గదర్శి: హేమమాలిని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ (రి), 09 -00 ఘంటారావం, 09-30 కమర్షియల్ స్లాట్, 10-00 ఘంటారావం, 10-30 లక్ష్యం, 11-00 ఘంటారావం, 11-30 తెలుగు వెలుగు, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30: నారీ భేరి: కొత్త ఏడాది సరికొత్తగా..., 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30: తీర్థయాత్ర, శ్రీ నందీశ్వరస్వామి దేవస్థానం, రాయచూర్, కర్ణాటక, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: వైద్యరంగం@2017, 05-00 ఘంటారావం, 05-30 ఔరా!, 06-00 ఘంటారావం, 06-30 శ్రీనిలయం, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి!, 08-00 ఈటీవీ 360°, 09-00: మార్గదర్శి: హేమమాలిని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి!.

ఏ ఛానల్లో ఏముంది.. 31-12-2017

ఉదయం: 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణుసహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు సమాహారం, 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - సూర్యభగవాన్, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు కన్నడ, 10-30 భగవద్గీత - బాలవికాసం, 11-00 వేదసూక్తం, 11-30 స్పెషల్ న్యూస్ - ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 నరసింహ దివ్యక్షేత్రాలు, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్రనామామృతం, 02-00 సినిమా, **సాయంత్రం:** 04-30 విలువలు - విజ్ఞానం, 05-00 లైవ్ ఎస్.డి సేవ + స్పెషల్ న్యూస్ + లక్ష్మీగద్యం, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + భవయామి రఘురామం, 08-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, 09-30 అద్భుత ఆలయాలు - మురుడేశ్వర్ ఆలయం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 లైవ్ నామసంకీర్తనం.

ఉదయం: 06-00 శ్రీగణేశ సహస్రం, 6-30 శ్రీ లక్ష్మీసహస్రం, 7-00 అర్చన, 7-30 శ్రీ కనకధారస్తోత్రం, 8-00 పుణ్యక్షేత్రం, 9-00 వారఫలం, 10-00 వైకుంఠవైభవం, 11-00 ధర్మసందేహాలు, 11-30 వేదం.. జీవననాదం, 04-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనక ధారస్తోత్రం, 5-30 శ్రీగణేశసహస్రం, 06-00 శ్రీ లక్ష్మీసహస్రం, 7-00 భక్తివిశేషాలు 7-30 అదృష్టం-2018, 8-30 వైకుంఠవైభవం, 9-00 వారఫలం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తి విశేషాలు 11-00 స్వాగతం-2018 (లైవ్).

ఉదయం: 06-30 టెలీషాపింగ్, 07-00 జీటియమ్- టెలీషాపింగ్, 07-30 ఓం కారం, 08-00 డా. సుభాష్ చంద్ర షో, 10-00 సినిమా: సుప్రీమ్, 9-00 జీ గోల్డెన్ అవార్డ్స్ 2017, **మధ్యాహ్నం:** 01-00 సినిమా: రారండోయ్ వేడుక చూద్దాం, 04-00 జీ గోల్డెన్ అవార్డ్స్ 2017 , **సాయంత్రం:** 06-00 సినిమా: శ్రీమంతుడు, **రాత్రి:** 09-00 కొంచెం టచ్‌లో ఉంటే చెప్తా, 10-00 గోల్డ్‌రష్ (రిపీట్), 11-00 పోలీస్ డైరీ.

ఉదయం: 06-30 మ్యూజిక్ బాక్స్, 07-00 ఫిల్మ్ బేస్డ్, 07-30 విహారి, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 09-00 సినిమా: సింగం–3, **మధ్యాహ్నం:** 12-30 సినిమా: జనతా గ్యారేజ్, 04-00 సినిమా: మన్యం పులి, **సాయంత్రం:** 07-00 సినిమా: ఫిదా, 10-00 సాహో రే 2018.

ఉదయం: 06-30 టెలీషాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 స్పెషల్ ప్రోగ్రామ్, 08-30 సినిమా: కిట్టు ఉన్నాడు జాగ్రత్త, **మధ్యాహ్నం:** 11-20 సినిమా: అల్లుడు శీను, 02-25 సినిమా: టెంపర్, **సాయంత్రం:** 05-30 సినిమా: పైసా వసూల్, **రాత్రి:** 08-30 ఫిదా: మీ ఫేవరేట్ స్టార్‌తో..., 09-30 బ్లాక్ బాస్టర్, 10-30 హ్యాపీ హ్యాపీ 2018.

ఉదయం: 06-14 స్టార్ ట్రెక్, 08-19 బీతోవెన్, 09-57 ది డిక్టేటర్, 11-23 ఐరన్‌మ్యాన్, మధ్యాహ్నం: 01-36 ది హ్యాంగ్ ఓవర్ పార్ట్ 2, 03-19 మడ్‌గాస్కర్: ఎస్కేప్ 2 ఆఫ్రికా, సాయంత్రం: 04-58 ది డార్క్‌నైట్ రైజెస్, రాత్రి: 08-00 ట్రాన్స్‌ఫార్మర్స్ : రివెంజ్ ఆఫ్ ది ఫాలెన్, 10-43 జి.ఐ.జో :రిటాలియేషన్.

ఉదయం: 06-16 పెర్సీ జాక్సన్: సీ ఆఫ్ మాన్‌స్టర్స్, 08-23 ది అడ్వెంచర్స్ ఆఫ్ టిన్‌టిన్, 10-30 జుమాంజి, **మధ్యాహ్నం:** 12-40 జూటోపియా, 02-46 ట్రోల్స్, **సాయంత్రం:** 04-34 ఇండిపెండెన్స్‌డే :రిసర్జెన్స్, **రాత్రి:** 07-06 కుంగ్ ఫూ పాండా 3, 09-00 రోగ్ వన్: ఎ స్టార్ వార్స్ స్టోరీ, 11-48 ఛాపి.

ఉదయం: 06-00 ది గార్డియన్, 07-50 2012, 11-15 ది షాలోస్, మధ్యాహ్నం: 01-00 ది మమ్మీ రిటర్న్స్, 03-51 బిగ్ హీరో 6, సాయంత్రం: 06-03 ది కరాటే కిడ్, రాత్రి: 09-14 లూసి, 11-00 హిట్స్.

ఉదయం: 05-30 లిటిల్ కృష్ణా 3: ది వండరస్ ఫీట్స్, 07-30 సింగం రిటర్న్స్, 10-35 సర్దార్‌జీ 2, మధ్యాహ్నం: 01-35 హౌజ్‌ఫుల్ 2, సాయంత్రం: 05-00 సన్ ఆఫ్ సర్దార్, రాత్రి: 07-55 సింగం, 11-00 బజరంగీ బాయ్‌జాన్.

అన్నదాతలో...

రేపు ఉదయం 6.30 గం.లకు.

1. రబీ వేరుశనగలో తిక్కా ఆకుమచ్చ తెగులు నివారణ
2. నాణ్యమైన బెల్లం తయారీ-అధిక బెల్లందిగుబడికి సూచనలు
3. పాలీహౌస్‌లో చామంతి సాగుతో లాభాలు పొందుతున్న రైతు దంపతులు

ఉచిత హెల్ప్‌లైన్ నెం.1800-425-4085కు ఉ.10-11 గం.ల మధ్య ఫోన్ చేయవచ్చు.

రైతేరాజు

టొమాటోలో నులిపురుగుల నివారణ: డైకోఫాల్ 2 మి.లీ. నీటికి కలిపి మొక్కలపై పిచికారి చేసుకోవాలి. నేల ద్వారా వ్యాపించే వ్యాధి కారకాలను నియంత్రించేందుకు.. నేలను ఒక నెల ముందు 37 శాతం ఫార్మాల్డిహైడ్‌తో సూక్ష్మజీవి రహితం (స్టెరిలైజేషన్) చేయాలి. మొజాయిక్ వైరస్ బారిన పడిన మొక్కలను వెంటనే పీకి కాల్చి వేయాలి.

జైకిసాన్ కార్యక్రమాన్ని www.youtube.com/etv2jaikisan ద్వారా కూడా వీక్షించవచ్చు.

వరినారు పెంపకంలో జాగ్రత్తలు



యాసంగి వరినారు పెంపకంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను కంపసాగర్ కేవీకే శాస్త్రవేత్త శంకర్ సూచించారు. యాసంగిలో నారుమడికి ప్రత్యేక శ్రద్ధ అవసరం. నారుమడిని 10-12 రోజుల వ్యవధిలో మూడు దఫాలుగా దమ్ముచేసి చదును చేసుకోవాలి. రెండు గుంటల నారుమడికి 2 క్వింటాళ్ల కోళ్ళ ఎరువు లేదా వర్మి కంపోస్ట్ వేసి కలియదున్నాలి. దీనివల్ల చలి వాతావరణంలో కూడా నారు ఎదుగుదల బాగా ఉంటుంది.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 3 గ్రా. కార్బండాజిమ్ కలిపి విత్తనశుద్ధి చేయాలి. తడి విత్తనానికి దంప నారుమడి అయితే లీటర్ నీటికి 1 గ్రా. కార్బండజిమ్ కలిపిన ద్రావణంలో విత్తనాలను 24 గంటలు నానబెట్టి ఒక రోజు మండె కట్టుకోవాలి. ఖరీఫ్‌లో పండించిన విత్తనాలను వెంటనే యాసంగిలో సాగు చేసే పక్షంలో, నిద్రావస్థను గమనించి విత్తుకోవాలి. నిద్రావస్థను తొలగించేందుకు లీటర్ నీటికి 6.6 మి.లీ. గాఢ నత్రికామ్లం కలిపిన ద్రావణంలో విత్తనాలను నానబెట్టాలి.

ఎరువుల యాజమాన్యం: రెండు గుంటల నారుమడికి 2 కిలోల నత్రజని చొప్పున.. కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12-14 రోజులకు వేయాలి. 2 కిలోల భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులు దమ్ములోనే వేయాలి.

రాత్రి వేళ్లలో ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా ఉన్నప్పుడు.. నార్లు ఎర్రబడుతుంటాయి. దీనిని అధిగమించేందుకు వరి నారు మళ్ల పక్కన కర్రలు పాతి, పాలిథీన్ షీట్ లేదా ప్లాస్టిక్ సంచులతో కుట్టిన పట్టాలను రాత్రి వేళ కప్పి, ఉదయాన్నే తీసేయాలి. చలి ఎక్కువగా ఉన్నప్పుడు నారుమడిలో రాత్రి వేళ నీరు నిండుగా ఉంచి, తెల్లవారుజామున తీసేసి కొత్త నీరు పెట్టాలి. యాసంగిలో కాండంతొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. కాబట్టి నారుదశ నుండి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నారు తీయడానికి వారం రోజుల ముందు రెండు గుంటల నారుమడికి (200 చ.మీ.) కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 800 గ్రాములు వేయాలి. ఈ చర్యల ద్వారా నారు చలి వాతావరణాన్ని తట్టుకొని, ఆరోగ్యంగా పెరిగి 25-30 రోజులలో, 3 ఆకులతో నాటు వేసే దశకు వస్తుంది. రబీలో జింక్ లోప లక్షణాలు కన్పిస్తే.. నివారణకు జింక్‌సల్ఫేట్ 2 గ్రా., లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, త్రిపురారం

వ్యవసాయ పరిజ్ఞానం- క్విజ్

1. కింది పోషక ధాతువుల్లో పంట మొక్కలు, పండ్ల వృక్షాలకు తప్పనిసరిగా వాడాల్సిన అవసరం లేని సూక్ష్మపోషకం?
ఎ) మాంగనీసు బి) బోరాన్
సి) సోడియం డి) సున్నం

2. ఖనిజాలు అనేవి ముఖ్యంగా?
ఎ) పంటల సాగుకు అవసరమైనవి
బి) పునరుత్పత్తి చేయలేనివి
సి) పరిశ్రమాభివృద్ధికి డి) ఏదీకాదు

3. భారతదేశంలో అత్యల్ప వర్షపాతం ఉన్న ప్రాంతం?
ఎ) దక్కను పీఠభూమి బి) జైసల్మేర్
సి) అనంతపురం డి) జోధ్‌పూర్

4) పొగమల్లె బెడద లేకుండా చేసేందుకు శాశ్వత నివారణ చర్య ఏది?
ఎ) వేసవి లోతు దుక్కులు చేసి 2, 3 సంవత్సరాలు పంటమార్పిడి చేయాలి
బి) లోతుదుక్కులు చేసి వంగ టొమాటోతో పంట మార్పిడి చేయాలి
సి) లోతు దుక్కులు చేయాలి
డి) పంట విరామం పాటించాలి

5. సూక్ష్మజీవులను ఉపయోగించి కాలుష్య కారకాలను నిర్మూలించే విధానాన్ని ఏమంటారు?
ఎ) బయో అక్యుమలేషన్ బి) బయోలాజికల్ కంట్రోల్ సి) బయోరెమిటేషన్
డి) బయోమ్యాగ్నిఫికేషన్

6. తెలంగాణ ప్రాంతంలో ఎక్సాలి పంటగా చెరకు నాటేందుకు అనువైన సమయం?
ఎ) ఆగస్టు నుండి సెప్టెంబరు బి) డిసెంబరు నుండి జనవరి సి) జనవరి నుండి మార్చి
డి) జూన్ మొదటి వారం నుండి జులై ఆఖరు

7. నువ్వు పంటకు అనువైన సమయం ఏది?
ఎ) వర్షాకాలం బి) మాఘీ పంటకాలం
సి) చలికాలం డి) వేసవికాలం

8. కర్బూజ సాగుకు నేల ఉదజని సూచిక ఎంతుండాలి?
ఎ) 5.5 కంటే తక్కువ బి) 6.0 నుండి 7.0 వరకు మిక్కిలి అనుకూలం సి) 8.5 కంటే ఎక్కువ
డి) 4.0 నుండి 5.0 వరకు మిక్కిలి అనుకూలం

9. అగాకర జాతి మొక్కల ప్రత్యుత్పత్తి ఎలా?
ఎ) విత్తనం ద్వారా బి) 5 కణుపులున్న కొమ్మల ద్వారా సి) దుంపల ద్వారా
డి) వీలును బట్టి అన్ని విధానాలలో

సమాధానాలు

1) సి 2) బి 3) బి 4) ఎ 5) సి
6) బి 7) డి 8) బి 9) డి

కూర్పు: గొంటుముక్కల రామయ్య



సీనియర్స్‌లో రన్నర్‌గా మిమ్స్ మంచిర్యాల జట్టు



సీనియర్స్‌లో విజేతగా నిలిచిన ఆర్జీయూకేటీ బాసర జట్టు



జూనియర్స్ రన్నర్స్ శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఇంద్రవెల్లి జట్టు

విజేతలుగా ఆర్జీయూకేటీ బాసర, ఎస్ఆర్ఆర్ మంచిర్యాల

- ముగిసిన జిల్లాస్థాయి 'ఈనాడు-ఛాంపియన్' క్రికెట్ పోటీలు
- ప్రణాళిక, కష్టపడే తత్వంతోనే అభివృద్ధి
- సాయి వైకుంఠ ట్రస్టు అధ్యక్షుడు డా.రవికిరణ్ యాదవ్

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా మైదానంలో నాలుగు రోజులుగా ఈనాడు, నారాయణ విద్యాసంస్థల సహకారంతో జరుగుతున్న స్ప్రైట్ ఈసీసీ 2017 కప్ క్రికెట్ పోటీలు శనివారం ముగిశాయి. ఎంతో ఉత్సాహంగా ఆడిన క్రీడాకారులు అభిమానులను అలరించారు. సీనియర్స్ విభాగంలో ఆర్జీయూకేటీ, జూనియర్స్ విభాగంలో ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల మంచిర్యాల జట్లు విజేతలుగా నిలిచి రీజినల్ పోటీలకు వెళ్లనున్నాయి. మిమ్స్ మంచిర్యాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఇంద్రవెల్లి జట్లు రన్నర్లుగా నిలిచాయి. విజేతలకు జిల్లా స్పాన్సర్ సాయి వైకుంఠ ట్రస్టు అధ్యక్షుడు డా.రవికిరణ్ యాదవ్, రీజనల్ స్పాన్సర్స్ సుధాకర్ పైప్స్ ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మహేష్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోరెడ్డి పార్థసారథి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దారట్ల జీవన్‌లు బహుమతులు అందజేశారు.



కప్‌లు, జ్ఞాపికలు

కష్టపడితేనే ఫలితం

ముగింపు ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన డా.రవికిరణ్ యాదవ్ మాట్లాడుతూ పక్కా ప్రణాళిక, కష్టపడే తత్వం, పోరాట పటిమ ఉన్నవారు ఏ రంగంలోనైనా విజయాలు సాధిస్తారని పేర్కొన్నారు. అలాంటి గుణాలను అలవర్చుకోవాలని ఆకాంక్షించారు. ఒకరోజులో ఎవరూ సచిన్ తెందూల్కర్ కాలేరని, ఆయన కష్టపడి 25 ఏళ్లు భారతానికి క్రికెట్ రంగంలో సేవలందించిన భారతరత్న అని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా శారీరక ధారుఢ్యంలో ముందుందని, ఈ గడ్డనుంచి ఎందరో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందన్నారు.



మాట్లాడుతున్న జిల్లా స్పాన్సర్ సాయి వైకుంఠ ట్రస్టు అధ్యక్షుడు డా.రవికిరణ్ యాదవ్, వేదికపై రీజనల్ స్పాన్సర్స్ సుధాకర్ పైపులు ఆదిలాబాద్ ఇన్‌ఛార్జి మహేష్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోరెడ్డి పార్థసారథి, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దారట్ల జీవన్

తిరుగులేని ఆర్జీయూకేటీ బాసర

సీనియర్స్‌లో జరిగిన తుదిపోరు పూర్తిగా ఏకపక్షంగా సాగింది. ఆర్జీయూకేటీ బాసర అన్నీ అంశాల్లో అధిపత్యాన్ని కొనసాగించి మిమ్స్ మంచిర్యాల జట్టుపై విజయఢంకా మోగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్జీయూకేటీ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 85 పరుగులు చేసింది. ఓపెనర్ శివప్రసాద్ ఒక్కడే 17 పరుగులు చేసి రాణించాడు. లక్ష్యఛేదనకు దిగిన మిమ్మ్ మంచిర్యాల జట్టు ఓవర్లు ముగిసేసరికి 7 వికెట్లకు 46 పరుగులు మాత్రమే చేసింది. శివసాయి, గౌస్‌పాషాలు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ఆర్జీయూకేటీ బాసర జట్టును గెలిపించారు.

ఉత్కంఠపోరులో ఎస్ఆర్ఆర్ మంచిర్యాల

ఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల మంచిర్యాల జట్టు శ్రీచైతన్య జూనియర్ కళాశాల ఇంద్రవెల్లి జట్ల మధ్య జరిగిన తుదిపోరు ఉత్కంఠంగా కొనసాగింది. గెలుపు ఇరుజట్ల మధ్య దోబుచులాడింది. చివరికి ఎస్ఆర్ఆర్ మంచిర్యాల జట్టు 9 పరుగుల తేడాతో విజయాన్ని సాధించింది. మొదటగా బ్యాటింగ్ చేసిన ఎస్ఆర్ఆర్ మంచిర్యాల జట్టు 10 ఓవర్లలో 84 పరుగులు చేయగా, శ్రీచైతన్య ఇంద్రవెల్లి 75 పరుగులు చేసి ఓడింది.

ఘనంగా బాజీరావ్ బాబా సప్తాహ వేడుకలు

భారీ సంఖ్యలో తరలివచ్చిన జనం

జైనథ్, న్యూస్‌టుడే: జైనథ్ మండలంలోని కంఠ గ్రామంలో శనివారం ఆధ్యాత్మిక గురువు బ్రహ్మనిష్ట సద్గురు బాజీరావ్ బాబా సప్తాహ ముగింపు వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. అలంకరించిన ఎడ్లబండిపై చిన్నారులను దేవతామూర్తులుగా దుస్తులు ధరించి బాబా పల్లకిలో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు చేశారు. బాబా పల్లకీకి మహిళలు మంగళ హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆధ్యాత్మిక గురువు బాజీరావ్ మహారాజ్ ప్రవచనాలను వక్తలు చదివి వినిపించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో నృత్యాలు చేస్తూ కోలాటమాడారు. భక్తులు భక్తి పారవశ్యంతో భజనలు చేస్తూ పాటలు పాడారు. కాలదహీహండీ నిర్వహించి, హరిపాట్ గావించారు. అనంతరం గ్రామస్థులు ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పాడి పంటలతో, సుఖశాంతులతో ప్రజలు ఉండాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆధ్యాత్మికత వైపు నడవాలని ఏళ్లుగా సప్తాహ నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. సర్పంచి వైద్య రమేష్, ఎంపీటీసీ సభ్యుడు రావుత్‌రాజు, బోయర్ ప్రదీప్, ఊషన్న, బాజీరావ్ భక్త బృందం, యూత్ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ప్రవచనాలు బోధిస్తున్న బాబా శిష్యులు



ఎడ్లబండిపై చిన్నారులను దేవతామూర్తులుగా ఊరేగిస్తున్న దృశ్యం

కువైట్‌లో ఘనంగా సాయి శత సమాధి ఉత్సవాలు

ప్రత్యేక పూజలు జరిపించిన జిల్లా అర్చకుడు

మంచిర్యాల సాంస్కృతికం, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీగడప ఉషాదేవి షిర్డి సాయిబాబా ఆలయ అర్చకుడు సాయిశ్రీనివాస్ కువైట్‌లో సాయినాథుని శత సమాధి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరిపించారు. మీనా అబ్దుల్లా కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో సాయిపూజ, భజనలు చేయిస్తూ అక్కడి భక్తులను ఆకట్టుకున్నారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా ఇక్కడ స్థిరపడ్డ తెలుగువారు అత్యంత వైభవోపేతంగా సాయినాథుని కార్యక్రమాలు నిర్వహించడం, పూజలు చేసేందుకు తనను ఆహ్వానించడం సంతోసంగా ఉందని 'న్యూస్‌టుడే'తో సాయిశ్రీనివాస్ తన ఆనందాన్ని పంచుకున్నారు. మరో వారం రోజులపాటు మరో రెండు దేశాల్లో సాయినాథుని భజన కార్యక్రమాలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి ప్రముఖ రచయిత జొన్నవిత్తుల ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



సాయినాథుడు, శివలింగానికి అభిషేకం చేస్తున్న జిల్లా అర్చకులు సాయిశ్రీనివాస్

ఎన్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్‌గా చంద్రమోహన్‌గౌడ్



ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే: కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలోని పలు కళాశాలల్లో జాతీయ సేవా పథకానికి(ఎన్ఎస్ఎస్) నేతృత్వం వహించేందుకు జిల్లా అధికారులను ప్రకటించారు. మంచిర్యాలజిల్లా కన్వీనర్‌గా స్థానిక వివేకావర్ధిని కళాశాల అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ అధికారి ఉదారి చంద్రమోహన్‌గౌడ్ ఎంపికయ్యారని కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ జ్యోతి వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ అయినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని పలు కళాశాల నిర్వాహకులు చంద్రమోహన్‌గౌడ్‌కు అభినందనలు తెలియజేశారు.

బెల్లంపల్లి

మద్యం తాగి వాహనాలు నడపవద్దు

కాసిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనాలు నడపవద్దని కాసిపేట ఎస్సై సతీష్ అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎవరికి ఇబ్బంది కలిగించకుండా సంబరాలు చేసుకోవాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీజెలకు అనుమతి లేదని, ఒక వేళ పెడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా వేడుకలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచించారు.

పశువులకు గాలికుంటు నివారణ శిబిరం

బెల్లంపల్లి గ్రామీణం: బెల్లంపల్లి మండలం పెద్దబూదలో శనివారం పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు మండల పశువైద్యురాలు సుజాత తెలిపారు. మండలవ్యాప్తంగా అన్నిగ్రామాల్లో శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. జనవరి 15వరకు శిబిరాలను నిర్వహిస్తామన్నారు. రైతులు, పశువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు


మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ సునీతారాణి, కమిషనర్ రాజు

బెల్లంపల్లి, న్యూస్‌టుడే: బెల్లంపల్లి పట్టణంలో వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని నిర్ణయించినట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ సునీతారాణి తెలిపారు. ఏజెండాలో చేర్చిన ఆరు అంశాలపై తీర్మానం చేసినట్లు తెలిపారు. వార్డుల్లో మురుగు కాల్వలు, మంచినీటి ఎద్దడి గురించి కౌన్సిలర్లు చర్చించారన్నారు. ఈవిషయాలను మరోసారి సమావేశం ఏర్పాటు చేసి తీర్చడానికి నిర్ణయించినట్లు తెలిపారు. అన్నీ వార్డుల్లోని బోర్లకు మోటార్లు బిగించడానికి నిధులను కేటాయించడాన్ని కొందరు కౌన్సిలర్లు విభేదించారని తెలిపారు. ఆయా వార్డుల్లో సిమెంట్ దారులు, డ్రైనేజీల నిర్మాణం చేయాలని కోరడంతో అందుకు సమ్మతి తెలిపామన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ జి.రాజు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రతి విద్యార్థి అందిపుచ్చుకోవాలని స్వేరోస్ రాష్ట్ర అధ్యక్షుడు కాంపల్లి ఊషన్న అన్నారు. శుక్రవారం రాత్రి బెల్లంపల్లి సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో డిజిటల్ తరగతి గదిని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ...వేగంగా మారుతున్న సాంకేతిక నైపుణ్యంపై పట్టు సాధించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన సామార్థ్యాన్ని గణనీయంగా పెంచుకోవచ్చన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు డిజిటల్ తరగతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఐనాల సైదులు, కాసిపేట ప్రిన్సిపల్ శ్రీనివాసులు, స్వేరోస్ జోనల్ అధ్యక్షుడు బన్న లక్ష్మణ్‌దాస్, టీజీపీయే రాష్ట్ర నాయకులు ప్రభు, సురేందర్, పాఠశాల పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడు రాసమల్ల రాజశేఖర్, ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్, కార్యదర్శి చంద్రయ్య, స్వేరోస్ కోశాధికారి తీగల శ్రీనివాస్,ఉపాధ్యాయులు రాజన్న, సురేష్, శ్రీనివాస్,రాందాస్‌లు పాల్గొన్నారు.

'కార్మికుల సేవలు మరువలేనివి'

బెల్లంపల్లి, న్యూస్‌టుడే: సుదీర్ఘకాలం సింగరేణిలో పనిచేసిన కార్మికుల సేవలను మరువలేమని బెల్లంపల్లి రిజీయన్ అన్వేషణ విభాగం ఏజీఎం కె.వి.సీతారామారావు అన్నారు. శనివారం అన్వేషణ విభాగంలో బోరింగ్ మజ్దూర్‌గా చేసి ఉద్యోగ విరమణ పొందిన ఇబ్రహీమ్‌ను సన్మానించి జ్ఞాపికను అందించారు. ఆయన మాట్లాడుతూ..కార్మికులు తమకు లభించిన సొమ్మును జాగ్రత్తగా వాడుకోవాలని కోరారు. ఇబ్రహిమ్ చేసిన సేవలనుకొనియాడారు. అధికారులు సాంబమూర్తి, ముకేష్, కార్యాలయం పర్యవేక్షకుడు పి.రాజమల్లు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

శాంతిఖని గనిలో:

శాంతిఖని గనిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందనున్న కార్మికులకు శనివారం గని ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అధికారులు, కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానంచేసి వీడ్కోలు పలికారు. గనిలో పనిచేసిన జి.లక్ష్మినారాయణ(సీనియర్‌మైనింగ్‌సర్దార్) పి.మల్లయ్య(సపోర్ట్‌మెన్), పి.పోశం(జనరల్‌మజ్దూర్)లను ఏజెంట్ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు ఘనంగా శాలువలతోసన్మానం చేసి జ్ఞాపికలను అందచేశారు. ఈ సందర్భంగా ఏజెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతు కార్మికులు ఇన్ని రోజులుగా సింగరేణిలో తమ సేవలను కొనసాగించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి సంతోష్‌రావు, డిప్యూటి మేనేజర్లు సుధీర్, రాజు, ఇంజినీర్ రమాప్రసాద్, నాయకులు డి.శ్రీనివాస్, అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎందుకీ నిర్లక్ష్యం..!

- పాత సీఐఎస్ఎఫ్ బ్యారక్స్ దుస్థితి
- శిథిలావస్థకు చేరిన సముదాయం

బెల్లంపల్లి, న్యూస్‌టుడే

అవసరానికి ఎంత వ్యయమైన నిర్మాణాలు చేసే సింగరేణి యాజమాన్యం అనంతరం వాటిని రక్షించడంలో నిర్లక్ష్యం చేస్తోంది. ఫలితంగా లక్షలు వెచ్చించిన అనేక విలువైన భవనాలు నిర్వహణ, తగిన రక్షణ లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇందుకు నిదర్శనంగా బెల్లంపల్లి పట్టణంలోని రెండో ఇంక్లయిన్‌బస్తీలో పాత గ్రాడ్యుయేట్స్ ట్రైనీ వసతిగృహం సముదాయాన్ని పేర్కొనవచ్చు. ఇక్కడ 40 ఏళ్ల క్రితం లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ సముదాయంలో కంపెనీ ఆస్తుల రక్షణకు వచ్చిన సిఐఎస్ఎఫ్ బలగాల బ్యారెక్స్‌గా మార్చారు. వారికి అవసరమైన అన్ని రకాల సౌకార్యాలను లక్షలు వెచ్చించి కల్పించారు. మారిన పరిస్థితుల నేపథ్యంలో సీఐఎస్ఎఫ్ బలగాలను ఇతర ప్రాంతాలకు తరలించడంతో ఇక్కడ ఉన్న సముదాయం రక్షణలేక నిర్లక్ష్యంగా వదిలేశారు. ఈ విలువైన బ్యారెక్స్ దుస్థితిపై న్యూస్‌టుడే కథనం..

శిథిలావస్థలో సముదాయం:

బెల్లంపల్లి పట్టణంలోని రెండో ఇంక్లయిన్‌బస్తీలో సీఐఎస్ఎఫ్ బ్యారక్స్‌లో బలగాలు ఖాళీ చేసి వెళ్లిన తరవాత కొన్ని నెలల పాటు రక్షణ ఏర్పాటు చేసిన అధికారులు అనంతరం చేతులెత్తేశారు. దీంతో ఇక్కడ ఉన్న ఈ సముదాయంలోని పరిసరాలన్నీ పిచ్చిమొక్కలతో, పెద్ద చెట్లతో నిండిపోయింది.


నిరుపయోగంగా భవనాలు

లక్షలు వెచ్చించి వేసిన సిమెంట్ దారులు నిరుపయోగమయ్యాయి. ఇక్కడే అధికారుల కోసం ఇనుప నిర్మాణంతో తయారు చేసిన సందర్శకుల గుడిసె నిరుపయోగంగా మారింది. విశాలమైన గదులన్నీ నిర్వహణలేక శిథిలమయ్యాయి. లోపల ఉన్న విలువైన తలుపులు, కిటికీలు, ఇతర సామగ్రిని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోతున్నారు. ఇప్పటికే దాదాపు అన్నీ కిటికీలు, తలుపులు దొంగలబారిన పడ్డాయి. ఈ సముదాయానికి తగిన రక్షణ ఏర్పాట్లు చేస్తే ఎంతో బాగుండేదని స్థానికులు అంటున్నారు. కార్మికులకు, వారి కుటుంబాలకు అవసరమైన కమ్యూనిటీ హాల్‌గా దీన్ని మార్చితే అందరికి సౌకర్యంగా ఉంటుందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ఈవిషయంలో సింగరేణి అధికారులు తగిన శ్రద్ధ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఇలా చేస్తే అందరికీ ఎంతో ఉపయోగం:

- ఈ సముదాయాన్ని తక్షణమే సింగరేణి స్వాధీనం చేసుకుని కమ్యూనిటీ హాల్‌గా మర్చాలి.
- విశాలమైన ఖాళీ స్థలం చుట్టు రక్షణ ఏర్పాట్లు చేయాలి.
- ఒక వేళ ఎవరైన ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు అద్దెకు అడిగితే కేటాయించాలి
- బెల్లంపల్లిలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అవసరాలకు కేటాయించాలి.



మాయమైన తలుపులు, కిటీకీలు


శిథిలమైపోతున్న సముదాయంలోని గదులు

ప్రోటోకాల్ పాటించకుండా అధికారుల ఇష్టారాజ్యం

తాండూరు: ఉపాధి హామీ పనుల తనిఖీ ప్రజావేదికలో అధికారులు ప్రజాప్రతినిధులకు సముచిత స్థానం కల్పించలేదని తాండూరు మండలప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక జడ్పీటీసీ సభ్యుడు సురేష్‌బాబు, ఎంపీటీసీ సభ్యులు దత్తుమూర్తి, శంకర్, చౌళ్ల సత్యనారాయణ, సర్పంచి మిట్ట వేణుగోపాల్ మాట్లాడుతూ.. ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులను ఆహ్వానించలేదని ఆరోపించారు. ప్రజాప్రతినిధులకు సముచిత స్థానం ఇవ్వకుండా, ప్రోటోకాల్ పాటించకుండా ప్రజావేదికలు నిర్వహించడం ఎవరి కోసమని ప్రశ్నించారు. ఈవిషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలి


మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

సీపీఎస్ విధానం రద్దుకు కార్యాచరణ

ప్రజావేదికపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

తాండూరు, న్యూస్‌టుడే: కంట్రిబ్యూటరీ పింఛను విధానం రద్దు కోసం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమ కార్యచరణ సిద్ధం చేస్తున్నట్టు ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రమేష్ తెలిపారు. భీమిని మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం తపస్ దైనందిని, కాలసూచిక ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఎన్నో కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని పేర్కొన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే విధంగా తపస్ కార్యచరణ సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి మహేశ్వర్‌రెడ్డి, సంఘం జిల్లా కార్యదర్శి తాటికొండ శ్రీధర్, మండల అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి టి.తిరుపతి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గోడ ప్రతులు విడుదల చేస్తున్న ఉపాధ్యాయులు

నాగరాజుకు సన్మానం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఝార్ఖండ్ రాష్ట్రంలోని ధన్‌బాద్‌లో నిర్వహించిన 48వ ఆలిండియా సింగరేణి రెస్క్యూ పోటీల్లో నాగరాజుకు సన్మానం చేశారు. సింగరేణి రెస్క్యూ బృందంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నాగరాజును సన్మానించారు. శాంతిఖని గనిలో నాగరాజు విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం హెచ్ఎమ్మెఎస్ ఆధ్వర్యంలో నాగరాజకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్మెఎస్ కార్యదర్శి అమునుల్లాఖాన్, సభ్యులు షేక్‌బాబా, కొట్టె రాజయ్య, బియ్యాల సత్తయ్యలు పాల్గొన్నారు.


సుప్రియను సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ప్రవీణ్

కరాటే పోటీల విజేతకు సన్మానం

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ 3వ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని సాధించిన జాడి సుప్రియను శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ సన్మానించారు. బెల్లంపల్లి మండలం చాకెపల్లి గ్రామానికి చెందిన జాడి సుప్రియ వచ్చే నెల 13, 14 తేదీల్లో కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. మారుమూల గ్రామానికి చెందిన సుప్రియ జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడం హర్షణీయమన్నారు. కోల్‌కతా వెళ్లడానికి ప్రవీణ్ రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సముద్రాల శ్రీనివాస్, నెల్లి రమేష్, భీమ శంకర్, దండబోయిన భాస్కర్, రమేష్‌లు పాల్గొన్నారు.

యాంత్రీకరణ పథకానికి 80 దరఖాస్తులు

నెన్నెల, న్యూస్‌టుడే: వ్యవసాయశాఖ యంత్రీకరణ పథకంలో భాగంగా నెన్నెల మండలానికి 80 ధరఖాస్తులు ఐదు కస్టమ్ హెర్ కేంద్రాలు (ట్రాక్టర్ల) కోసం మొత్తం 80 దరఖాస్తులు వచ్చినట్లు వ్యవసాయాధికారి వంశీకృష్ణ తెలిపారు. త్వరలో దరఖాస్తులను పరిశీలించి ఎంపిక కోసం ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు చెప్పారు. నిబంధనల ప్రకారం అర్హులైన రైతులకు రాయితీ ట్రాక్టర్లు అందించే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

బెల్లంపల్లి

పశువుల్లో టీకాలతోనే వ్యాధినిరోధక శక్తి

కాసిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పశువులకు గాలికుంటు టీకాలు వేయించడం ద్వారా వాటిలో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని మండల పశువైద్యాధికారి తిరుపతి అన్నారు. మండలంలోని సండ్రల్‌పహాడ్ గ్రామంలోని పశువులకు శనివారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మొత్తం 320 ఆవులకు 210 గేదెలకు ఈ టీకాలను వేసినట్లు పశు వైద్యాధికారి తెలిపారు.



ప్రభుత్వాసుపత్రికి మంచిరోజులు

రూ.38.69లక్షలతో మరమ్మతులు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే

బెల్లంపల్లి సీహెచ్‌సీ మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయి. ఆర్నెళ్ల క్రితం తెలంగాణ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (టీఎస్‌ఎంఐడీసీ) నిధులను మంజూరు చేసింది. బెల్లంపల్లి ఆసుపత్రి భవనం పాతది కావడంతో పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. దీనికి తక్షణ మరమ్మతులు అవసరమని గుర్తించి ప్రతిపాదనలు పంపారు. ఆ ప్రతిపాదనలకు అనుగుణంగా నిధులు వచ్చాయి. ఆసుపత్రి భవనం పైన కూడ పెచ్చులూడి వర్షాకాలంలో ఆసుపత్రి అంతా నీళ్లు చేరుతున్నాయి. భవనం పైన కూడ మరమ్మతులు చేయాల్సి ఉంది. గదులను మళ్లీ ఆధునీకరించాల్సి ఉంటుంది. బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రిలో కొనసాగుతున్న మరమ్మతుల తీరుపై న్యూస్‌టుడే అందిస్తున్న కథనం

ఆసుపత్రి మరమ్మతుల కోసం రూ.38.69లక్షలు ఆర్నెళ్ల క్రితం మంజూరయ్యాయి. అప్పటినుంచి పనులు కొన'సాగుతూనే' ఉన్నాయి. ఇందులో మహిళా ప్రసూతి ప్రత్యేక గదితో పాటు మరిన్ని గదులను మరమ్మతులు చేయడానికి రూ.8.69 లక్షలు వెచ్చించారు. ఈ మరమ్మతులు పూర్తయ్యాయి. అయితే మరో రూ.30లక్షల పనులు మాత్రం నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటికే పనులు పూర్తి కావాల్సి ఉన్న సదరు గుత్తేదారు పనులను వేగవంతం చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. మరమ్మతులు చేసిన గదులను మాత్రం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రారంభించారు. పనులు త్వరితగతిన చేయడంతో గుత్తేదారు శంకర్‌సింగ్‌ను అభినందించారు. మహిళా ప్రసూతి గదిని అత్యాధునికంగా తయారుచేశారు. గది కింద టైల్స్, వెలుతురు ఉండేలా లైట్లు, తదితర హంగులన్నీ ఏర్పాటు చేశారు. ఆసుపత్రి నిధులతో ఏసీలను కూడ ఏర్పాటు చేశారు. కార్పొరేట్ ఆసుపత్రి స్థాయిలో గదిని సిద్ధం చేశారు. ఇటుపక్క మొత్తం మహిళా విభాగాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ వైపున మూత్రశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

సిద్ధం కాని ఆపరేషన్ థియేటర్

ఆసుపత్రిలో రూ.30లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులు ముందుకుసాగడం లేదు. భవనం కింది భాగంలో అక్కడక్కడ మరమ్మతులు మాత్రమే చేసి పనులను మధ్యలోనే నిలిపివేశారు. ఇప్పటికే పనులు పూర్తి కావాల్సి ఉన్న పూర్తి కాలేదు. ఆపరేషన్ థియేటర్ ఇంకా పూర్తి కాలేదు. థియేటర్ పూర్తయితే చిన్నచిన్న శస్త్రచికిత్సలు చేసే అవకాశం ఉంది. తలుపులు, కిటికీల బిగింపు అలాగే ఉంది. భవనంపైన సైతం ఇంకా సిమెంట్ పూత పనులు అలాగే ఉన్నాయి. మూత్రశాలలు, మరుగుదొడ్లు పూర్తి చేయాల్సి ఉంది. ఏడాదికాలంగా బెల్లంపల్లి ఆసుపత్రికి రోగుల సంఖ్య పెరుగుతూ వస్తుంది. మరమ్మతులు పూర్తయి అన్ని సౌకర్యాల కల్పన జరిగితే రోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే బెల్లంపల్లి ప్రభుత్వాపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చుతామనే ప్రతిపాదనలు ఇంకా కొనసాగుతున్నాయి.

సౌకర్యాల కల్పనతో రోగులకు మేలు

బెల్లంపల్లి, తిర్యాణి, తాండూరు, రెబ్బెన, కాసిపేట, నెన్నెల, భీమిని మండలాల ప్రజలు నిత్యం ఆసుపత్రికి వస్తుంటారు. సౌకర్యాలను మెరుగుపర్చితే రోగుల సంఖ్య రెట్టింపయ్యే అవకాశాలున్నాయి. మరమ్మతులు ఎంత త్వరగా పూర్తయితే అంత త్వరగా వైద్యసౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. సమస్యలతో సతమతమవుతున్న బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చడానికి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో ఉపముఖ్యమంత్రి రాజయ్య వచ్చినప్పుడు హామీ కూడ ఇచ్చారు. వైద్యనిపుణులు వస్తే బెల్లంపల్లి ప్రజలు మంచిర్యాల ప్రభుత్వాసుపత్రితో పాటు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లే బాధలు తప్పుతాయి. బెల్లంపల్లి పట్టణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రులనే ఆశ్రయిస్తున్నారు. దీంతో వారి జేబులకు చిల్లుపడుతున్నాయి. ప్రస్తుతం మరమ్మతులు త్వరగా పూర్తయితే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశం ఉంది.



బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రి


అత్యాధునికంగా మరమ్మతులు చేసిన ప్రసూతి గది


పనులు పూర్తికాకపోవడంతో అస్తవ్యస్తంగా ఉన్న ఆపరేషన్ థియేటర్

భూముల వివరాలు ఇవ్వాలని వినతి

బెల్లంపల్లి, న్యూస్‌టుడే: బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ భూముల వివరాలు ఇవ్వాలని కోరుతు భాజపా నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. పట్టణంలోని పలు చోట్ల నిర్మాణాలు చేస్తున్నారని ఆభూముల వివరాలను అందించాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు సి.హెచ్.మనోహర్, నాయకులు కె.గోవర్ధన్, ఎం.శ్రీనివాస్, ఎస్.సాయికుమార్, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన కార్మికులకు సన్మానం

కాసిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మందమర్రి ఏరియాలోని కాసిపేటగనిపై పదవీ విరమణ పొందిన కార్మికులకు శనివారం అధికారులు, కార్మిక సంఘాలనాయకులు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా కార్మికులకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. పదవీ విరమణ పొందిన కార్మికుల్లో ముల్కాల చంద్రయ్య, జి.శంకర్, అజ్మీర రాజు, పాండ్రాల రాజయ్య, డోమరి నర్సయ్య, రాఘంశెట్టి శంకర్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సైదులు, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అబ్దుల్ హై

వీఓల నూతన కమిటీ ఎన్నిక

నెన్నెల, న్యూస్‌టుడే: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో పని చేస్తున్న గ్రామ సంఘాల వీఓఏల నూతన మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా తైదల సమ్మయ్య, గౌరవ అధ్యక్షుడిగా ఎల్క ఉశన్న, ఉపాధ్యక్షుడిగా దుర్గం మల్లేష్, కార్యదర్శిగా పాదం లక్ష్మణ్, సహాయ కార్యదర్శిగా బండి పోచమల్లు, కోశాధికారిగా సింగతి కవిత, సలహాదారునిగా జనార్ధన్, ప్రచార కార్యదర్శిగా సంతోష్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.



కాలసూచిక విడుదల చేస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

పీఆర్టీయూ కాలసూచిక విడుదల

తాండూరు, న్యూస్‌టుడే: పీఆర్టీయూ 2018 కాలసూచికను శనివారం తాండూరులో విడుదల చేశారు. తాండూరు ఎంఈవో ప్రభాకర్, తాండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీధర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరైన ఈకార్యక్రమంలో పీఆర్టీయూ మండల నాయకులు పాల్గొని కాలసూచికలు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేస్తూ విద్యావ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మొగిలయ్య, జయప్రద, కార్యదర్శులు ప్రదీప్, పోచయ్య, రాష్ట్ర కార్యదర్శులు భీంసేన్, రాజేంద్రకుమార్, మండల నాయకులు శిరీష, తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబా ఆలయంలో పూజలు

బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కన్నాలబస్తీ షిర్డిసాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంచిర్యాలకు చెందిన 25మంది అంధ విద్యార్థులకు ఏడాదికి సరిపడా నిత్యవసర సరకులు అందజేస్తానన్నారు. అంధ విద్యారులకు అవసరాల నిమిత్తం రూ.10వేలను సాయం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా అంధులకు సేవ చేసే అదృష్టం కలిగిందన్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పసుల సునీతారాణి, తెరాస పట్టణ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు స్వామిజీ, సలహాదారుడు వికాస్‌యాదవ్‌లు పాల్గొన్నారు.

బెల్లంపల్లి పట్టణం: పట్టణంలోని కన్నాలబస్తీ షిర్డీ సాయి బాబా ఆలయంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంచిర్యాలకు చెందిన 25మంది అంధ విద్యార్థులకు సాయిపరివార్ తరపున ఏడాదికి సరిపడా నిత్యావసర సరకులు అందజేశారు. ఎమ్మెల్యే అంధ విద్యారులకు అవసరాల నిమిత్తం రూ.10వేలను సాయం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా అంధులకు సేవ చేసే అదృష్టం కలిగిందన్నారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పసుల సునీతారాణి, తెరాస పట్టణ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు స్వామిజీ, సలహాదారుడు వికాస్‌యాదవ్‌లు పాల్గొన్నారు.


ప్రసూతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

ప్రసూతి గదిని ప్రారంభించిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి పట్టణం: బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రిలో రూ.8.69లక్షలతో మరమ్మతులు చేసిన ప్రసూతి గదిని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రారంభించారు. ఆసుపత్రిలో అన్ని హంగులతో ప్రసూతి గదితో పాటు ఇతర గదులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవల కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎస్.నర్సింగం, ఎంపీపీ పొట్లపల్లి సుభాష్‌రావు, ఆసుపత్రి సూపరెండెంట్ డాక్టర్ కోటేశ్వర్, డిప్యూటి డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయపూర్ణిమ, వైద్యులు కుమార్, రాము, నిర్మలాదేవి, సునీత, సాత్విక్, షబ్బీర్, సంజయ్, తెరాస పట్టణ అధ్యక్షుడు బొడ్డు నారాయణ, నాయకులు ఎం.చంద్రయ్య, జి.రాజలింగు, భీమాగౌడ్‌లు పాల్గొన్నారు.

రక్తనిధి కేంద్రంలో నిల్వలు

ఏసీసీ(మంచిర్యాల), న్యూస్‌టుడే: మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్తనిధి కేంద్రంలో నిల్వలు శనివారం వరకు ఎ పాజిటివ్ 10, ఎ నెగటివ్ 2, బి పాజిటివ్ 47, బి నెగటివ్ 1, ఏబీ పాజిటివ్ 4, ఏబీ నెగటివ్ 1, ఒ పాజిటివ్ 33, ఒ నెగటివ్ 8 అన్ని పరీక్షలు చేసి సిద్ధంగా ఉన్నాయి. రక్తం అవసరం ఉన్నవారు కేంద్రం స్థిరవాణి సంఖ్య(08736-259259, 252259)లను, లేదా రక్తనిధి కేంద్రం నిర్వాహకుడు డా.డి.విష్ణుమూర్తి చరవాణి(9492557337)ని సంప్రదించగలరు.

ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలి

కాసిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలని, ఇందుకు పాఠశాల కమిటీ సభ్యులు కృషి చేయాలని ఎంపీడీఓ అబ్దుల్ హై, మండల విద్యాధికారి దామోదర్ పేర్కొన్నారు. శనివారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పాఠశాల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మరుగుదొడ్ల నిర్మాణం కోసం ప్రతి పాఠశాలకు ఉపాధి హామీ నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బలరాం, ప్రధానోపాధ్యాయులు కృష్ణ భాస్కర్, లచ్చయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న పోలీసు అధికారులు

గిరిజనులకు దుప్పట్లు పంపిణీ

తాండూరు, న్యూస్‌టుడే: తాండూరు మండలం బోయపల్లిలో పోలీసులు గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. తాండూరు పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఏసీపీ రహెమాన్, తాండూరు సీఐ జనార్ధన్‌రెడ్డి, ఎస్సై రవి తదితరులు పాల్గొని గిరిజనులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గిరిజనులు వదంతులు నమ్మి ఉద్వేగాలకు లోను కావద్దని వారు సూచించారు. ఇటీవల చోటు చేసుకున్న గొడవలకు వదంతులు, పుకార్లతో పాటు కొంత మంది వ్యక్తుల మాటలే కారణమన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచి మిట్ట వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: నిన్నటి ధరలు:, కిలో రూపాయల్లో: టమాట 10, వంకాయ 20, మిర్చి 30, బెండకాయ 50, అల్చింత 30, దొండ 30, క్యాబేజీ 40, కాలిఫ్లవర్ 40, కాకర 40, బోడ కాకర 150, క్యారెట్ 60, బీర 80, గోరుచిక్కుడు 40, చిక్కుడు 50, సొరకాయ 15, పాలకూర 20, తోటకూర 25, చుక్కకూర 30, కోతిమీర్ 30, ఆలు 15, ఉల్లిగడ్డ 45.

8న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు

చెన్నూరు గ్రామీణం: మండలంలోని సుద్దాల గ్రామంలో జనవరి 8న తెరాస యూత్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కొటారి దేవేందర్, రామగిరి అంజిలు తెలిపారు. పోటీలలో పాల్గొనే క్రీడాకారులు జనవరి 7లోపు తమ జట్టు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పోటీలను ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. వివరాల కోసం 96405 28146, 99121 30800 చరవాణి సంఖ్యలను సంప్రదించాలని కోరారు.

ఏడాది కాలం.. 'మార్పు' ఘనం

★ అభివృద్ధి బాటలో నియోజకవర్గం

★ పలు కీలక పనులకు అంకురార్పణ

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే:

ఏడాది కాలంలో చెన్నూరు నియోజకవర్గంలో పలు చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు జరిగాయి. మౌలిక వసతుల కల్పన ఊపందుకుంది. ఎన్నో ఏళ్లుగా ఊరిస్తూ వచ్చిన పలు పనులు ఈసారి కార్యరూపం దాల్చాయి. వచ్చే ఏడాది ఇవి సాకారం కానున్నాయి. తీపి గుర్తులను మిగిలిస్తూ జ్ఞాపకంలా మారబోతున్న 2017లో నియోజకవర్గం సాధించిన అభివృద్ధిపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం

కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం ప్రజాభిప్రాయ సేకరణ

అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి కాళేశ్వరం నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆయా జిల్లాల పాలనాధికారులకు ప్రత్యేక అధికారాలు అప్పగించింది.



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న పాలనాధికారి

కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో భాగంగా నియోజకవర్గంలో నిర్మించాల్సిన అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు ఆగస్టు 26న జైపూర్ మండలంలో ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. ఈ సేకరణలో స్వల్ప వ్యతిరేకతలు మినహా ప్రజలు తమ అనుకూలత వ్యక్త పరచడంతో నిర్మాణాల పనులు ఊపందుకున్నాయి.

పురపాలికగా మారనున్న చెన్నూర్



నియోజకవర్గంలో మేజర్ పంచాయతీగా ఉన్న చెన్నూర్ పట్టణాన్ని పురపాలికగా మార్చాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో 18 మండలాలు ఉండగా ఒక్క చెన్నూర్ పట్టణాన్ని మాత్రమే బల్దియాగా మార్చేందుకు అధికారులు పరిగణనలోకి తీసుకున్నారు. పట్టణంలో 23 వేల జనాభా ఉండగా నిధులు సక్రమంగా మంజూరు కాకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. దీంతో ప్రజలు అనేక సమస్యలతో సహవాసం చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పురపాలిక ఏర్పాటు చేయాలని గతంలోనే అన్ని పార్టీల నాయకులు ఆందోళనలు నిర్వహించారు. ప్రభుత్వ నూతన నిర్ణయంతో చెన్నూరు పురపాలికగా ముఖచిత్రం మారనుంది.

నూతన వంతెనతో తీరిన కష్టాలు



చెన్నూర్ మండలం కత్తెరశాల వాగుపై వంతెన శిథిలావస్థకు చేరింది. చిన్నపాటి వర్షానికే వంతెనపై నుంచి వరదనీరు ప్రవహిస్తుండడంతో అంగ్రజ్‌పల్లి, అస్నాద్, సోమనపల్లి, నాగాపూర్, సుందరశాలతో పాటు మరో పది గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో గతేడాది ప్రభుత్వం రూ.3.5 కోట్లు మంజూరు చేసింది. దీంతో పనులు ప్రారంభించిన గుత్తేదారు నూతన వంతెన నిర్మాణాన్ని రెండు నెలల కిందట పూర్తి చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలకు రవాణ సులభతరం అయింది.

ఉత్తమ ప్రాథమిక ఆరోగ్యం



కోటపల్లిలో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రాన్ని 15 ఏళ్ల కిందట ఏర్పాటు చేశారు. మారుమూల మండలం కావడంతో వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉండేవి. ఈ క్రమంలో మంచిర్యాల జిల్లా ఏర్పాటుతో పాలనాధికారి.. కోటపల్లి ఆరోగ్య కేంద్రంపై ప్రత్యేక దృష్టిని సారించి పలుమార్లు తనిఖీ చేశారు. దీంతో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. ప్రస్తుతం అన్ని రకాల వైద్యసేవలు అందుతుండడంతో ఆసుపత్రికి వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో వైద్య సిబ్బంది ఉత్తమ పనితీరు కనబర్చడంతో ఈ ఏడాది జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రాంతీయ ఆసుపత్రిగా పురస్కారం అందుకుంది.

సరిహద్దులో మెరుగుపడనున్న రాకపోకలు



కోటపల్లి మండలానికి సరిహద్దు ఉన్న మహారాష్ట్రకు రాకపోకలు సాగించేందుకు మధ్యలో ఉన్న ప్రాణహిత వంతెనకు ఈ ఏడాది రూ.107.89 కోట్లతో వంతెన నిర్మాణాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. వంతెన లేకపోవడంతో ఇరుప్రాంతాల ప్రజలు నాటుపడవలపై రాకపోకలు సాగిస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో, 63వ జాతీయ రహదారి వినియోగంలోకి రానుంది. ఇరు ప్రాంతాల మధ్య వ్యాపార, వాణిజ్య, బంధుత్వ సంబంధాలు మెరుగుపడనున్నాయి.

బహిరంగ మల, మూత్ర రహిత పట్టణం మందమర్రి



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన బహిరంగ మల, మూత్ర రహిత పట్టణాల్లో మందమర్రి ఎంపిక కావడం ఈ ఏడాది నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ విజయం. పాలకవర్గం లేని స్థానిక బల్దియాలో మరుగుదొడ్ల నిర్మాణానికి రెండేళ్ల కిందట దరఖాస్తులు ఆహ్వానించగా 2,527 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. వీటిని పరిశీలించిన అధికారులు 1,912 మందిని లబ్ధిదారులుగా తేల్చారు. మరుగుదొడ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతుండడంతో అప్పటి పురపాలిక కమిషనర్ గంగాధర్ ప్రత్యేక చొరవ తీసుకుని వేగం పుంజుకోవడానికి చర్యలు చేపట్టారు. ఇందుకోసం స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గుత్తేదారుల సహకారంతో ఎనిమిది నెలల్లో నిర్మాణాలు పూర్తి చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వం వచ్చే నెలలో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేకు ఎంపిక చేసింది.


22 ఏళ్ల నిరీక్షణకు తెర



తెలంగాణ రాష్ట్రంలో పాలకవర్గం లేకుండా సాగుతున్న మూడింట్లో మందమర్రి బల్దియా ఒకటి. పురపాలికగా ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు ఎన్నికలు జరగకపోవడంతో ప్రజలు విసుగు చెందారు. ఏజెన్సీ వివాదం ఇక్కడి ప్రజలకు శాపంగా మారింది. నూతన రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మందమర్రికి వచ్చిన కేసీఆర్ పురపాలికకు ఎన్నికలు జరిపిస్తామని హామీ ఇవ్వడంతో ప్రజలు మూడేళ్ల పాటు కొండంత ఆశతో ఎదురుచూశారు. ఈ నేపథ్యంలో మందమర్రితో పాటు పాల్వంచ, మణుగూరు బల్దియాల్లో షెడ్యూల్డ్ ప్రాంతాలకు 1965 తెలంగాణ పురపాలిక చట్టాన్ని వర్తింపజేస్తూ జులైలో ప్రభుత్వం జీవో జారీ చేయడం ఎన్నికలు నిర్వహించడానికి మార్గం సుగమం అయింది. దీంతో మందమర్రి పురప్రజల 22 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు వచ్చే ఏడాది తెర పడనుంది.

అణిచివేతలకు గురవుతున్న నేతకాని కులస్థులు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: దశాబ్దాల తరబడి నేతకాని కులస్థులు అణిచివేతకు గురవుతున్నారని ఆ సంఘం నియోజకవర్గ ఇన్చార్జి రావుల తిరుపతి అన్నారు. గడపగడపకు నేతకాని సంఘం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని సుద్దాల గ్రామంలో నిర్వహించిన సమవేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో 65 వేల ఓటర్లు ఉన్నప్పటికీ రాజ్యాధికారానికి దూరంగా ఉన్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు నాయకులు నేతకానిలను ఓటు బ్యాంకుగానే వాడుకున్నారని ఆరోపించారు. అన్నిరంగాల్లో ప్రాధాన్యం కల్పించిన పార్టీలకే అండగా నిలుస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో నాయకులు కోట బాపు, దుర్గం నగేష్, దుర్గం సంతోష్, జనగామ శాంతివిక్రమ్, కొటారి దేవేందర్, పాగె శేఖర్, జాడి శ్రావణ్, గొదారి రమేష్, కొటారి వెంకటేష్‌లు పాల్గొన్నారు.


సమావేశంలో నేతకాని నియోజకవర్గ ఇన్చార్జి రావుల తిరుపతి

కృష్ణ సేవలు ప్రశంసనీయం

మందమర్రి ఏరియా జీఎం ఎం.రాఘవులు


కృష్ణ దంపతులను సన్మానిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, జీఎం రాఘవులు, నాయకులు

మందమర్రి, న్యూస్‌టుడే: మందమర్రి ఏరియా మానవ వనరుల విభాగంలో పర్సనల్ అసిస్టెంట్(పీఏ)గా తురగ కృష్ణ అందించిన సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, ఏరియా జీఎం ఎం.రాఘవులు అన్నారు. శనివారం మందమర్రిలోని ఇల్లందు క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఉద్యోగ విరమణ చేసిన కృష్ణ-సురేఖ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కృష్ణ 40 సంవత్సరాల పాటు జీఎం కార్యాలయంలో విధులు నిర్వహించి ఆదర్శంగా నిలిచారన్నారు. అనంతరం కృష్ణ దంపతులను సన్మానించి జ్ఞాపికను అందించారు. అనంతరం వివిధ కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా ఏస్వోటు జీఎం కె.వెంకటేశ్వర్లు, కె.కె-ఓసీపీ పీవో వి.రాంమూర్తి, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ

కోటపల్లి, న్యూస్‌టుడే: కోటపల్లి మండలం ఎర్రాయిపేట్ గ్రామానికి చెందిన మెట్‌పల్లి ఎల్లయ్య కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.26 వేల విలువైన చెక్కును శనివారం నాయకులు అందించారు. ఎల్లయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య చికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి కింద దరఖాస్తు చేసుకున్నారు. ఎమ్మెల్యే ఓదెలు, ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్‌లు ప్రత్యేక చొరవచూపి బాధితునికి వైద్యచికిత్సల నిమిత్తం ఆర్థిక సహాయం అందేలా చొరవచూపినట్లు తెరాస మండల పార్టీ అధ్యక్షులు బైస ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు మంజూరైన చెక్కును ఎల్లయ్య భార్య ముత్తక్కకు అందించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గట్టాగౌడ్, సాంబాగౌడ్, చెంద్రు తదితరులు పాల్గొన్నారు.

తపస్ కాలసూచీ విడుదల

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) 2018 సంవత్సరానికి సంబంధించిన కాలసూచికను శనివారం చెన్నూరులోని మండల విద్యావనరుల కేంద్రం(ఎమ్మార్సీ)లో మండల విద్యాధికారి కొమ్మెర రాధాకృష్ణమూర్తి విడుదల చేశారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి రత్న లక్ష్మినారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగుపరచాలని సూచించారు. ఉదయం విద్యార్థులకు అల్పాహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు సంక్షేమం, హక్కుల కోసం తపస్ నిర్విరామంగా కృషి చేస్తుందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎస్. శ్రీనివాసరావు, కార్యదర్శి దబ్బెట రాజమల్లు, మండల నాయకులు సాంబయ్య, విజయ్‌కుమార్, అసద్, మహేష్, వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.


తపస్ కాలసూచీని విడుదల చేస్తున్న మండల విద్యాధికారి రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు

చెన్నూరు



3 నుంచి గ్రామ సభలు

జైపూర్, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో వచ్చే నెల 3 నుంచి పంచాయతీరాజ్ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 3న రామారావుపేట, ముదిగుంట, ఇందారం, భీమారం, దాంపూర్, బూరుగుపల్లి, 4న జైపూర్, గంగిపెల్లి, పెగడపల్లి, టేకుమట్ల, ఎల్కంటి, కొత్తపెల్లి, మద్దికల్, ఆరెపల్లి, పోలంపెల్లి, క్రిష్టాపూర్, కుందారం, 5వ తేదిన శెట్‌పెల్లి, బెజ్జాల, నర్సింగాపూర్, శివ్వారం, పౌనూర్, వేలాల, 6వ తేదిన మిట్టపెల్లిలో సమావేశాలు జరగనున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదరహితంగా వేడుకలు నిర్వహించుకోవాలి

జైపూర్, న్యూస్‌టుడే: ప్రమాదరహితంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవాలని జైపూర్ ఏసీపీ సీతారాములు అన్నారు. ఆదివారం రాత్రి విస్తృత తనిఖీలు చేపడతామని.. ఇతరులకు ఇబ్బందులు కలగకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

మందమర్రి పట్టణం: మందమర్రి సర్కిల్ పరిధిలోని మందమర్రి, కాసిపేట, రామకృష్ణాపూర్ పట్టణాల ప్రజలు నూతన సంవత్సరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్‌రావు తెలిపారు. శనివారం మందమర్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. మందమర్రి మార్కెట్, పాతబస్టాండ్, పాలచెట్టు, సోమగూడెం, యాప, క్యాతనపల్లి చౌరస్తా, బీజోన్ చౌరస్తా, ఆర్కే1 ఏరియా తదితర ప్రాంతాల్లో పికెటింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై, ఒకే వాహనంపై ముగ్గురు వెళ్తున్నా వారిని పట్టుకుని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వివరించారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు ప్రతి కాలనీలో ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డీజేలకు అనుమతి లేదని వినియోగిస్తే చర్యలు తప్పవని హితవు పలికారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమాచారాన్ని తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే అక్కడికి చేరుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ప్రదీప్‌కుమార్, భాస్కర్‌రావు (మందమర్రి), ప్రేంకుమార్ (రామకృష్ణాపూర్) తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ రాంచందర్‌రావు, పక్కన ఎస్సైలు ప్రదీప్‌కుమార్, భాస్కర్‌రావు, ప్రేంకుమార్

చెన్నూరు ప్రయాణ ప్రాంగణం అభివృద్ధికి రు.35 లక్షలు మంజూరు

ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చెన్నూరు ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం అభివృద్ధికి రు.35 లక్షల నిధులు మంజూరైనట్లు ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు అన్నారు. శనివారంసాయంత్రం చెన్నూరు కొత్తబస్టాండ్‌ను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండ్‌ను అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పురాణం సతీష్ రు.10 లక్షలు, తాను రు.5 లక్షలను మంజూరుచేయగా ప్రభుత్వం మరో రు.20 లక్షలను కేటాయించిందని ఆయన పేర్కొన్నారు. మంజూరైన నిధులతో ప్రయాణ పాంగణంలో సీసీ పనులను చేపడుతామని పేర్కొన్నారు. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు దూరమవుతాయని చెప్పారు. ఆర్టీసీ డిపో ఏర్పాటుకు చెన్నూరులో 6 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి సాదనబోయిన కృష్ణ, నాయిని సతీష్, అయ్యూబ్, వెన్నపురెడ్డి బాపురెడ్డి, గట్ల చందర్, తదితరులు పాల్గొన్నారు.


పురపాలిక కమిషనర్ సమ్మయ్యకు వినతిపత్రం ఇస్తున్న వ్యాపారులు

రహదారి వెడల్పు పనులు నిలిపివేయాలి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి సాయిబాబా ఆలయం నుంచి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు చేపట్టనున్న కోల్‌బెల్ట్ రహదారి వెడల్పు పనులను నిలిపివేయాలంటూ చిరు వ్యాపారులు స్థానిక పురపాలిక కమిషనర్ సల్వాజీ సమ్మయ్యకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి సత్యనారాయణ, షబ్బీర్, దాసరి రాజు, కడారి సత్యనారాయణ, కే.ధర్మరాజు మాట్లాడారు. రహదారి వెడల్పుతో 30 ఏళ్లుగా ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న దుకాణాలను కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ప్రత్యామ్నాయం చూపించి ఆదుకోవాలన్నారు. లేకుండా తమ కుటుంబాలు రోడ్డు పడాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దొమ్మటి చంటి, పోలు కుమారస్వామి, పచ్చిక జోగయ్య, వరద రాబర్ట్, ఎర్ర ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి ఎస్సై ప్రదీప్‌కుమార్‌కు పదోన్నతి

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: మందమర్రి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న ఎస్సై అదుముల్ల ప్రదీప్‌కుమార్‌కు ఆదిలాబాద్ గ్రామీణం సీఐగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి (డీజీపీ) శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2009 బ్యాచ్‌కు చెందిన ప్రదీప్ మంథని ముత్తారంలో మొదటి పోస్టింగ్ చేరారు. అనంతరం ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రామగుండం, కమాన్‌పూర్, కమలాపూర్, రామగుండం స్పెషల్‌బ్రాంచ్‌లో ఎస్సై పనిచేశారు. ఐదు నెలల క్రితం బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రదీప్ మందమర్రి ఎస్సై బాధ్యతలు స్వీకరించే సమయానికి అంతకు ముందు జరిగిన కొన్ని కారణాల వల్ల 140కిపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ క్రమంలో ఓ వైపు సమర్థంగా విధులు నిర్వహిస్తూనే కేవలం ఐదు నెలల్లో వందకు పైగా పెండింగ్ కేసులను పరిష్కరించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. పదోన్నతిపై వెళ్తున్న ప్రదీప్‌కు సీఐ రాంచందర్‌రావు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సర్వాయిపేట్‌లో పారిశుద్ధ్య పనులు

కోటపల్లి, న్యూస్‌టుడే: కోటపల్లి మండలం సర్వాయిపేట్ పంచాయతీ పరిధిలో శనివారం సర్పంచి దుర్గం మహేష్, కార్యదర్శి రవళి పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. మురుగుకాల్వల్లో నిండిన పూడికను తొలగించడంతో పాటు తాగునీటి వసతుల వద్ద బ్లీచింగ్‌పొడిని చల్లించారు. వివిధ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. గ్రామ పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ పంచాయతీకి సహకారం అందించాలని కోరారు.

చెన్నూరు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

26 ఏళ్ల తర్వాత మళ్లీ కలిశారు..

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చదువుకున్న పాఠశాలను.. విద్యాబుద్ధులు చెప్పిన గురువులను గుర్తుచుకుంటే జీవితంలో అంతకంటే సార్థకత మరేది ఉండదు. ఎప్పుడో కలిసి చదువుకున్నవారు ఒక్కచోటికి చేరి నాటి జ్ఞాపకాలను స్మరించుకుంటే చెప్పలేని అనుభూతి ఉంటుంది. అప్పుడు చదువులు నేర్పిన ఉపాధ్యాయులను కలుసుకొని నాటి జ్ఞాపకాలను వారితో పంచుకుంటే అంతకంటే మధురం మరొకటి ఉండదు. ఇలాంటి సందర్భానికి వేదికగా నిలిచింది చెన్నూరు పట్టణం.. 1990-91లో చెన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న చిన్ననాటి మిత్రులంతా శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. 26 ఏళ్ల తర్వాత వీరంతా ఒక్కచోట కలుసుకున్నారు. ఈసందర్భంగా తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఉద్వేగానికి లోనయ్యారు. వారికి విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు రెవెల్లి రామయ్య, కారెంగుల రామయ్య, కొమ్మెర రామ్మూర్తి, సత్యనారాయణ, మవాది నారాయణరావు, కాసుల రవీందర్, క్రిష్ణమూర్తిలను కార్యక్రమానికి ఆహ్వానించి వారికి జ్ఞాపికలు అందజేసి శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. పేద విద్యార్థులకు అండగా నిలవాలని వారు నిర్ణయించారు. పూర్వ విద్యార్థులు సిహెచ్ శ్రీనివాస్, ఎస్. శ్రీనివాస్, తారాచంద్, గణేష్, వైద్య సంతోష్, నారాయణ్‌దేవుడా, శివరాము, రెవెల్లి రాజేష్, పుప్పాల విజయ్, మామిడి సుధాకర్‌లు పాల్గొన్నారు.


చెన్నూరులో కలుసుకున్న 1990-91బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వ విద్యార్థులు

ఏబీవీపీ నూతన కార్యవర్గం ఎన్నిక


శ్రీహర్ష


ప్రవీణ్‌కుమార్

మందమర్రి పట్టణం, న్యూస్‌టుడే: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) మందమర్రి పట్టణ నూతన కార్యవర్గాన్ని శనివారం ఇక్కడ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భాగ్ కన్వీనర్‌గా బచ్చలి ప్రవీణ్‌కుమార్, కోకన్వీనర్‌గా వేముగంటి శ్రీహర్ష నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు.

పాఠశాలల్లో ముందస్తు నూతన సంవత్సర వేడుకలు

చెన్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే: చెన్నూరు పట్టణంలోని న్యూస్టేట్, న్యూలయోలా, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం ముందస్తుగా నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి కేకుకోశారు. అనంతరం పిల్లలు ఒకరికొకరు ముందస్తు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇష్తాక్అలీ, పుప్పాల ప్రవీణ్, సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పట్టణంలోని ఎస్ఆర్‌కే పాఠశాలలో ముందస్తు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు కేకు కోసి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెద్దపల్లి ఉప్పలయ్య, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రి పట్టణం: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా మందమర్రి మాంటిస్సోరి పాఠశాలలో శనివారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ చిట్టిపొట్టి చేతులతో మన సంస్కృతిని ప్రతిబింబించే ముగ్గులు వేశారు. వివిధ రంగుల్లో వేసిన అందమైన రంగవల్లులు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం న్యాయ నిర్ణేతలు ఉత్తమ రంగవల్లులను ఎంపిక చేశారు. అనంతరం తరగతి గదులలో ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో కేక్ కోసి అందరికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పోలు శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయురాలు పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.


ఎస్ఆర్‌కే పాఠశాలలో కేకు కోసి సంబరాలు జరుపుకొంటున్న విద్యార్థులు


మందమర్రిలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు


మరుగుదొడ్లను పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

అభివృద్ధి పనుల పరిశీలన

జైపూర్, న్యూస్‌టుడే: మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శనివారం కేంద్ర సర్వీస్‌ల కమిటీ సభ్యులు గజేంద్ర సింగ్, సంజీవ్‌ఖలా, సంజయ్‌రావత్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా కిష్టాపూర్ గ్రామంలో పర్యటించిన సభ్యులు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లను, పాఠశాల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని, గ్రామంలో చేపట్టిన హరితహారం పనులను పరిశీలించారు. వీరి వెంట ఎంపీడీవో నాగేశ్వర్ రెడ్డి, ఏపీఓ సత్యనారాయణ, కార్యదర్శి భాగ్యలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంబరాలు

రామకృష్ణాపూర్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల వివాహ ప్రోత్సాహకాన్ని పెంచుతూ తీసుకున్న నిర్ణయం పట్ల దివ్యాంగులు సంబరాలు జరుపుకొన్నారు. శనివారం రామకృష్ణాపూర్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల చైతన్య వేదిక ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వేదిక జిల్లా అధ్యక్షుడు మెడపట్ల సతీష్ మాట్లాడుతూ... వివాహ ప్రోత్సాహకాన్ని రూ.50వేల నుంచి రూ.1 లక్షకు పెంచడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో వేదిక ప్రధాన కార్యదర్శి సముద్రాల చిరంజీవి, తాళ్లపల్లి దుర్గయ్య, మందసతీష్, నరేష్, విజయ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

